APTEL 16257

# తెలుగు ట్రాక్
TELUGU TRACK

Volume : 1 :: Issue : 38 WEEKLY MONDAY 11 September 2023 Pages 16 Rs.10/- VIJAYAWADA

## భళా భారత్

న్యూఢిల్లీ : భారత్ ఆతిధ్యమిచ్చిన జి 20 సమావేశాలు విజయవంతంగా ముగిసాయి. దాదాపు 30 దేశాల అగ్ర నేతలు, ఉన్నతాధికారులు జీ20 సమావేశాలలో పాల్గొన్నారు. . ఈ శిఖరాగ్ర సదస్సులోని మూడో సెషన్ 'ఒకే భవిష్యత్తు'పై దృష్టి సారించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. గ్లోబల్ విలేజ్ భావనకు అతీతంగా గ్లోబల్ ఫ్యామిలీ స్వప్నాన్ని సాకారం చేసుకోవడం కోసం కృషి జరగాలన్నారు.



జీ20 దేశాల నేతలు ఆదివారం ఉదయం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. వీరంతా ఖద్దరు శాలువలు ధరించడం విశేషం. దీనిపై ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఛైర్మన్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, స్వయం సమృద్ధ భారత్‌కు చిహ్నం ఖాదీ అని తెలిపారు. ఖాదీ మన సంస్కృతిలో భాగమని చెప్పారు. నేడు ఖాదీని విదేశీ అతిథులకు బహుమతిగా ఇవ్వడం మన దేశానికి గర్వకారణమని తెలిపారు. ఖాదీ పట్ల మోదీ ఎల్లప్పుడూ ప్రత్యేకమైన ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఖాదీ జాకెట్, కుర్తా పట్ల అందరూ ఆకర్షితులవుతున్నారన్నారు. మోదీ జాకెట్ చాలా మంచి పేరు తెచ్చుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఉత్పత్తుల అమ్మకాలు రూ.1.35 లక్షల కోట్లు దాటినట్లు తెలిపారు. ఈ పరిశ్రమ దాదాపు 9.45 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. రానున్న కాలంలో ఈ రికార్డులను అధిగమిస్తాని తెలిపారు.

పూర్తి వివరాలు లోపలి పేజీల్లో........

## బాబుకు రిమాండ్

**స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అరెస్టు అయిన చంద్ర బాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ నెల 22 వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఏసీబీ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.దీంతో మూడు రోజుల ఉత్కంఠకు తెరపడింది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏపీ వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు.**



- స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబుపై అభియోగాలు
- సుదీర్ఘ వాదనలు వినిపించిన ఇరుపక్షాలు
- సి ఐ డి వాదనలతో ఏకీభవించిన కోర్టు
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఏసిబి కోర్టు
- జైలుకు బదులుగా గృహ నిర్బంధంలో ఉంచాలని బాబు పిటీషన్
- కస్టడీకి ఇవ్వాలని సిఐడి పిటీషన్

పూర్తి వివరాలు లోపలి పేజీల్లో........

## జన్మదిన శుభాకాంక్షలు






# లిక్కర్ స్కాం లో అప్రూవర్ గా మాగుంట

తెలుగు ట్రాక్,ఒంగోలు,

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కొత్తగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అప్రూవర్ గా మారారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆయన పేరు కూడా ఉంది. గతంలో ఆయనకు ఒకటి , రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ విచారణ కు హాజరు కాలేదు. ఆయన కుమారుడు రాఘవనరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసింది. ఇటీవల ఆయన బెయిల్ పొందారు. ఆ తర్వాత ఆయన అప్రూవర్ పిటిషన్ వేశారు. దానికి కోర్టు అంగీకరించింది. ఇప్పుడు మాగుంట కూడా అప్రూవర్ పిటిషన్ వేయడం ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలకంగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇటీవల ఎమ్మెల్సీ కవితకు ఆడిటర్ గా వ్యవహరించిన బుచ్చిబాబును ప్రశ్నించారు. ఈ క్రమంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి చెప్పిన వివరాలతో.. ఈడీ దూకుడు పెంచినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి నగదు తరలింపు వ్యవహారంపై ఈడీ కీలక ఆధారాలు సేకరించినట్లుగా చెబుతున్నారు. తెలంగాణ లో అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత తరపున ఢిల్లీలో వ్యవహారాలు చక్కబెట్టే వ్యక్తి దగ్గర నుంచి ఇప్పటికే ఈడీ అధికారులు స్టేట్ మెంట్ తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ లాబీ తరపున అరెస్ట్ అయిన అరబిందో శరత్ చంద్రారెడ్డితో పాటు మాగుంట రాఘవరెడ్డి అప్రూవర్ గా మారి క్షమాభిక్ష బెయిల్స్ తెచ్చుకున్నారు. ఆడిటర్ బుచ్చిబాబు కూడా అప్రూవర్ అయినట్లుగా తెలుస్తోంది.బాలాజీ గ్రూప్ యజమానిగా ఉన్న వైసీపీ ఎంపీ శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవ ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేస్తుంటారు. గత 70 ఏళ్లుగా లిక్కర్ బిజినెస్ చేస్తున్న మాగుంట కుటుంబం ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఇరుక్కుంది. దేశ వ్యాప్తంగా మాగుంట కుటుంబానికి పలు లిక్కర్ వ్యాపారాలు ఉన్నాయి. బాలాజీ గ్రూప్ పేరుతో డిస్టిలరీస్ కాకుండా, ఏంజెల్ షాంపైన్ ఎల్ఎల్పీ, తమిళనాడు డిస్టిలరీ ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ఇతర కంపెనీలు మాగుంట కుటుంబానికి సంబంధించిన రెండు కీలక సంస్థలు లైసెన్స్‌లు పొందినట్లుగా దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఈ సంస్థలు లిక్కర్ తయారీ, పంపిణీలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. బాలాజీ గ్రూప్ ఆఫ్ కంపెనీల ద్వారా మద్యం. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22 నియమాలు ఏ కంపెనీకి రెండు జోన్ల కంటే ఎక్కువ కేటాయించకూడదని స్పష్టంగా చేసినా.. పిక్సీ ఎంటర్ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ మాగుంట ఆగ్రో ఫాష్ ప్రైవేట్ లిమిటెడ్లకు జోన్ 32, జోన్లకు జోనల్ రిటైల్ లైసెన్సులు లభించటం స్కామ్‌లో భాగమని చెబుతున్నారు.

# అద్దె బోర్డు కనిపించిదో, బ్యాంకు ఖాళీ

తెలుగు ట్రాక్,విజయవాడ

సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాలు అన్వేషిస్తూ అమాయకుల నుంచి డబ్బులు కొట్టేస్తున్నారు. ఇల్లు అద్దెకు ఇస్తానని టులెట్ బోర్డు పెట్టిన ఓనర్ కు సైబర్ కేటుగాళ్లు షాకిచ్చారు.కాదేదీ సైబర్ నేరానికి అనర్హం అన్నట్లు మారిపోతున్నాయి పరిస్థితులు. రోజు రోజుకు సైబర్ నేరాలను కొత్తపుంతల్ని తొక్కిస్తున్నారు. అమాయకులే లక్ష్యంగా కొత్త మార్గాల్లో కేటుగాళ్లు డబ్బులు కొట్టేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ మారుతుంది. ఆ టెక్నాలజీలో లోపాలను కనిపెట్టి సామాన్యుల డబ్బుకొట్టేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. నిన్నటి వరకూ కరెంట్ బిల్లులు కట్టలేదని ఫేక్ మెసేజ్ లు పంపి ఖాతాల్లో డబ్బు మాయం చేస్తున్నారు. తాజాగా విజయవాడలో టులెట్ బోర్డు పెట్టిన ఓ యజమానిని సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. ఓఎల్ఎక్స్ లో ఇల్లు అద్దెకు ఇస్తామని టులెట్ బోర్డు పెట్టిన ఓనర్ నుంచి 4.35 లక్షలు దోచేశారు సైబర్ కేటుగాళు ..విజయవాడ కానూరుకు చెందిన సత్యనారాయణ తన ఫ్లాట్ ను అద్దెకు ఇచ్చేందుకు ఓఎల్ఎస్స్ లో టులెట్ బోర్డు పెట్టాడు. దీనిపై ఉన్న ఫోన్ నెంబర్ కు కొన్ని రోజులకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ఆర్మీలో పనిచేస్తానంటూ ఓ వ్యక్తి సత్యనారాయణకు ఫోన్ చేశాడు. ఫ్లాట్ అద్దెకు కావాలని, కొన్ని ఫోటోలు పెట్టమని ఇంటి యజమానిని నమ్మించాడు. సైబర్ కేటుగాడి మాటలు నమ్మిన సత్యనారాయణ వెంటనే ఫ్లాట్ ఫొటోలు తీసి పెట్టాడు. ఇల్లు నచ్చిందని, అద్దెకు దిగుతానని నమ్మించి యజమాని ఖాతాల్లోంచి డబ్బు కొట్టేశారు. అడ్వాన్స్ ఇస్తానని చెప్పి ఫోన్ పే ఓపెన్ చెయ్యమని చెప్పాడు సైబర్ మోసగాడు. ఫోన్ పే ఓపెన్ చేసిన కొద్దిసేపటికి సత్యనారాయణ బ్యాంకు ఖాతాలో డబ్బు మొత్తం ఖాళీ అయింది. అయితే తాను ఎలాంటి ఓటీపీ, ఖాతా వివరాలు చెప్పకుండా డబ్బులు పోయాయని ఇంటి యజమాని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఏద్దైనా యాప్ ను డౌన్ లోడ్ చేసుకున్నప్పుడు గుడ్డిగా 'అలౌ' కొడుతున్నారా? ఇదే మీ ఖాతాలు ఖాళీ చేస్తాయి. కొత్త ఫీచర్స్ యాప్స్, ఏపీకే ఫైల్స్ మార్కెట్‌లోకి నిత్యం వస్తూనే ఉన్నాయి. గతంలో ఏవైనా యాప్స్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. ఇన్‌స్టాల్ చేసి ఓపెన్ చేయడానికి పరిమితమైన నిబంధనలు ఉండేవి. కానీ ఇప్పుడు యాప్ ఇన్ స్టాల్ చేసుకోడానికి వ్యక్తి వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, కాంటాక్ట్స్ వంటివి విలువైన వాటిని అనుమతి ఇస్తేనే యాప్స్ ఓపెన్ అవుతున్నాయి. సైబర్ నేరగాళ్లకు ఈ సమాచారమే సంపదగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఈ డేటాను విశ్లేషించి అమాయకులను బురిడీ కొట్టింటి డబ్బు లు దోచుకుంటున్నారు. థర్డ్ పార్టీ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు దాన్ని ఓపెన్ చేసే క్రమంలో అలౌ కొడతాం. ఈ అనుమతే మన కాంటాక్ట్ లిస్టులో సమాచారం, గ్యాలరీ, వీడియోలు వంటి ముఖ్యమైన సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి దక్కుతుంది. స్మార్ట్ వాచ్ యాక్టివేట్ చేయడానికి నిబంధనలు అర్థం చేసుకోకుండానే యాక్సెప్ట్ క్లిక్ చేస్తుంటాం. ఇలా ఇచ్చిన అనుమతులే సైబర్ నేరగాళ్లు వారికి అనుకూలంగా మార్చుకుంటారు. ఇలా అనుమతులు అడుతున్నారంటే సైబర్ నేరగాళ్ల వలలో పడినట్లే. థర్డ్ పార్టీ యాప్స్ వల్ల సైబర్ నేరాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి.

# మళ్లీ 2014 కూటమి?

తెలుగు ట్రాక్,విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 2014 సీన్ 2024 ఎన్నికల్లోనూ రిపీట్ అవుతుందా ? తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు మళ్లీ కలుస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది. కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు అవే సంకేతాలను సూచిస్తున్నాయ్. ఢిల్లీలో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో విభేదాలను పక్కనపెట్టి ప్రధాని మోడీ టీడీపీ అధినేత చంద్రబాబుకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. సమావేశం ముగిసిన తర్వాత ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. దీంతో ఇద్దరు నేతల మధ్య విభేదాలు సమసిపోయాయని రెండు పార్టీల మధ్య పొత్తులు ఉంటాయన్న ప్రచారం అప్పట్లోనే మొదలైంది.

2014 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కాంబినేషన్ హిట్ అయింది. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో ఈ మూడు పార్టీలు విడివిడిగా పోటీ చేసి బొక్కాబోర్లా పడ్డాయ్. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైతే జనసేనకు ఒకే ఒక్క సీటు వచ్చింది. బీజేపీ ఒక్క శాతం ఓట్లే దక్కించుకుని.. ఏపీలో అడ్రస్ లేకుండాపోయింది. పవన్ కళ్యాణ్ అనుకున్న స్థాయిలో ప్రభావితం చేయలేకపోయారు. స్వయంగా తాను పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓటమి చెందారు. 2019 ఎన్నికల తర్వాత బీజేపీ-జనసేన తిరిగి ఏకమయ్యాయి. టీడీపీ కూడా బీజేపీతో గ్యాప్ తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ.. ఆ కాంబినేషన్ మళ్లీ వర్కవుట్ అవుతుందా..? అనే చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ మధ్య ఉన్న కొద్దిపాటి సమస్యలు పరిష్కారం అవుతాయని.. కలిసే ఎన్నికలకు వెళ్తామని జనసేనాని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. బహిరంగంగా చెప్పకున్నా.. టీడీపీ-బీజేపీ కలిసి ఎన్నికలకు వెళ్లేందుకు నిర్ణయం తీసేసుకున్నాయనేలా.. పవన్ కల్యాణ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. టీడీపీ-బీజేపీ పార్టీలను తిరిగి ఒకే తాటి మీదకు తెచ్చేందుకు పవన్ మధ్యవర్తిత్వం వహించారు. దీన్ని జనసేనాని కూడా బహిరంగంగానే అంగీకరించారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా చూసుకునే క్రమంలోనే బీజేపీ పెద్దలను కలుస్తున్నట్లు స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ బీజేపీ పెద్దలను కలిసిన తర్వాత చంద్రబాబు వరుసగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. చంద్రబాబుతో భేటీ తర్వాత ఏపీకి వచ్చిన అమిత్ షా, జేపీ నడ్డా, ఇతర బీజేపీ నేతలు వైసీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. జగన్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టారు. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు మళ్లీ కలుస్తున్నాయంటూ వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజును తప్పించి పురంధేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏపీ నేతల్లో కూడా స్పష్టమైన మార్పు కన్పిస్తోంది. నాయకత్వ మార్పు తర్వాత పొత్తుల అంశం, టీడీపీ అధినేత చంద్రబాబు మీద విమర్శలు తగ్గిపోయాయి. ప్రస్తుత ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి సీఎం జగన్ టార్గెట్ గా విమర్శలు చేస్తున్నారు. మరిది చంద్రబాబును పురంధేశ్వరి ఎక్కడా పల్లెత్తు మాట అనడం లేదు. పొత్తులపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించేశారు. ఢిల్లీలో జరిగిన ఎన్టీఆర్ వంద రూపాయల నాణెం విడుదల సందర్భంగా ఎన్టీఆర్ కుటుంబసభ్యులంతా కలుసుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అదే సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రావడం చంద్రబాబు, నడ్డా పక్కపక్కన కూర్చొని మాట్లాడుకోవడంతో ఏపీలో టీడీపీ, బీజేపీ మళ్లీ కలుస్తాయంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. విపక్షాలన్నీ కూటమిగా ఏర్పాటు కావడంతో బీజేపీ తన పాత మిత్రులను మళ్లీ దగ్గరకు తీసుకుంటోంది. గతంలో ఎన్డీఏ కూటమిలో పని చేసిన పార్టీ నేతలను ఆహ్వానించి ప్రధాని మోడీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ తర్వాతే బీజేపీతో కలిసి పని చేసేందుకు జేడీఎస్ ముందుకు వచ్చింది. ఇపుడు అదే దారిలో టీడీపీ కూడా బీజేపీతో కలిసి పని చేస్తుందా ? పాత మిత్రులు మళ్లీ దగ్గరవుతారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# అసలు స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ ఏంటీ

తెలుగు ట్రాక్,విజయవాడ

స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ కేసు ఏపీలో సంచలనంగా మారింది. కొంతకాలంగా ఈ స్కామ్ పై విచారణ జరుగుతుండగా? తాజాగా చంద్రబాబును అరెస్ట్ చేసింది సీఐడీ. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసింది సీఐడీ. ఇప్పటికే ఈ కుంభకోణం పై ఈడీ కూడా విచారణ జరుపుతుండగా? పలువురు అరెస్ట్ అయ్యారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అటాచ్ మెంట్లు జరిగాయి. షెల్ కంపెనీల ద్వారా రూ 241 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా చంద్రబాబును అరెస్ట్ చేసింది సీఐడీ. అయితే ఈ కేసు నేపథ్యం ఏంటి? అనేది చూస్తే..చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామంటూ రూ.3300 కోట్లకు సీమెన్స్ సంస్థ - డిజైన్‌టెక్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో ప్రభుత్వం 10శాతం నిధులు, మిగిలిన 90 శాతం సీమెన్స్ సంస్థ చెల్లించేలా ఒప్పందం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున 10శాతం వాటాగా జీఎస్టీతో కలిపి రూ.370 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వం చెల్లించిన రూ.370 కోట్లలో రూ.240 కోట్ల రూపాయలను సీమెన్స్ సంస్థ పేరుతో కాకుండా డిజైన్‌టెక్ సంస్థకు బదలాయించారంటూ ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. కేబినెట్‌ను తప్పుదారిపట్టించి ఆ తర్వాత ఒప్పందంలో మరొకటిపెట్టి? డబ్బులు కాజేశారని అభియోగాలు ఉన్నాయి. దీనిపై గత కొంత కాలంగా లోతుగా విచారిస్తున్న సీఐడీ? పలువురిపై కేసులు కూడా నమోదు చేసింది. ఈ వ్యవహారాన్ని ఈడీ దృష్టికి కూడా తీసుకెళ్లగా?. వారు కూడా దర్యాప్తు చేస్తున్నారు.దాదాపు రూ. 240 కోట్లు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు ఏపీ సీఐడీ గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం కట్టిన రూ. 370 కోట్లలో రూ.240 కోట్లను వేర్వేరు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు సీఐడీ అధికారులు నిగ్గుతేల్చారు. ఎలైట్ కంప్యూటర్స్, స్కిల్లర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, నాలెడ్జ్ పోడియం, ఈటీఏ- గ్రీన్స్, కేడన్స్ పార్టనర్ తదితర కంపెనీలకు నిధులు మళ్లించారు. నాడు సీమెన్స్ సంస్థ ఇండియా హెడ్‌గా ఉన్న సుమన్ బోస్, డిజైన్‌టెక్ సంస్థ ఎండీగా ఉన్న వికాస్ కన్వికర్ ద్వారా కుంభకోణం నడిపించినట్టు సీఐడీ విచారణలో వెలుగుచూసింది. నిజానికి రూ.3300 కోట్ల ప్రాజెక్టుగా ఎంఓయూ చేసుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. జీవోలో మాత్రం రూ.3300 కోట్ల ప్రస్తావనను తొలగించింది. చివరకు రూ.240 కోట్ల రూపాయలను షెల్ కంపెనీల ద్వారా మళ్లించేశారని సీఐడీ ఆరోపిస్తోంది.ఈ కుంభకోణం 2016- 2018 మధ్య జరిగింది. దీనిపై గతంలోనే ఏసీబీకి పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటిప్రభుత్వం ఒప్పందానికి సంబంధించిన అసలు ఫైళ్లను మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులను మేనేజ్ చేసే సమయంలో.. కేంద్రం ప్రభుత్వ జీఎస్టీ అధికారుల దర్యాప్తులో అసలు కుట్ర బయట పడింది. దీంతో ఈ స్కామ్‌పై కేంద్రం ఆదాయపుపన్ను శాఖ కూడా ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంపై అప్పటికే విచారణ జరుపుతున్న రాష్ట్ర సీఐడీ అధికారులు ఈ సంస్థలన్నింటితో సీఐడీ అధికారులు కో-ఆర్డినేట్ చేకుని విచారణ జరిపారు.గ్లోబల్ సంస్థ సీమెన్స్ ఇంటర్నెల్ టీంకూడా తమ కంపెనీ పేరుమీద మోసాలకు పాల్పడ్డారని.. తమకు ఎలాంటి సంబంధం లేదని పూర్తి ఆధారాలను సీఐడీకి అందజేసింది. ఈ కుంభకోణానికి సహకరించిన ఆనాటి అధికారులు కూడా కోర్టుకు ముందుకు వచ్చి స్టేట్‌మెంట్లు ఇచ్చారు.ఈ కేసులో ఏ-1గా చంద్రబాబు ఉండగా, ఏ-2గా అచ్చెన్నాయుడు ఉన్నారు.చంద్రబాబు బాబు పై 120(బి), 166, 167,418, 420, 465, 468, 201, 109, రీడ్‌విత్ 34 జీనిట 37 ఐపీసీ సెక్షన్ ల కింద కేసులు నమోదు చేశారు సీఐడీ పోలీసులు. సీఆర్‌పీసీ సెక్షన్ 50(1) నోటీస్ ఇచ్చిన సీఐడీ.. 1988 ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ చట్టం కింద చంద్రబాబును శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఉత్కంఠగా మారింది.స్కిల్ డెలప్ మెంట్ కేసులో కావాలనే చంద్రబాబుపై వైసీపీ సర్కార్ కుట్ర చేస్తోందని కొంతకాలంగా టీడీపీ ఆరోపిస్తూ వస్తోంది. అయితే ఈ కేసులో చంద్రబాబుకు భాగం ఉందంటూ వైసీపీ కూడా ఆరోపిస్తోంది. ఈ కేసు విషయంపై కొంతకాలంగా ఇరు పార్టీల మధ్య తీవ్రస్థాయిలో డైలాగ్ వార్ నడుస్తోంది. ఇక ఇటీవలే చంద్రబాబు మాట్లాడుతూ రేపోమాపో నన్ను అరెస్ట్ చేస్తారేమో అంటూ ఓ సందర్భంగా మాట్లాడారు. ఇంతలోనే చంద్రబాబును అరెస్ట్ చేయటం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

# విస్తరించిన జీ 20



## ఆఫ్రికా దేశాలకు సభ్యత్వం కల్పించిన మోడీ

న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సమావేశాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ సమావేశంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇచ్చారు. శనివారం భారత్ మండపంలో జరిగిన వన్ ఎర్త్ సెషన్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ ప్రసంగంలోనే ఆయన ఈ విషయాన్ని ప్రతిపాదన చేశారు. అందరు సభ్యుల అంగీకారంతో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం ఇస్తున్నట్లు ప్రకటన చేశారు. ఆ తర్వాత ఆఫ్రికన్ యూనియన్ అధినేతను శాశ్వత సభ్యులకు కేటాయించినటువంటి కూర్చీలో కూర్చోబెట్టారు. అయితే ఈ సదస్సులో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ మొరాకోలో సంభవించిన భూకంప మృతులుక సంతాపాన్ని తెలియజేస్తున్నానని చెప్పారు. ప్రపంచం మొత్తం మొరాకోకు అండగా నిలవాలని కోరారు. వారికి అవసరమైన సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.అలాగే జీ20 అధ్యక్ష హోదాలో భారత్ మీకు స్వాగతం పలుకుతోందంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 21వ శతాబ్దంలో ప్రపంచానికి కొత్త దిశ, దశను సూచించేందుకు ఇదే కీలకమైన సమయమని పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఉన్నటువంటి పాత సవాళ్లు ఇప్పుడు కొత్త సమాధానాలు కోరుతున్నాయని.. అందుకునే మనం హ్యూమన్ సెంట్రిక్ అప్రోచ్‌తో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. కరోనా సంక్షోభం వచ్చిన తర్వాత ప్రపంచ దేశాల్లో విశ్వాస రాహిత్యం ఏర్పడిందని.. యుద్ధం ఈ అపనమ్మకాన్ని మరితంగా పెంచేసిందని అన్నారు. కరోనాను ఓడించిన మనం ఈ విశ్వాస రాహిత్యంపై విజయం సాధించగలమని పేర్కొన్నారు. మనమందరం కలిసి ప్రపంచంలో నెలకొన్నటువంటి అపనమ్మకాన్ని పారదోలుదామని.. ఈ క్రమంలోనే సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ మంత్రం మనకు మార్గదర్శకంగా ఉంటుందని వివరించారు.అలాగే ప్రపంచంలో పేద, సంపన్న దేశాల మధ్య భేదాలు? ఆహారం, ఇంధనం నిర్వహణ, ఆరోగ్యం, ఎనర్జీ, నీటీ భద్రత వంటి వాటిలో నెలకొన్న సమస్యలకు సమాధానం కోసం ముందుకు వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. భారత్ జీ20 అధ్యక్షతన.. దేశం లోపల, బయట అందరిని కలుపుకోని పోయేందుకు ప్రతీకగా నిలిచినట్లు తెలిపారు. అయితే ఇది ప్రజల జీ20 అనడానికి నిదర్శనంగా మారినట్లు పేర్కొన్నారు. దేశంలోని 70కి పైగా నగరాల్లో 200లకు పైగా జీ20 సదస్సులు జరిగినట్లు వెల్లడించారు. సబ్‌కా సాత్ అనే భావనతోనే ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20 సభ్యత్వం ఇవ్వాలని భారత్ ప్రతిపాదన చేస్తోందని.. దీనికి అంగీకరిస్తారని నమ్ముతున్నానని అన్నారు. అలాగే మీ అందరి అనుమతితో జీ20 సభ్యుడి హోదాలో ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడు గ్రూపులో స్థానాన్ని స్వీకరించాలని ఆహ్వానిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. ఇదిలా ఉండగా మోదీ కూర్చున్న స్థానంలో ఇండియాకు బదులుగా భారత్ అనే నేమ్‌ప్లేట్ ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.ప్రపంచానికి కొత్త దిశ చూపించాలి: ప్రధానిప్రపంచానికి కొత్త దిశ చూపించడానికి ఈ 21 వ శతాబ్దం ఎంతో కీలకమైన సమయం. పాత సమస్యలకు కొత్త పరిష్కారాలు వెతుక్కోడానికి ఇదే మంచి తరుణం. అందుకే మానవాభివృద్ధి కేంద్రంగానే విధానాలు రూపొందించాల్సిన అవసరముంది. కొవిడ్ లాంటి మహమ్మారిని జయించగలిగితే...యుద్ధాల వల్ల ప్రజలు కోల్పోతున్న నమ్మకాన్నీ తిరిగి నిలబెట్టగలం. “జీ20 సదస్సుకి భారత్ అధ్యక్షత వహించడం ఐక్యతకు చిహ్నం. సబ్‌కా సాథ్ అనే నినాదం కేవలం దేశానికే పరిమితం కాదు. ప్రపంచానికీ వర్తిస్తుంది. ఈ సదస్సుని లీడ్ చేస్తోంది భారత దేశ ప్రజలే. కోట్లాది మంది దేశ పౌరులు పరోక్షంగా ఈ సదస్సులో భాగస్వాములై ఉన్నారు. దేశంలోని 60 నగరాల్లో దాదాపు 200 సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా భారత్ ఓ విజ్ఞప్తి చేస్తోంది. ఆఫ్రికన్ యూనియన్‌కి జీ20 దేశాల్లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనకు అందరూ అంగీకరిస్తారని ఆశిస్తున్నాను”ప్రధాని నరేంద్ర మోదీ కూర్చున్న స్థానంలో ముందు నేమ్‌ప్లేట్ ఆసక్తికరంగా మారింది. దానిపై ఎనిటతిజీ కి బదులుగా ఃప్తజీతీజీబి అని రాసుంది. పేరు మార్పుపై ఇప్పటికే చర్చ జరుగుతుండగా ప్రధాని మోదీ నేమ్‌ప్లేట్‌పై ఆ పేరు కనిపించింది. మొరాకోకి సాయం అందించేందుకు సిద్ధం: ప్రధానిప్రధాని నరేంద్ర మోదీ ఉ20 సదస్సుని ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మొరాకోలో భూకంప విపత్తులో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. గాయపడ్డవాళ్లు వీలైనంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ఈ కష్టకాలంలో మొరాకో దేశానికి ఎలాంటి సాయమైనా అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఒడిశా కోనార్క్ వీల్ వద్ద నిలబడి ప్రధాని నరేంద్ర మోదీ20 సదస్సు దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైంది.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాకుండా చారిత్రాత్మకంగా మార్చేందుకు ప్రత్యేక సన్నాహాలు చేశారు. విదేశీ అతిథులు వచ్చే చోట భారతీయ సంస్కృతికి సంబంధించిన చిహ్నాలను ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఈవెంట్ యొక్క అందాన్ని జోడించడమే కాకుండా.. భారతదేశ గొప్ప సంస్కృతిని, చారిత్రక వారసత్వం గురించి ప్రపంచానికి తెలుసుకునే అవకాశం కూడా లభిస్తుంది. భారత్.. ఇంతమంది దేశాధినేతలకు తన సంస్కృతిని ప్రదర్శించడానికి ఇంతకంటే మంచి అవకాశం దొరకదనే చెప్పొచ్చు. ఈ క్రమంలోనే ఈరోజు జీ20 సదస్సుకు వేదికైన భారత మండపంలో.. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన కోణార్క్ చక్రాన్ని ప్రదర్శించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ అతిథులకు వివరించారుఇక వివరాల్లోకి వెళ్తే.. ఈ కోణార్క్ చక్రం 13వ శతాబ్దంలో రాజు నరసింహదేవ్-ఎ పాలనలో నిర్మించబడింది. ఈ చక్రం భారతదేశ ప్రాచీన జ్ఞానం, నాగరికత, వాస్తుశిల్పం ఔన్నత్యానికి చిహ్నం. కోణార్క్ చక్రం యొక్క భ్రమణం కాలచక్రంతో పాటు పురోగతి, నిరంతర మార్పును సూచిస్తుంది. ఇది ప్రజాస్వామ్య చక్రానికి శక్తివంతమైన చిహ్నంగా కూడా పనిచేస్తుంది. ఇది ప్రజాస్వామ్య ఆదర్శాలకు, సమాజంలో పురోగతి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అయితే ఈ చక్రం ఒడిశాలోని కోణార్క్‌లో ఉన్న సూర్య దేవాలయంలో నిర్మించారు. భారత కరెన్సీ నోట్లపై కూడా ఈ కోణార్క్ చక్ర ముద్రించబడి ఉండటాన్ని మనం చూడచ్చు. ఒకప్పుడు 20 రూపాయల నోటుపై ముద్రించి, ఆపై 10 రూపాయల నోటుపై ముద్రించేవారు. కోణార్క్ చక్రం 8 వెడల్పు చువ్వలు.. అలాగే 8 సన్నని చువ్వలు కలిగి ఉంటుంది. ఆలయంలో 24 (12 జతల) చక్రాలు ఉన్నాయి. ఇవి సూర్యుని రథ చక్రాలను సూచిస్తాయి. 8 కర్రలు రోజులోని 8 గంటల గురించి చెబుతాయి. దీన్ని ఉపయోగించి, సూర్యుని స్థానం ఆధారంగా సమయాన్ని లెక్కిస్తారని నమ్ముతారు. చక్రం పరిమాణం 9 అడుగుల 9 అంగుళాలు. 12 జతల చక్రాలు సంవత్సరంలోని 12 నెలలను సూచిస్తాయని మరియు 24 చక్రాలు రోజులోని 24 గంటలను సూచిస్తాయని కూడా నమ్ముతారు.ఇదిలా జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా వివిధ దేశాధినేతలు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. భారత్ మండపంలో జరుగుతున్నటువంటి ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ వారందరికి స్వాగతం పలికారు. ఆ తర్వాత రౌండ్ టేబుల్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. మరో విషయం ఏంటంటే కొత్తగా జీ20లో సభ్యత్వం సాధించిన ఆఫ్రికా యూనియన్ అధినేతనకు ప్రధాని స్వాగతం తెలిపారు. ఆయన్ని ఆలింగనం చేసుకోని కూరిచులో కూర్చోబెట్టారు. మరోవైపు ప్రధాని మోదీ కూర్చున్నటువంటి టేబుల్‌పై దేశం నేమ్‌ప్లేట్‌పై భారత్ అని రాసి ఉంది. గత కొన్ని రోజుల నుంచి ఇండియా పేరును భారత్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చనుందని జోరుగా ప్రచారాలు నడుస్తున్నాయి. ఇప్పటివరకు అంతర్జాతీయ స్థాయిలో చూసుకుంటే భారత్‌ను ఇండియాగా గుర్తించేవారు.

అయితే ఇప్పుడు తొలిసారిగా ఓ అంతర్జాతీయ సమావేశంలో ఇండియాకు బదులుగా భారత్ అని గుర్తిస్తూ రౌండ్ టేబుల్‌పై భారత్ అనే నేమ్‌ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. ఇక ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ భారత్ మిమ్మల్ని స్వాగతిస్తుందని అన్నారు.కోణార్క్ చక్రపై ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ ఇదే..కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జీ20 సదస్సుపై ట్విట్టర్ వేదికగా మరోసారి కీలక కామెంట్స్ చేశారు. ఒడిశా రాష్ట్రాం సంస్కృతి, వారసత్వానికి జీ20 సదస్సులో గర్వించదగిన స్థానం కలిగిందని చెప్పారు. కోణార్క్ చక్ర అనేది భావి, భవిష్యత్తు తరాలకు సంబంధించిన నాగరికత భవనాలను వివరించే ఓ నిర్మాణ అద్భుతమన్న ధర్మేంద్ర ప్రధాన్.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు భారతదేశ వారసత్వం, విజ్ఞాన సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోదీ వివరించడం.. ఓ అందమైన దృశ్యంగా ఉందని కేంద్రమంత్రి ట్వీట్ చేశారు. ఉ20 సదస్సుకి వస్తున్న అతిథులకు స్వాగతం పలుకుతుండటం ఆసక్తికరంగా మారింది. యూకే ప్రధాని రిషి సునాక్ భారత్ మండపానికి చేరుకున్నారు. ప్రధాని మోదీ ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఆహ్వానం పలికారు. భారత్ మండపానికి చేరుకున్న ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడోని ప్రధాని ఆత్మీయంగా స్వాగతించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో భారత్ మండపానికి చేరుకున్నారు. ప్రధాని మోదీ ఆయనకు షేక్‌హ్యాండ్ ఇచ్చి స్వాగతం పలికారు. చైనా ప్రెసిడెంట్ జిన్‌పింగ్ రాకపోయినా ఆ దేశ ప్రధాని లీ క్వియాంగ్ ఉ20 సదస్సుకి హాజరయ్యారు. భారత్ మండపం వద్ద ప్రధాని మోదీ ఆయనను స్వాగతించారు.







# ఇండియాను పుట్టిముంచనున్న డీఎంకే

ఉదయనిధి స్టాలిన్... సినిమా నటుడు, నిర్మాత. అంతకు మించి డీఎంకే అధినేత స్టాలిన్ కొడుకు. తమిళనాడులో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి. తండ్రి ముఖ్యమంత్రి అయితే కొడుకు క్యాబినెట్‌లోకి రావడానికి వేరే అర్హతలు అవసరం లేదు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటివి కొత్త కాదు. ఈ మధ్య అతను దేశవ్యాప్తంగా బాగా పాపులర్ అయ్యాడు. ఈ విషయంలో తండ్రి పాత్ర ఇసుమంతైనా లేదు. సనాతన ధర్మాన్ని పూర్తిగా నిర్మూలించాంటూ వివాదాస్పద వ్యాఖ్యలతో ఆయన ఓవర్ నైట్ నేషనల్ స్టార్ అయిపోయాడు. ఈ అదృష్టం ఎక్కడో నూటికో కోటికో ఒకరికే పడుతుంది ఉదయనిధి ఎంతలా 'ఎదిగి' పోయాడంటే.. కేంద్ర క్యాబినెట్ భేటీలో ప్రధానమంత్రి కూడా స్వయంగా స్పందించేంత. ఇక మరో డీఎంకే నేత రాజా అయితే సనాతన ధర్మాన్ని ఎయిడ్స్ పోల్చాశాడు... వీరద్దిరి వ్యవహారంతో బీజేపీకి తంతే బూరెల బుట్టలో పడినట్టయింది. 'సనాతన' అంశాన్ని వదలొద్దంటూ మోదీ తన మంత్రివర్గ సహచరులకు దిశా నిర్దేశం చేసేంతగా! ఈ విషయంపై ఎంత రచ్చ అయితే భీజేపీకి అంత మంచిది. తమిళనాడులో కూడా 'హిందూ' భావోద్వేగాలను రెచ్చ గొడితే అక్కడ అంత తొందరగా పాగా వేయవచ్చనేది మోదీ అండ్ టీమ్ ప్లాన్. దక్షిణాది కమలం పార్టీకి కొరకరాని కొయ్యగా తయారైంది. ఉన్న కర్ణాటకలో కూడా ఈ మధ్యే అధికారం హరీ అంది. హిందూ ఓట్ల గంపగుత్తగా తమకే పడాలని ఆరెస్సెస్, భాజపా ఆలోచన. కుర్ర స్టాలిన్ వ్యాఖ్యలు కేంద్రంలో అధికార పార్టీకి ఆక్సిజన్ అందించాయి. తమిళనాడు ఓ విచిత్రమైన రాష్ట్రం. అక్కడ పెరియార్, అన్నాల ఆలోచన విధానం ఉంటుంది. అక్కడే పరువు హత్యలు కూడా ఉంటాయి. అక్కడే కుల వివక్ష ఉంటుంది,. నాలుగు దశాబ్దాలుగా డీఎంకే, అన్నా డీఎంకే మాత్రమే అధికారాన్ని పంచుకుంటున్నాయి. వెనువెంటనే రెండో సారి అధికారంలోకి వచ్చిన పార్టీ అన్నా డీఎంకే మాత్రమే. ఆ రెండు సార్లూ ముఖ్యమంత్రులను కోల్పోయిన దురదృష్టం కూడా ఆ పార్టీదే. ఎంజీయార్, జయలలిత వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి, అధికారంలో ఉండగానే మరణించారు. ఈ ప్రాంతీయ పార్టీల హవాలో కాంగ్రెస్ తన ఉనికిని ఎప్పుడో కోల్పోయింది. భాజపా తమిళనాట జెండా పాతడానికి ఉవ్విళ్ళూరుతోంది ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలపై ఉదయనిధి మరింత దృఢంగా నిలబడ్డారు. ఆయనకు అనుకూలంగా కూడా మరి కొందరు మాట్లాడుతున్నారు. కానీ కాంగ్రెస్ ఈ వివాదం నుంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తోంది. కర్ణాటకలోని కాంగ్రెస్ మంత్రి మాత్రం 'సనాతన ధర్మం' నిర్మూలన వ్యాఖ్యలను సమర్ధించారు. ఉత్తరాదికి చెందిన ఓ మఠాధిపతి ఉదయనిధి తల తెచ్చినవాళ్ళకు పదికోట్లు ఇస్తానని చెప్పడం వివాదాస్పదమైంది. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా, అనుకూలంగా సోషల్ మీడియా హోరెత్తుతోంది ఈ రచ్చే భాజపాకు కావాలి. హిందూ ఓట్లు పోలరైజ్ అవ్వాలి. నూరు లక్షల కోట్ల అప్పు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగిత నుంచి ప్రజల దృష్టిని భావోద్వేగాల వైపు మళ్లించాలి. రాబోయే ఎన్నికల్లో ప్రతి రాష్ట్రంలో భాజపా ఉదయనిధి వ్యాఖ్యలపై మాత్రమే మాట్లాడుతుంది. అక్కడ నుంచి హిందూ ఓట్లను దండుకుంటుంది. దీనివల్ల జూనియర్ స్టాలిన్ కొన్నాళ్లు మీడియా లైమ్‌లైట్‌లో ఉంటాడు. ప్రధానమంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేసి నన్ను అనుమతిస్తే, క్యాబినెట్ మంత్రులందరికీ సమాధానాలు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు నిర్ణయించిన తర్వాత 'సనాతన ధర్మం' ఏది అని నేను వివరిస్తాను.' అని రాజా అన్నారు. పుదుచ్చేరిలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాజ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను సమర్ధించారు. దీనిపై అమిత్ షా లేదా ఇతర బీజేపీ ముఖ్య నేతలు ఎవరైనా తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు.సనాతన ధర్మం ప్రజల మధ్య అసమానతలను ప్రోత్సహించిందని, మహిళల హక్కులను అరికట్టిందని అన్నారు. భర్త మరణిస్తే అతడి చితిపై కూర్చుని భార్య ప్రాణత్యాగం చేసే సతీసహగమనాన్ని సమర్ధించిందని అన్నారు. 'అటువంటి పద్ధతులను పునరుద్ధరించాలనుకుంటున్నారా? మనం అన్ని అసమానతలతో పోరాడాం.. ఈ సనాతన ధర్మాన్ని అంగీకరిస్తే.. మనం పెరియార్ (ద్రవిడ కజగం వ్యవస్థాపకుడు ఈవీ రామసామి), అన్నా (తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై), కలైంజ్ఞర్ (కరుణానిధి) సూచించిన సూత్రాలకు వ్యతిరేకం. ఈ ధర్మాన్ని అంగీకరించడం వల్ల తోటి మానవులకు మనల్ని శత్రువులుగా మారుస్తారు, నేను ఈ ధర్మాన్ని అంగీకరిస్తే నేను మనిషిని కాదు' అని రాజా ఉద్ఘాటించారుకానీ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి 'ఇండియా' మాత్రం ఇబ్బంది పడుతుంది. ఉదయనిధి వల్ల 'ఇండియా బ్లాక్'కు వచ్చే నెగటివ్ ఓట్ తమిళనాడులోనే కాకుండా దేశమంతా ప్రతిఫలించాలని భాజపా భావిస్తోంది. అదే కనుక జరిగితే... కేంద్రంలో భాజపా గెలుపు నల్లేరు మీద నడకే. అటు తిరిగి.. ఇటు తిరిగి.. ఉదయనిధి స్టాలిన్, మాజీ మంత్రి రాజా 'ఇండియా' పుట్టి ముంచేలా ఉన్నారు.

**కిరణ్ కుమార్**

# స్టాలిన్ వ్యాఖ్యలతో అస్త్రం,శస్త్రం


రాజకీయాల్లో మాటలే తూటాలుగా మారుతుంటాయి. వ్యాఖ్యలే అస్త్రాలవుతాయి. సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపి రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్దేశిస్తుంటాయి. ఒక్క మాట.. సమాజంలో కోట్లాది మందిని ప్రభావితం చేస్తుంది. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఆయన చేసిన వ్యాఖ్యలను అధికారపక్షం ఆయుధంగా మలచుకుంది. ఏకంగా ప్రధాని తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా పేరున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి ఉదయనిధిపై కౌంటర్ అటాక్ మొదలుపెట్టారు. దాంతో దేశవ్యాప్తంగా కమలనాథులు విమర్శనాస్త్రాలతో విరుచుకుపడుతున్నారు. దేశంలోని 28 రాజకీయ పార్టీలను ఒక గొడుగు తెస్తూ ఏర్పాటు చేసిన కూటమి లో ప్రకంపనాలు మొదలయ్యాయి. ఈ వ్యాఖ్యలు తమిళనాడులో డీఎంకేకు నష్టం చేస్తాయా లేక ప్రయోజనం కల్గిస్తాయా అన్న విషయం పక్కనపెడితే.. కూటమిలోని ఇతర పార్టీలకు ఇతర రాష్ట్రాల్లో కచ్చితంగా నష్టాన్ని కల్గిస్తాయన్న ఆందోళన నేతల్లో వ్యక్తమవుతోంది.తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు, సినీ నటుడిగా పేరొంది ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. అవి యావత్ హిందూ సమాజాన్ని గాయపరిచేలా ఉన్నాయి. "మనం నిర్మూలించాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. దోమలు, డెంగ్యూ జ్వరం, మలేరియా, కరోనా వంటి వాటిని కేవలం వ్యతిరేకిస్తే సరిపోదు. పూర్తిగా నిర్మూలించాల్సిందే. సనాతన ధర్మం కూడా అలాంటిదే. కేవలం వ్యతిరేకిస్తే సరిపోదు. సనాతన ధర్మాన్ని నిర్మూలించడమే మన మొదటి కర్తవ్యం కావాలి" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ మతంపై కరడుగట్టిన ద్వేషాన్ని బయటపెట్టాయి. దేశంలోని మెజారిటీ ప్రజానీకం అనుసరిస్తున్న మతవిశ్వాసాలను, ధర్మాన్ని నిర్మూలించాలని కోరుకుంటున్నారు. హిందూమతాన్ని, సనాతన ధర్మాన్ని ద్వేషించే ద్రవిడ మున్నేట్ర కళగం చరిత్ర రహస్యమేమీ కాదు. తమిళనాట బ్రాహ్మణ ఆధిపత్య ధోరణిని ప్రశ్నిస్తూ మొదలైన ద్రవిడ ఉద్యమం నుంచి పుట్టిన రాజకీయ పార్టీలే డీఎంకే, అన్నాడీఎంకేలు. మూల సిద్ధాంతం ఆధిపత్యాన్ని ప్రశ్నించడమే అయినప్పటికీ కాలక్రమంలో అది బ్రాహ్మణ ద్వేషంగా.. అటుపై హిందూ మత ద్వేషంగా మారిపోయింది. నాస్తిక భావజాలాన్ని ఎవరూ తప్పుబట్టకపోయినా.. కోట్లాది ప్రజల విశ్వాసాలను గేలి చేయడం, ఎగతాళి చేయడాన్ని మాత్రం తప్పుబట్టక తప్పదు. గతంలో డీఎంకే కు చెందిన ప్రముఖ నేత కనిమొళి కోట్లాది ప్రజలు ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పేదవాడిని కాపాడలేని దేవుడు మనకెందుకు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఆ పార్టీ నేతలు అనేక సందర్భాల్లో, అనేక వేదికలపై హిందూ మతంపై ద్వేషాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. దశాబ్దాలుగా ద్రవిడ వాదం ముసుగులో ఈ పార్టీ భారతదేశంలోని అతిపెద్ద మతంపై బహిరంగంగా ద్వేషాన్ని వెదజల్లుతోంది.ఉదయనిధి స్టాలిన్ ద్వేషపూరిత వ్యాఖ్యలను తప్పుబడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిదాడి మొదలుపెట్టారు. జైపూర్‌లో ఓ ఎన్నికల సభలో ప్రసంగించిన ఆయన.. కేవలం ఉదయనిధి లేదా డీఎంకేను మాత్రమే లక్ష్యంగా చేసుకోలేదు. మొత్తం విపక్ష కూటమిని టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు సంధించారు. ఓట్ల కోసం సనాతన ధర్మాన్నే అవహేళన చేస్తారా అంటూ మండిపడ్డారు. ఉదయనిధి వ్యాఖ్యలు ఆయన పార్టీకో, తమిళనాడు రాష్ట్రానికో మాత్రమే పరిమితం కాదని, అవి మొత్తం విపక్ష కూటమి తరఫునే మాట్లాడారని అన్నారు. ఇది కచ్చితంగా మారణహోమాన్ని సృష్టించి హిందువులను అంతం చేయాలన్న ప్రయత్నమే అని సూత్రీకరించారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు భారతదేశ వారసత్వాన్ని, సనాతన ధర్మాన్ని కించపరుస్తున్నారని అమిత్ షా అన్నారు. 2010లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన గుర్తుచేశారు. హిందుత్వ సంస్థలను ఉగ్రవాద సంస్థ లష్కర్–ఏ–తోయిబాతో పోలుస్తూ వాటికంటే భయంకరమైనవి అని రాహుల్ గాంధీ అన్నారు. అలాగే సుశీల్ కుమార్ షిండే చేసిన హిందూ టెర్రర్ వ్యాఖ్యలను కూడా ఉదహరించారు. సనాతన ధర్మం దేశ ప్రజల హృదయాలను శాసిస్తోందని, మోదీ మళ్లీ గెలిస్తే దేశంలో సనాతన పాలన కొనసాగుతుందని అన్నారు. "చూస్తూ ఉండండి.. సనాతన ధర్మమే మళ్లీ గెలుస్తుంది" అంటూ వ్యాఖ్యానించారు.భారతీయ జనతా పార్టీని, దాని సైద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్'ను కాంగ్రెస్, కమ్యూనిస్టులు సహా దేశంలో అనేక రాజకీయ పార్టీలు విమర్శిస్తూ ఉంటాయి. హిందుత్వం పేరుతో బీజేపీ, ఆరెస్సెస్ దేశంలో విద్వేషాన్ని సృష్టిస్తున్నాయని, సమాజంలో విభజన తీసుకొస్తున్నాయని దుయ్యబడుతూ ఉంటాయి. కానీ నేరుగా హిందూమత విశ్వాసాలు, సనాతన ధర్మం జోలికి వెళ్లవు. అయితే డీఎంకే నేతలు అలా కాదు. వారు నేరుగా హిందూ ధర్మం, మత విశ్వాసాలుపై నేరుగా దాడికి దిగుతుంటారు. ద్రవిడ పార్టీల సైద్ధాంతిక భావజాలం ఉన్న తమిళనాట వారికి ఓట్లు తెచ్చిపెట్టొచ్చు. లేదా కొన్ని వర్గాలను దూరం చేస్తూ ఉండొచ్చు. కానీ మిగతా రాష్ట్రాలు అలా కాదు. అదే ఇప్పుడు విపక్ష కూటమిలో పెద్ద సమస్యగా మారింది. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను కూటమిలోని ఇతర పార్టీలేవీ సమర్థించకపోవచ్చు.

**దీప్తి.జి**

# కొత్త పార్లమెంట్‌లో కీలక బిల్లులు

సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ ఐదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చింది కేంద్ర ప్రభుత్వం. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఒకే దేశం, ఒకే ఎన్నిక పైనా చర్చ జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనిపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటైంది. అయితే...ఈ ప్రత్యేక సమావేశాలు పాత పార్లమెంట్ బిల్డింగ్‌లో జరుగుతాయా..? లేదంటో కొత్త భవనంలో నిర్వహిస్తారా అన్న అనుమానాలు తలెత్తాయి. ఈ విషయంలో కేంద్రం క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 18న అంటే...తొలి రోజు సమావేశాలు పాత బిల్డింగ్‌లోనే జరుగుతాయని స్పష్టం చేసింది. ఆ తరవాత సెప్టెంబర్ 19న వినాయక చవితి సందర్భంగా కొత్త బిల్డింగ్‌లోకి షిఫ్ట్ అవుతున్నట్టు వెల్లడించింది. అంటే...సెప్టెంబర్ 19–23 వరకూ కొత్త పార్లమెంట్ భవనంలోనే ప్రత్యేక సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్‌ని ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అయితే...ఇప్పటి వరకూ ఈ సమావేశాల అజెండా ఏంటన్నది స్పష్టంగా చెప్పలేదు కేంద్ర ప్రభుత్వం. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని ప్రశ్నించగా...త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. జూన్1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌ని ప్రారంభించారు. మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులోనే సెన్గోల్ని ఏర్పాటు చేశారు. ప్రశ్నోత్తరాల సమయం, ప్రైవేట్ కార్యకలాపాలు ఉండవని లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌ల నుంచి ఇటీవలే అధికారిక నోటిఫికేషన్ వెలువడింది. సెషన్‌లో ఐదు సిట్టింగ్‌లు ఉంటాయి. సభ్యులు విడిగా తాత్కాలిక క్యాలెండర్‌ని అందుకుంటారు. సెప్టెంబర్ 18 నుంచి 17వ లోక్‌సభ పదమూడో సమావేశాలు ప్రారంభమవుతాయని సూచిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ బులెటిన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 18న సమావేశాలు ప్రారంభమవుతాయని, ఈ మేరకు సభ్యులకు సమాచారం ఇస్తున్నట్లు బులిటెన్‌లో పేర్కొంది. జమిలీ ఎన్నికలపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ సమావేశాలపై ప్రకటన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యసభ రెండు వందల అరవై ఒకటో సెషన్ సెప్టెంబర్ 18వ తేదీన ప్రారంభమవుతుందని, ఈ మేరకు సభ్యులకు తెలియజేస్తున్నట్లు రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి సెప్టెంబర్ 18 నుంచి ఐదు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే సమావేశాల అజెండాను రహస్యంగా ఉంచారు. దీంతో పలు ఊహాగానాలు వస్తున్నాయి.మరో వైపు దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చుతారనే ప్రచారం వేళ ఇండియా కూటమి నేతలు అత్యవసరంగా సమావేశమైంది.. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా ఏంటి అని అడగటంతో పాటు వివిధ సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష కూటమి ఇండియా తరఫున మరికొన్ని రోజుల్లో లేఖ రాస్తారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దేశం పేరు మార్చనున్నారన్న వేళ ఇండియా కూటమి అత్యవసరంగా సమావేశమైంది. కాంగ్రెస్ పార్లమెంటరీ లీడర్లు సోనియా గాంధీ నివాసంలో సమావేశం అయ్యారు. అనంతరం ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే నివాసంలో ఇండియా కూటమికి చెందిన నేతలు భేటీ అయ్యారు. ఇండియా అనే పేరును రాజ్యాంగం నుంచి తొలగించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు కూటమి నేతలు మూకుమ్మడిగా చెప్పినట్లు సమాచారం.

# దక్షిణ ధృవానికి 600 కిలోమీటర్ల దూరంలో విక్రమ్..
## ల్యాండర్‌ను ఫోటో తీసిన నాసా ఆర్బిటార్




తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

అమెరికా స్పేస్ ఏజెన్సీ నాసాకు చెందిన లూనార్ రికన్నైస్సెన్స్' ఆర్బిటార్ ప్రస్తుతం చంద్రుడి చుట్టూ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ శాటిలైట్‌కు .. చంద్రయాన్-3కి చెందిన విక్రమ్ ల్యాండర్ చిక్కింది. విక్రమ్‌ను ఆ ఆర్బిటార్ ఫోటో తీసింది. ఆ ఫోటోలను నాసా తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆగస్టు 23వ తేదీన దక్షిణ ధృవానికి 600 కిలోమీటర్ల దూరంలో విక్రమ్ ల్యాండర్ దిగినట్లు నాసా పేర్కొన్నది. అయితే ఆగస్టు 27వ తేదీన నాసాకు చెందిన ఎల్ఆర్వో ఈ ఫోటోను తీసింది. ల్యాండింగ్ జరిగిన నాలుగు రోజుల తర్వాత ఆ ఫోటో తీశారు. విక్రమ్ ల్యాండర్‌ను 42 డిగ్రీల కోణంలో ఎల్ఆర్వో కెమెరా ఫోటో తీసినట్లు నాసా వెల్లడించింది. అయితే ఆ ల్యాండర్ నుంచి వెలుబడిన వాయువులు, అక్కడి నేలతో ఇంటరాక్ట్ కావడం వల్ల విక్రమ్ చుట్టూ ఆ బ్రైట్ వెలుతురు కనిపించినట్లు నాసా తెలిపింది.మేరీల్యాండ్లోని గ్రీన్బెల్ట్లో ఉన్న గోడార్డ్ స్పేస్ ఫ్లయిట్ సెంటర్ నుంచి ఎల్ఆర్వో కెమెరాలను నాసా మేనేజ్ చేస్తోంది. మరో వైపు ఇస్రో మంగళవారం చంద్రుడికి చెందిన 3డీ ఇమేజ్‌ను రిలీజ్ చేసింది.

### హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు కేవలం ట్రైలర్ మాత్రమే
# అసలు సినిమా ముందుంది : కేటీఆర్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

హైదరాబాద్‌లో పెరుగుతున్న భూముల ధరలు, జరుగుతున్న అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏ నగరమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమష్టిగా, బ్యాలెన్సింగ్?గా పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ హైటెక్స్?లో ఏర్పాటుచేసిన టైమ్స్ ఆఫ్ ఇండియా, టైమ్స్ మెగా ప్రాపర్టీ ఎక్స్ పో-2023ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సాగునీరు, తాగునీరు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు, విద్యుత్.. ఇలా అన్ని రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం ముందుచూపుతో దృష్టి సారించిందన్నారు.తెలంగాణ రాకముందు ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఉండేది, పవర్ హాలిడేస్?తో పరిశ్రమలకు సెలవులు కూడా ఇచ్చే వాళ్లని చెప్పారు. జిరాక్స్ సెంటర్ నడవాలన్నా కరెంటు ఉండేదికాదన్నారు. కానీ, నేడు రాష్ట్రంలో 26 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. గతంలో తాగునీరుకు హైదరాబాద్ నగరంలో ఎప్పుడూ ఇబ్బంది ఉండేదని, సీఎం కేసీఆర్ దార్శనికతతో కృష్ణా, గోదావరి నదుల నుంచి వందల కిలోమీటర్లు నీళ్లు తీసుకువచ్చి నగరవాసులకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటు కాళేశ్వరం, అటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 10 శాతం తాగు నీటిని అందిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌కు భవిష్యత్తులో తాగునీటి కొరత ఉండదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చెబుతూ ఉంటారని, సినీ హీరో రజినీకాంత్ లాంటి వాళ్ళు కూడా ఇది న్యూయార్కా లేక హైదరాబాదా అనే సందేహం వచ్చిందన్నారని గుర్తుచేశారు. విశ్వనగరంగా పోటీపడాలంటే మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వరకు మెట్రో టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నగరం చుట్టూ మెట్రో కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని తెలిపారు.

రాజధాని నగరానికి ఏ రంగంలో పెట్టుబడులు రావాలన్నా.. శాంతి భద్రతలు చక్కగా ఉండాలన్నారు. గతంలో ఏ పందుగొచ్చినా హైదరాబాద్‌లో వారం రోజుల పాటు కర్ఫ్యూ ఉండేదని, అయితే తెలంగాణ వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితి ఇప్పటివరకు రాలేదని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం హైదరాబాద్?కే పరిమితం కాలేదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పెరిగిందని వెల్లడించారు. మెట్రో రైలును విస్తరిస్తామని, మూసీ సుందరీకరణ చేస్తామన్నారు. గొప్ప విజనరీ లీడర్ మన కేసీఆర్ ఉన్నారని, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్ అంటే గచ్చిబౌలి, కొండాపూర్ అని కొంత మంది విమర్శిస్తున్నారని, న్యూయార్క్ లాంటి నగరాల్లో కూడా కొన్ని పాత పట్టణాలు ఉన్నాయని చెప్పారు. స్కై టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, గ్రీన్ బిల్డింగ్స్?ని ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. డబ్బా బిల్డింగులే కాదు.. అట్రాక్టివ్?గా కూడా నిర్మాణాలు జరగాలని సూచించారు. హైదరాబాద్ పడమరవైపే కాకుండా మిగతావైపుల కూడా బిల్డర్లు అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున వసతులు కల్పించిందని, సౌత్, ఈస్ట్ హైదరాబాద్‌పై బిల్డర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# వ్యాక్సిన్ తర్వాత పెరిగిన గుండెపోటులు

తెలుగు ట్రాక్,ముంబై

ఇండియాలో కరోనా విజృంభణ తర్వాత గుండెపోటు ముప్పు ఎక్కువగా పెరిగిందనే ఊహాగానాలు వచ్చాయి. ముఖ్యంగా కరోనా వ్యాక్సిన్ ప్రభావం గుండెపోటు కేసులు పెరగడానికి ఏదైనా అనే అనుమానాలు ఎన్నో వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో పరిశోధనలు నిర్వహిస్తోంది. ఇలాంటి సమయంలోనే ఇండియాలో ఉపయోగించిన కరోనా వ్యాక్సిన్లను.. గుండెపోటు ముప్పు పెరుగదలకు ఎలాంటి సంబంధం లేదని తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం పేర్కొంది. ఇండియాలో తయారైన కరోనా వ్యాక్సిన్‌లు సురక్షితమైనవేనని వెల్లడించింది. అయితే ఇందుకు సంబంధించిన నివేదిక.. పీఎల్ఓఎస్‌వన్ జర్నల్‌లో ప్రచురితమైంది. భారత్ వ్యాక్సిన్‌లు సేఫ్ అని .. అసలు దేశంలో నమోదవుతున్న గుండెపోటుకు వ్యాక్సిన్‌లకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది.అలాగే కరోనా టీకా తీసుకున్న వారిలో గుండెపోటు మరణాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని.. ఈ అధ్యయానికి నేతృత్వం వహించిన జీబీ పంత్ హాస్పిటల్‌కు చెందిన మోహిత్ గుప్తా పేర్కొన్నారు. వ్యాక్సిన్ తీసుకున్న అనంతరం అక్యూట్ మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్ ఎప్పుడూ కూడా కనిపించడం లేదని తమ అధ్యయనంలో తేలినట్లు వెల్ల డించారు. ఇక హాస్పిటల్లో చేరిన ఏఎంఐ బాధితుల్లో.. వయసు, ధూమపానం, మధుమేహం కారణాల వల్లే మరణాల ముప్పు ఎక్కువగా కనిపించినట్లు పేర్కొన్నారు. మరో విషయం ఏంటంటే ఇది ఒక కేంద్రంలో జరిపినటువంటి అధ్యయనమని.. అలాగే ఇందుకు సంబంధించి కొన్ని పరిమితులు కూడా ఉన్నాయని పరిశోధకులు చెప్పారు. గుండెపోటు వచ్చిన తర్వాత బాధితుల మరణాలకు కరోనా వ్యాక్సిన్ ప్రభావం ఏదైన ఉందా లేదా.. అనే విషయాన్ని తెలుసుకునేందుకు గత ఏడాది మన దేశంలో అధ్యయనం జరిగింది.అయితే ఈ అధ్యయనం కోసం ఢిల్లీలోని జీబీ పంత్ హాస్పిటల్‌లో ఆగస్టు 2021 నుంచి ఆగస్టు 2022 కాల వ్యవధిలో చేరిన దాదాపు 1578 మంది రోగుల సమాచారాన్ని విశ్లేషణ చేశారు. అయితే వీరిలో 1086 మంది కరోనా టీకా తీసుకున్నవారు ఉన్నారు. ఇక మిగిలిన 492 మంది టీకా తీసుకోని వారే ఉన్నారు. అయితే ఈ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో దాదాపు 1047 మంది రెండు డోసులు తీసుకున్నారు. అలాగే మరో 4 శాతం మంది కేవలం ఒక్క డోసు మాత్రమే తీసుకున్నారు.

# మరో2 బీసీ గురుకుల డిగ్రీ లా కాలేజీలు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా రెండు బీసీ గురుకుల డిగ్రీ లా కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా తెలంగాణ సర్కార్ మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కొత్తగా పలుచోట్ల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయగా? తాజాగా రెండు బీసీ గురుకుల డిగ్రీ లా కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒకటి హన్మకొండలో ఏర్పాటు చేయనుండగా? మరొకటి రంగారెడ్డి జిల్లా కందుకూరులో నెలకొల్పనున్నారు. ఈ మేరకు అనుమతులు మంజూరు చేస్తూ సర్కార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించనున్నారు. ఈ కాలేజీల్లో బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ 5 ఇంటిగ్రేటెడ్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు.ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ నెలలోనే కొత్తగా 17 బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసింది తెలంగాణ సర్కార్. ఫలితంగా రాష్ట్రంలో బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల సంఖ్య 33కు చేరింది. ఈ నూతన డిగ్రీ కాలేజీలతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో బీసీ గురుకుల డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేసినట్లు అయింది. కొత్త బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలను జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఏర్పాటు చేశారు.ఈ డిగ్రీ కాలేజీలతో 16వేలకుపైగా విద్యార్థులకు లబ్ధి చేకూరనుందిఈ 17 కాలేజీల్లో వినూత్న, ఉపాధినిచ్చే కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది తెలంగాణ సర్కార్. ఇందులో భాగంగానే ఇప్పటికే వికారాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఫిల్మ్ అండ్ మీడియా, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్, ఫొటోగ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్ కోర్సులతో బీఏ(హానర్స్), సంగారెడ్డి కాలేజీలో హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. 13 బీసీ గురుకుల గురుకుల కాలేజీల్లో బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్సీ), బీకాం, బీఏ కోర్సులు ప్రవేశపెట్టింది. మిగిలిన 2 గురుకుల డిగ్రీ కాలేజీల్లో న్యాయవిద్యను ప్రవేశపెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

### తెలుగులో ఇంగ్లీషు మందులు..
# సామాన్యులకు అర్థమయ్యేలా తొలి ప్రయోగం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

సామాన్యులకు అర్థమయ్యేలా తొలి ప్రయోగం. 337 మందులకు తెలుగు భాషలో పేర్లు. తెలుగు భాష పునర్జీవనానికి సర్కారు యత్నం. ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ. ఇప్పటిదాకా మందులు అంటేనే అంతా ఇంగ్లీష్ మయం. ప్రభుత్వ దావఖానల్లోనే కాదు. ప్రైవేటుగా మందులు అంటేనే అంతా ఇంగ్లీష్ మయం. ప్రభుత్వ దావఖానల్లోనే కాదు, ప్రైవేటుగా కూడా ఏ మందు పేరు తెలుగులో ఉండదు. వైద్య పరంగా మాట్లాడేందుకు కూడా తెలుగు భాషను వినియోగించడం చాలా అరుదుగా కనిపిస్తుంది. ఇలాంటి తరుణంలో రోగులకు, సామాన్య ప్రజానీకానికి సులభంగా అర్థమయ్యే రీతిలో మందుల పేర్లు ఇంగ్లీషుతో పాటు, తెలుగులోనూ ముద్రించి పంపిణీ చేస్తున్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అడుగు ముందుకు వేసి ఆ శాఖ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రోగులకు ఇచ్చే మందుల పేర్లను తెలుగు ముద్రించడం మొదలుపెట్టారు. ఈ శాఖ మొత్తం 337 మందులను సరఫరా చేస్తుండగా ఇప్పటికే చాలా వాటిపై తెలుగులో పేర్లు వస్తున్నాయి. సగానికి పైగా మందులకు తెలుగులో పేర్లు అమాక్సిలిన్, సిప్రో ఫ్లాక్సిన్ అనే యాంటీబయోటిక్ మందులు, అట్లెన్లాల్, అమ్లోడిపిన్ బీపీని తగ్గించే మాత్రలు, పాంటాప్రజోల్, రామ్ టిడిన్ అనే గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం కలిగించే మందులు మెటాఫార్మిన్ అనే షుగర్ నియంత్రించే మందులతో , క్లోరోజాలైడింగ్, నిడజోల్, మెట్రో అల్యూమినియం హైడ్రాక్సైడ్, సాలబుట్టమాల్ అనే పలు వ్యాధులకు వాడే ఎన్నో మందుల పేర్లు నేడు తెలుగులో ప్రచురితమవుతున్నాయి. ప్రభుత్వ దావఖానాలకు ఎక్కువగా గ్రామీణులు, నిరక్షరాశులు పేదలే వస్తుంటారు. మందుల పేర్లు తెలుగులో ముద్రించడం వలన అంతంత మాత్రం చదువుకున్న వారికి కూడా అర్థమవుతుందని , ఏ ఏ సమయాలలో మందులు వేసుకోవాలో అవగాహన కలుగుతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు. అది గాక ప్రభుత్వం సరఫరా చేసే ఈ మందులపై తెలుగులో పేర్లు ఉండటం వలన బయట మార్కెట్లో వాటిని విక్రయించే వీలు కాదని డాక్టర్ లిల్లీ మేరి స్పష్టం చేస్తున్నారు. దావఖానకు వెళ్లి ఫార్మసిస్ట్ ఇచ్చే మందులు అంతకుముందు ఆంగ్లంలో ఉండటంతో వారికి ఏ ఏ మందులు ఎప్పుడు వేసుకోవాలో తెలిపేది కాదు. దీంతో వారికి అర్థమయ్యే భాషలో చెప్పాల్సిన బాధ్యత ఫార్మసిస్టుపై ఉండేది. ప్రస్తుతం తెలుగులో మందుల పేర్లు ముద్రించడంతో సులువుగా గుర్తుపట్టి సమయానికి మందులు వేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వము ఆంగ్లము తెలుగులో అందులో పేర్లు ముద్రించటంతో పాటు మందుల పేర్లు తెలుగులో నాట్ ఫర్ సేల్ గవర్నమెంట్ సప్లై అనే అక్షరాలు రాసి ఉండటంతో మందులు పక్కదారి పట్టే అవకాశం లేదని డాక్టర్ లిల్లీ మేరి స్పష్టం చేస్తున్నారు.

కెసిఆర్, హరీష్ రావు గార్ల నిర్ణయం ప్రశంసనీయం - డాక్టర్ లిల్లీ మేరి

మాతృభాషలో మృత భాషవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు మన ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు గార్ల తెలుగు భాషాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. ప్రభుత్వంలో కీలక శాఖ అయినా వైద్య ఆరోగ్య శాఖలో తెలుగులో మందుల పేర్లు ముద్రించడం అందరికీ ప్రయోజనమే. అలాగే డాక్టర్లు కూడా తెలుగులోనే మందులు చీటీలు రాసే సమయం రావాలి. దేశభాషలందు తెలుగు లెస్స అనే నానుడి నిజం కావాలని ఆశిస్తున్నా అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

# అమ్మకానికి ఎర్రబంగారం

తెలుగు ట్రాక్,తిరుపతి

అమ్మకానికి ఎర్ర బంగారం సిద్ధమైంది. ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనంకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న డిమాండ్ ను ఉపయోగించుకుని కోట్ల రూపాయలు ఆర్జించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా గ్లోబల్ టెండర్ల ద్వారా గోడౌన్లలో ఉన్న ఎర్రచందనాన్ని వేలం వేయడానికి అధికారులు కసరతులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో ఉన్న శేషాచలం అడవులలోని కొండల్లో మాత్రమే యర్రచందనం దొరుకుతుంది. దీన్ని యర్ర బంగారంగా పిలుస్తుంటారు కొందరు. ఈ అడవులు కొండ ప్రాంతంలో దాదాపు 5.5 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి.ప్రపంచంలో మరెక్కడా దొరకని ఎర్రచందనం ఈ అడవుల్లో మాత్రమే నిక్షిప్తమై ఉంది. ఈ ఎర్రచందనం చెట్లు ప్రపంచంలోనే చాలా అరుదైన జాతికి చెందినవని, ప్రధానంగా, శేషాచలం కొండల్లోని అడవులలో పెరిగే ఎర్రచందనంలో ఎక్కువ చేవ ఉండడంతో దానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చైనా, జపాన్, రష్యాలలో ఎర్ర చందనాన్ని వివిధ రూపాల్లో వినియోగిస్తుంటారు. విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను క్యాష్ చేసుకోవడానికి స్మగ్లర్లు అనేక మార్గాల్లో ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. డిమాండ్ కు తగ్గ స్థాయిలోనే ఎర్రచందనం అక్రమ రవాణా కూడా సాగుతుంది. సినిమాలలో చూసిన మాదిరిగా ఎర్రచందన్నానని ఊహించని విధంగా తరలిస్తూనే ఉన్నారు . ఇలా పట్టుబడిన ఎర్రచందనాన్ని గూడౌన్ లలో దాచి వేలం వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది.రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పట్టుబడ్డ ఎర్రచందనం అమ్మడం ద్వారా వందల కోట్ల రూపాయలు ఆర్జించేందుకు సిద్ధపడింది . ఇందులో భాగంగా 16వ సారి గ్లోబల్ టెండర్ల ద్వారా ఎర్రచందనం వేలం వేయడానికి రంగం సిద్ధం చేసింది. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 8వ తేదీ వరకు 615 మెట్రిక్ టన్నులను వేలం వేసి 200 కోట్ల రూపాయల పైచిలుకు ఆదాయం పొందడమే లక్ష్యంగా గ్లోబల్ టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎఫ్డిసి చైర్మన్ డికె సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో రాజంపేట, పీలేరు, భాకరాపేట, తిరుపతి ప్రాంతాల్లో ఎర్రచందనం గోడౌన్లు ఉన్నాయి వీటిలో భద్రపరిచిన 65.833 మెట్రిక్ టన్నులను అమ్మకానికి సిద్ధంగా ఉంచింది. ఇలా అరుదైన ఎర్రచందనం ప్రభుత్వ ఆదాయ వనరుగా మారింది .ఎర్రచందనానికి సంబంధించి శేషాచలంలో చాలా మటుకు ప్రాంతంలో అనేక వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయి ఈ అటవీ ప్రాంతంలోని ఎర్రచందనాన్ని గనక సక్రమంగా స్మగ్లర్ల చేతికి కాకుండా ప్రభుత్వమే అమ్మగలిగితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎర్రచందనం ద్వారా కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి ప్రతి ఏటా వస్తుంది. ఇది అంతరించిపోయే పంట కాకపోవడంతో అడవిని నరికే కొద్దీ ఎర్రచందనం పుట్టుకొస్తూనే ఉంటుంది అందుకే ఎర్రచందనంపై స్మగ్లర్లు కన్నేసి కోట్లు ఆర్థిస్తున్నారు. స్మగ్లర్లను పట్టుకున్న వారిపై పిడి యాక్టులు ఓపెన్ చేసిన ఎర్రచందనం స్మగ్లింగ్ మాత్రం ఆగడం లేదు ప్రభుత్వంకి పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్లు తరలించుకుపోతున్న దాంట్లో పోలిస్తే ఐదు శాతం కూడా ఉండదు అంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎర్రచందనంపై దృష్టి సారిస్తే పెద్ద ఆదాయ వనరుగా మారడానికి ఏమాత్రం తీసిపోదు ఇసుక ఆబ్కారి శాఖ తో పాటు ఎర్రచందనం కూడా ఒక ఆదాయ వనరుగా మారుతుంది

# అవినీతిని జరగలేదని నిరూపించుకోండి

తెలుగు ట్రాక్,విజయవాడ

స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరగలేదని చంద్రబాబు నాయుడు నిరూపించుకోవాలని, వస్తున్న ఆరోపణలపై బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా హుందాగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వాస్తవాలను ప్రభుత్వం తరఫున ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. చంద్రబాబు అరెస్టుపై తాడేపల్లిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిన సజ్జల.. స్కామ్ లో బాబు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేకపోయినా అరెస్టు చేస్తున్నారని అనడం సరైంది కాదన్నారు. ప్రాథమిక రిపోర్టులో లేనంత మాత్రాన అరెస్టు చేయకుండా ఉండరని చెప్పారు. 2017, 2018 లో రూ.371 కోట్లలో రూ.240 కోట్లు దారి మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయని వెల్లడించారు. షెల్ కంపెనీల ద్వారా ఇదంతా జరిగిందని అన్నారు. అరెస్టు పై ముందే చంద్రబాబు మాట్లాడటం దేనికి నిదర్శనమని సజ్జల ప్రశ్నించారు. ఆరోపణలు ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి దర్యాప్తు చేయడం సర్వసాధారణమని చెప్పుకొచ్చారు. వాస్తవాలను ప్రభుత్వం తరఫున ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, అసలు విషయం చెప్పకుండా టీడీపీ తప్పుడు



ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. 9.12.21న ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైందని గుర్తు చేశారు. సీఐడీకి చెందిన సిట్ దర్యాప్తు చేస్తోందని తెలిపారు. స్కామ్ లో బాబు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలున్నాయన్న సజ్జల.. స్కామ్ లో దర్యాప్తు జరుగుతోందని, ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. స్కామ్ గురించి సీఐడీ ఎంటర్ కాకముందే జాతీయ దర్యాప్తు సంస్థలు అప్రమత్తం చేశాయని గుర్తు చేశారు. విచారణలో ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. కక్ష సాధింపు చర్యలు బాబుకు అలవాటేనని, అదే జగన్ కు ఆపాదించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడీపీ శ్రేణులు అశాంతి రేపే అవకాశం ఉంది కాబట్టే పలు ప్రాంతాల్లో బస్సులను డిపోలకే పరిమితం చేసినట్లు చెప్పారు. బాధ్యతాయుతమైన రాజకీయనాయుకలైతే.. హుందాగా జవాబు ఇవ్వాలని, వివరణ ఇవ్వాలని సూచించారు.

# లెక్కలు తప్పాయా

తెలుగు ట్రాక్,విజయవాడ

అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికలకు వెళ్లే ముందు తీసుకునే జాగ్రత్తలు చాలా పక్కాగా ఉంటాయి. ముందుగా ప్రజలకు కనీస అవసరాల విషయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటారు. అంటే కరెంట్, నీరు వంటివి. ఇందు కోసం పక్కా ప్రణాళికలు వేసుకుంటారు. ఎందుకంటే వీటిలో తేడా వస్తే ప్రజల ఆగ్రహం ఎక్కువగా కనిపిస్తుంది. అదే సమయంలో సంక్షేమపథకాలను సమయానికి అందించడమే కాదు.. అవసరం అయితే ఒకటి, రెండు ప్రారంభిస్తారు కూడా. అయితే ఈ రెండు విషయాల్లో ఏపీ ప్రభుత్వం ప్రణాళిక దారి తప్పినట్లుగా కనిపిస్తోంది. ఏపీలో పథకాలకు నిధులు ఆలస్యం కావడం.. వరుసగా కరెంట్ కోతలు విధించాల్సి వస్తుండటమే దీనికి కారణం. ఏపీలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు తగ్గ అవసరాన్ని డిస్కంలు తీర్చలేకపోతున్నాయి. పరిశ్రమలకు అధికారికంగా పవర్ హాలీడే ప్రకటించారు. లోడ్ రిలీఫ్ పేరుతో గృహ అవసరాలకూ కోతలు విధిస్తున్నారు. లోడ్ రిలీఫ్ పేరుతో విధిస్తున్న అప్రకటిత కోతలతో ప్రజలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. వర్షాలు లేకపోవడం వల్ల జల విద్యుత్ తగ్గిపోయింది. కానీ బొగ్గులు సరైన విధంగా అందబాటులో ఉంచుకుంటే.. కరెంట్ కొరత తలెత్తేది కాదు. తెలంగాణలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. నిబంధనల ప్రకారం 15 రోజులకు సరిపడ బొగ్గు అంటే ఉండాలి. కానీ రెండు, మూడు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కూడా అందుబాటులో లేవు. బహిరంగ మార్కెట్‌లో కొనాలన్నా దొరకని పరిస్థితి. దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. దీంతో కోతలు అనివార్యమయ్యాయి. ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తోంది.ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఆరోనెల ప్రారంభం నడుస్తోంది. కానీ డబ్బులు లేకపోవడంతో జీతాలు, పెన్షన్లు సమయానికి ఇవ్వలేకపోయారు. కాపునేస్తం పథకానికి బటన్ నొక్కడానికి ఏర్పాట్లు చేసినా నొక్కలేకపోయారు. దీనికి కారణం నిధుల సమస్యే. సంవత్సరంలో దాదాపుగా 11 నెలలు ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ దగ్గర ఓడీలోనే ఉంటోంది. ఎలాగోలా అప్పులు తెచ్చుకుని గట్టెక్కుతోంది. ఈ అప్పుల సంగతి పక్కన పెట్టినా.. సమయానికి బటన్ నొక్కుతున్నా అని సీఎం జగన్ నమ్మకంగా చెప్పేవారు. అయితే ఇప్పుడు ఆ బటన్ టైమింగ్ మిస్సవుతోంది. కొన్ని సార్లు బటన్లు నొక్కినా నగదు జమ కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఇలాంటి పరిస్థితి లబ్దిదారుల్లో అనుమానాలను కలిగిస్తాయి. ఇది ప్రభుత్వానికి ఇబ్బందికరమే అధికారంలో ఉండే ప్రతీ ప్రభుత్వానికి అధికార వ్యతిరేకత అన్న ఓ సమస్య ఉంటుంది. దాన్ని వీలైనంత వరకూ తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. ప్రభుత్వం సంక్షేమ పథకాల మీద ఎక్కువ దృష్టి పెట్టి అవే ఓట్లు తెచ్చి పెడుతుందని అనుకుంటున్నప్పుడు వాటి విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ అపరిమిత అప్పులు.. ఆర్థిక నిర్వహణ కారణంగా.. ఆ పథాకల విషయంలోనూ ప్రజల్లో అనుమానాలు కలిగేలా చేసుకుంటున్నారు. అందుకే వైసీపీ ఎన్నికలకు సన్నద్దత అంత పకడ్బందీగా లేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. అయితే ఇంకా సమయం మించిపోలేదు. తమ సామర్థ్యాన్ని ప్రజలకు చూపించి.. వారి సమస్యలను దూరం చేయడానికి అవకాశం ఉంది. కానీ.. అది అంత సులువు కాదని భావించవచ్చు.

## రాజకీయాలు కాదు..
# మొత్తం ఆయనే చేశారు

తెలుగు ట్రాక్,విశాఖపట్టణం

రాజకీయ కక్షతో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయించామన్న ఆరోపణలను మంత్రి గుడివాడ అమర్నాథ్ తోసిపుచ్చారు. కక్ష సాధింపు ఉద్దేశం ఉంటే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అరెస్టు చేసేవాళ్లమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో పక్కా సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నందునే చంద్రబాబు నాయుడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. చంద్రబాబుపై ప్రేమతో ఆయన అవినీతికి సంబంధించిన ఆధారాలను పవన్ కల్యాణ్ చూడలేకపోతున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసు, అమరావతి రియల్ ఎస్టేట్ స్కామ్.. ఇలా చంద్రబాబు నాయుడు చేసిన స్కాంలు చాలా ఉన్నాయన్నారు. కేంద్ర పరిధిలోని ఈడీ సంస్థ నోటీసు ఇచ్చిన కేసులో చంద్రబాబును ఏపీ సీఐడీ అరెస్టు చేస్తే పురందేశ్వరికి ఉలుకెందుకని ప్రశ్నించారు.చంద్రబాబు స్కిల్డ్ క్రిమినల్, అన్ స్కిల్డ్ పొలిటీషియన్ అంటూ మంత్రి అమర్ ధ్వజమెత్తారు. సీమెన్స్ అనే సంస్థ పేరు వాడుకుని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని చంద్రబాబు లూటీ చేశారని ధ్వజమెత్తారు. ఈ కేసులో 8 మందిని ఈడీ ఇప్పటికే అరెస్టు చేసిందని గుర్తు చేశారు. ఈ స్కాంలో పాత్రదారులు ఎందరు ఉన్నా.. సూత్రధారి మాత్రం చంద్రబాబేనని ఆరోపించారు.యూరో లాటరీ పేరుతో అమాయక ప్రజలను ఎలా మభ్య పెట్టి మోసం



చేస్తాయో.. అదే మోడస్ ఆపరెండీని చంద్రబాబు ఈ కేసులో వాడారని ధ్వజమెత్తారు.చంద్రబాబు చేసిన ఆర్థిక నేరాలకు అరెస్టు చేయక.. సినిమాలు చూపిస్తారా? అంటూ ప్రశ్నించారు. అవినీతి కేసులో అరెస్టై సానుభూతి పొందేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. చేసిన అవినీతికి చంద్రబాబుకు శిక్ష తథ్యమన్నారు.చంద్రబాబు అరెస్ట్‌ను పురందేశ్వరి ఖండించడం అందుకే.. మంత్రి కాకాణిముందు ముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో జరిగిన మరిన్ని కుంభకోణాలు వెలుగులోకి వస్తాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు అవినీతిలో పాలుపంచుకున్న అందరూ బయటకు వస్తారని వ్యాఖ్యానించారు. రూ.371 కోట్ల కుంభకోణంలో చంద్రబాబు నాయుడు అరెస్టయ్యారని అన్నారు. అణా పైసలుతో సహా బైటపడడంతోనే సీఐడీ చంద్రబాబును అరెస్ట్ చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు ఏమి స్వాతంత్ర్య సమర యోధుడు కాదన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. అక్రమాలు, ధనార్జన ధ్యేయంగా చంద్రబాబు పని చేశారని ధ్వజమెత్తారు.2014, 2019 ఎన్నికల్లో పురందేశ్వరి ఓడిపోవడంతోనే ఇప్పుడు టీడీపీ మద్దతుతో ఎంపీగా పోటీ చేయాలనుకుంటున్నారని.. అందుకే చంద్రబాబు అరెస్ట్‌ను అమె ఖండిస్తున్నారని కాకాణి అన్నారు. చంద్రబాబు, పురంధేశ్వరికి మధ్య ఆ మేరకు ఒప్పందం కుదిరింది కాబట్టే ఇలా మాట్లాడుతున్నారని అన్నారు.చంద్రబాబు పాపం పండింది.. మంత్రి జోగి రమేష్ఎప్పుడో అరెస్టు కావలసిన చంద్రబాబు నాయుడు ఈరోజు అరెస్ట్ కావటంతో అతని పాపం పడిందని మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణంలో ప్రధాన కారకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు అరెస్టుపై మంత్రి జోగి రమేష్ ఒక వీడియో విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ఈ రాష్ట్రానికి శుభ పరిమాణమని అభిప్రాయపడ్డారు. ఇన్ని వందలు వేలు కోట్లు ప్రజల సొమ్ము దోచుకున్న చంద్రబాబు నాయుడు అరెస్ట్ రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే విషయమన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో

# చంద్రబాబు నాయుడి అరెస్టు

తెలుగు ట్రాక్,నంద్యాల

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. యాత్రలో భాగంగా నంద్యాలలో బస చేస్తున్న ఆయనను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. అంతకుముందు భూమా అఖిలప్రియ, కాలువ శ్రీనివాసులు, భూమా బ్రహ్మానందరెడ్డి, జగత్ విఖ్యాత్ రెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, బీజీ జనార్దన్ రెడ్డి సహా పలువురు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్టుచేశారు. కాగా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, నోటీసులు ఇవ్వకుండా తనను ఎలా అరెస్టు చేస్తారని పోలీసులను బాబు నిలదీశారు. ఏదో జరిగిందని తనపై కేసు పెడుతున్నారని, మీకూ, నాకు రాజ్యాంగమే ఆధారమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే హైకోర్టుకు ప్రాథమిక ఆధారాలు ఇచ్చామని పోలీసులు స్పష్టం చేశారు. రిమాండ్ రిపోర్టులో అన్నీ ఉన్నాయని చెప్పారు.టీడీపీ హాయంలో 2016 నుంచి 2019 మధ్యకాలంలో బోగస్ కాంట్రాక్టుల ద్వారా రూ.118 కోట్ల ప్రజాధనం ముడుపుల రూపంలో చేతులు మారినట్లు ఇటీవల అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ద్వారా షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ సబ్ కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తి ఈ డబ్బులను తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో స్పందించిన ఐటీ అధికారులు.. చంద్రబాబుతో పాటు శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్, యోగేశ్ గుప్తాకు నోటీసులు అందజేశారు. గత వారం వాళ్ల నివాసాల్లో తనిఖీలు కూడా చేపట్టారు. ఈ క్రమంలో బోగస్ కాంట్రాక్టులు, వర్క్ ఆర్డర్ ద్వారా ముడుపులు చేతులు మారినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించినట్లు ఐటీ అధికారులు వెల్లడించారు. 2016 నుంచి 2019 మధ్య ఎన్ని కాంట్రాక్టులు పొందారు అందుకు డబ్బులను ఎలా సమకూర్చారు? డబ్బులు ఎలా చేతులు మారాయనే అంశాలకు సంబంధించిన వాంగ్మూలం ఇచ్చారని స్పష్టం చేశారు. ఈ క్రమంలో మనోజ్, పీఏ శ్రీనివాస్ విదేశాలకు పరారవ్వడంతో ఐటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఐటీ నోటీసుల ఆధారంగా కేసు నమోదుసిన ఏపీ సీఐడీ దర్యాప్తు ప్రారంభించింది.



## ఆశ్చర్యం వ్యక్తం చేసిన గవర్నర్



టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మాట వరసకైనా సమాచారం ఇవ్వకపోవడంపై గవర్నర్ అసంతృప్తిగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. స్కిల్ డెవలప్మెంట్ కేసులోచంద్రబాబును అరెస్ట్ చేసేందుకు గవర్నర్‌ని గానీ, గవర్నర్ కార్యాలయంలో గానీ సీఐడీ అధికారులు సంప్రదించలేదు. మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును అరెస్టు చేయాలంటే అవినీతి నిరోధక చట్టం కింద గవర్నర్ అనుమతి తప్పనిసరి. 2018లో చేసిన చట్ట సవరణ తర్వాత గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిందే.కానీ, ప్రస్తుత గవర్నర్, 2021లో కేసు నమోదు చేసినప్పుడు ఉన్న గవర్నర్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.ఈ రోజు చంద్రబాబును అరెస్టు చేసిన వ్యవహారం కూడా గవర్నర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.మీడియాలో వచ్చిన వార్తల ద్వారానే గవర్నర్ తెలుసుకున్నారని వర్గాలు పేర్కొన్నాయి

## చంద్రబాబు అరెస్టు అక్రమం



చంద్రబాబు అరెస్టు అక్రమమని, దుర్మార్గమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉండటం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని పేర్కొన్నారు. తాను 16 నెలలు జైలులో ఉన్నాను, చంద్రబాబును 16 నిమిషాలైనా జైలులో పెట్టాలన్నదే జగన్ మోహన్ రెడ్డి జీవిత లక్ష్యమని బాలకృష్ణ మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడిని ఏ చట్టం ప్రకారం అరెస్టు చేశారని బాలయ్య బాబు ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు రాజకీయ కక్షతో చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. 19.12.2021 లో స్కిల్ డెవలప్‌మెంట్ లో అవినీతి జరిగిందంటూ ఎఫ్ఐఆర్ నమోదైందని, నిజంగా అవినీతి జరిగే ఉంటే ఇంత వరకు ఎందుకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని బాలకృష్ణ ప్రశ్నించారు. డిజైన్ టెక్ సంస్థ అకౌంట్లు ఫ్రీజ్ చేసి నిధులు స్తంభింపజేసినప్పుడు కోర్టు చివాట్లు పెట్టి ఆ డబ్బు నేరాని సంబంధించింది కాదనని ఆదేశాలిచ్చిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు.

## చంద్రబాబుకు నా సంపూర్ణ మద్దతు



తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును రాజకీయ కక్ష సాధింపుల కోసమే అరెస్ట్ చేశారని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని పవన్ ప్రశ్నించారు. చంద్రబాబుకు నా సంపూర్ణ మద్దతు- ఇది కచ్చితంగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు జనసేన అధినేత పవన్ కల్యాణ్. చంద్రబాబు అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ప్రాథమిక ఆధారాలు చూపకుండా అర్ధరాత్రి అరెస్ట్ సరి కాదుని స్పష్టం చేశారు. ఏ తప్పూ చేయని జనసేన నాయకులపైనా హత్యాయత్నం కేసులు పెట్టారన్నారు. చంద్రబాబుపై నంద్యాలలో ఘటనకూడా అలాంటిదే నన్నారు. చంద్రబాబుపై చిత్తూరు, నంద్యాల ఘటనలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రభుత్వమే వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉండటం వల్లే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. లా అండ్ ఆర్డర్ ని కంట్రోల్ చెయ్యాల్సింది పోలీసులైతే.. వైసీపీ వాళ్లు ఎందుకు రోడ్లపైకి వస్తున్నారని పవన్ ప్రశ్నించారు. వైసీపీ నేతలైతే.. విదేశాలకు కూడా వెళ్లవచ్చునీ, అదే టీడీపీ నేతను అరెస్టు చేస్తే, కనీసం ఆ పార్టీ కార్యకర్తలు కూడా ఇళ్ల నుంచి బయటకు రాకూడదా అని పవన్ ప్రశ్నించారు. చంద్రబాబుకి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని పవన్ తెలిపారు. దీని నుంచి చంద్రబాబు త్వరగా బయటపడాలని కోరుకుంటున్నట్లు పవన్ తెలిపారు. చంద్రబాబుది అక్రమ అరెస్ట్ అని ఇతర పార్టీలు కూడా మండిపడ్డాయి. ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఏపీ సీఐడీ పోలీసులు శనివారం తెల్లవారు జామున మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసిన విధానం సమర్థనీయం కాదన్నారు. ఈ దుశ్చర్య దురదృష్టకరం, దుర్మార్గం, దౌర్జన్యం అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జగన్రా జకీయ కక్ష సాధింపునకు ఇది పరాకాష్ట అని తెలిపారు. ఇది రాజ్య హింస అన్నారు. ఈ దుశ్చర్యను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని చెప్పారు. రాహుల్ గాంధీ విషయంలో కానీ.. మణిపూర్ విషయంలో కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని చంద్రబాబు కానీ, టీడీపీ నాయకులు ఖండించక పోయినప్పటికీ చంద్రబాబు విషయంలో జగన్ ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు కూడా చంద్రబాబు అరెస్టును ఖండించాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు మాత్రమే చేసి.. అరెస్టులు చేయడం ఏమిటని.. కనీసం నోటీసులు కూడా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

# గుడివాడ టిక్కెట్ వెనిగండ్లకే

తెలుగు ట్రాక్,విజయవాడ

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కీలకమైన స్థానాలకు అభ్యర్థుల ఎంపికను తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వేగవంతం చేశారు. కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్థానాల్లో గన్నవరం, గుడివాడ ముఖ్యమైనవి. ఈ రెండు స్థానాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఒకప్పుడు టీడీపీ నుంచి గెలిచి వైసీపీలో చేరిన వారు ఉన్నారు. గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, గుడివాడ నుంచి కొడాలి నాని ఇద్దరూ కూడా టీడీపీ రాజకీయ జీవితం ప్రారంభించినవారే. వైసీపీలో చేరిన తర్వాత చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. అందుకే ఈ ఇద్దరినీ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ గడప తొక్కకుండా చూడాలని గట్టి పట్టుదలతో ఉన్నారు చంద్రబాబు. ఇప్పటికే గన్నవరం నుంచి వంశీకి పోటీగా యార్లగడ్డ వెంకట్రావుకు టిక్కెట్ కన్ఫర్మ్ చేశారు. మరో స్థానం గుడివాడ. ఒకప్పుడు టీడీపీ నుంచి రెండుసార్లు గెలిచి ఆ తర్వాత వైసీపీలో చేరారు కొడాలి నాని. వరుసగా వైసీపీలో కూడా రెండుసార్లు గెలిచారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొడాలి నానిని ఢీకొట్టాలంటే సామాజికంగా,ఆర్థికంగా బలమైన నేత ఉండాలనేది చంద్రబాబు ఆలోచన. ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు ఉన్నారు. ఈయనతో పాటు మరో ఎన్నారై వెనిగండ్ల రాము కూడా గతేడాది దసరా నుంచి టీడీపీలో చురుకుగా ఉన్నారు. దీంతో ఈ ఇద్దరూ కూడా టీడీపీ టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరిలో టిక్కెట్ ఎవరికి ఇవ్వాలి అనేదానిపై చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.కొడాలి నానిని ఢీ కొట్టేందుకు చంద్రబాబు పక్కా స్కెచ్ ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా ఉన్న రావి వెంకటేశ్వర రావు గతంలో ఒకసారి ఎమ్మెల్యే గా గెలిచారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు కొన్నేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడిన వెనిగండ్ల రాము? స్వస్థలానికి వచ్చి ఈసారి టిక్కెట్ ఎలాగైనా దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. రావి వెంకటేశ్వరరావుతో సమానంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలతో ప్రజలోనే ఉంటున్నారు. సుమారు ఏడాదిగా అన్న క్యాంటీన్ లు, పండగలకు దుస్తుల పంపిణీ, జాబ్ మేళాలు నిర్వహించడం,ఇటీవల వరదలు వచ్చినప్పుడు రైతులను పరామర్శించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చాలా దగ్గరయ్యారు రాము. దీంతో రావి, వెనిగండ్ల విషయంలో ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకున్నారు పార్టీ అధినేత చంద్రబాబు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో టిక్కెట్?పై క్లారిటీ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారట. దీంతో రావి వెంకటేశ్వరరావుతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులను పిలిచి చంద్రబాబు మాట్లాడారు. తాజా నివేదికలను రావి వెంకటేశ్వరరావు ముందు ఉంచారట చంద్రబాబు. కొడాలి నానికి సరైన ప్రత్యర్థిగా వెనిగండ్ల రాముకే నివేదికలు అనుకూలంగా ఉన్నట్లు రావికి చెప్పినట్లు తెలిసింది. వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇవ్వడం ద్వారా సామాజిక వర్గాల పరంగాను ఇతర కోణాల్లోనూ నానిని ఢీకొట్టగల సత్తా ఉందని చెప్పారట బాబు. ఇదే సమయంలో రావి వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ లేదా మరో మంచి పదవి ఇచ్చి న్యాయం చేస్తానని చంద్రబాబు చెప్పినట్లు సైకిల్ పార్టీ నేతలు చెబుతున్నారుగత ఎన్నికల్లో కొడాలి నానికి పోటీగా దేవినేని అవినాష్?ను బరిలోకి దించారు చంద్రబాబు. అయితే దేవినేని అవినాష్ స్థానికేతరుడు. నియోజకవర్గంపై పట్టు లేదంటూ కొడాలి నాని ప్రచారం చేశారు. నాన్ లోకల్ ఇష్యూతో తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిందని నిర్ణయానికి వచ్చారు చంద్రబాబు. ఈసారి అలాంటి సమస్య లేకుండా వెనిగండ్ల రామును బరిలోకి దింపితే కచ్చితంగా సీటు గెలుస్తామనే అభిప్రాయానికి వచ్చారట బాబు. స్థానికుడు కావడం.. ఇప్పటికే అన్ని వర్గాలతో కలిసిపోవడం, ఆర్థికంగా కూడా బలంగా ఉండటం వెనిగండ్ల రాముకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఇక కొడాలి నాని హయాంలో గుడివాడ అభివృద్ధి జరగలేదని టీడీపీ ప్రచార అస్త్రంగా చేసుకుంది. తాను గెలిస్తే గుడివాడను ఎలా అభివృద్ధి చేస్తాను అనేది కూడా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు రాము. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే రాముకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే వెనిగండ్ల రాముకు గుడివాడ ఇంఛార్జి బాధ్యతలు కూడా అప్పగిస్తారని సమాచారం. మొత్తానికి ఒక పక్క గన్నవరం,మరోపక్క గుడివాడ లో ఈసారి ఎన్నిక లు హోరాహోరీ జరిగే ఛాన్స్ ఉంది.

# భారత్ కు శివాజీ వాడిన ఆయుధం

ఛత్రపతి శివాజీ మహరాజ్ 1659లో వినియోగించిన ఆయుధం "వాఘ్ నఖ్"ని యూకే నుంచి ఇండియాకి రానుంది. పులిగోళ్లను పోలి ఉండే ఈ ఆయుధాన్ని 1659లో అఫ్జల్ ఖాన్‌ని చంపేందుకు వాడారు శివాజీ. ప్రస్తుతం ఇది లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది. త్వరలోనే యూకే భారత్‌కి ఈ ఆయుధాన్ని తిరిగి ఇవ్వనుంది. ఉ20 సదస్సు కోసం యూకే ప్రధాని రిషి సునాక్ భారత్‌కి వచ్చిన క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆసక్తికర ట్వీట్ చేసింది. త్వరలోనే ఈ ఆయుధం భారత్‌కి రానుందని వెల్లడించింది. శివాజీ ప్రత్యేకంగా తయారు చేయించుకున్న ఈ ఆయుధాన్ని ఆయన వారసులు ఈస్ట్ ఇండియా కంపెనీ ఆఫీసర్ జేమ్స్ గ్రాంట్ డఫ్‌కి ఇచ్చారు. ఇండియాలో సర్వీస్ ముగిసిన తరవాత జేమ్స్ గ్రాంట్ తనతో పాటు ఆ ఆయుధాన్ని బ్రిటన్‌కి తీసుకెళ్లారు. ఆ తరవాత డఫ్ వారసులు దాన్ని మ్యూజియంకి అందించారు. అప్పటి నుంచి అక్కడే భద్రపరిచారు. ఈ ఆయుధం వెనక్కి తీసుకొచ్చేందుకు మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సుధీర్ ముంగంతివార్ గట్టి ప్రయత్నమే చేశారు. త్వరలోనే ఆయన విక్టోరియా మ్యూజియంలో అంగీకార ఒప్పందం కుదుర్చుకోనున్నారు. దానిపై సంతకం చేయనున్నారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4వ తేదీల మధ్యలో సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ అండ్ డైరెక్టర్ ప్రతినిధులు, ఆర్కియాలజీ, మ్యూజియం డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు



విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంని సందర్శించనున్నారు. ఈ ఆరు రోజుల పర్యటనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే రూ.50 లక్షల నిధులు కేటాయించారు. "ఛత్రపతి శివాజీ ఆయుధమైన వఘ్ నఖ్ అమూల్యమైంది. మహారాష్ట్ర ప్రజలకు ఈ ఆయుధానికి ఎంతో అనుబంధం ఉంది. ఇది తిరిగి భారత్‌కి వస్తుండడం చాలా సంతోషం. ఈ ఆయుధాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఉంది. అందుకే...రూ.50 లక్షల నిధులు కేటాయించాం. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే ఇందుకు ఆమోదం తెలిపారు"ఈ వాఘ్‌నఘ్‌తోనే.. బిజాపూర్ సల్తనేట్ జనరల్?అఫ్జల్ ఖాన్‌ను హతమార్చారు శివాజీ. చర్మ, కండరాలను చీల్చుకునే విధంగా ఈ ఆయుధాన్ని రూపొందించారు. సైజు, ఆకారంలో చిన్నగా ఉన్నా.. ప్రత్యర్థులకు బలమైన గాయాలు చేయగలిగే సత్తా ఈ వాఘ్ నఘ్‌కు ఉంటుంది. "ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేకానికి 350ఏళ్లు పూర్తవుతోంది. ఈ ఘట్టాన్ని వేడుకగా చేసుకుంటున్నాము. అందుకే.. వాఘ్? నఘ్?ను తిరిగి ఇండియాకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాము. శివ భక్తులందరూ ఈ ఆయుధాన్ని చూడాలి. ప్రధాని మోదీ–అమిత్? షాలు చేస్తున్న గొప్ప పనికి ఇది ఒక చిహ్నంగా నిలిచిపోతుంది. బ్రిటన్?తో అక్టోబర్? 3న ఒక ఎంవోయూపై సంతకం చేస్తాము. వాఘ నఘను ఇండియాకు తీసుకొస్తాము. ఈ వాఘ నఘ.. ఈ తరం వారికి స్ఫూర్తిదాయకంగా మారుతుంది," అని మహారాష్ట్ర సాంస్కృతికశాఖ సహాయ మంత్రి సుధీర్ ముంగంతివార్ వెల్లడించారు. ఇండియాకి తీసుకొచ్చిన తర్వాత.. ఈ వాఘ్? నఘ్?ను దక్షిణ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్? వాస్తు సంగ్రహాలయలో ప్రదర్శను ఉంచనున్నట్టు తెలుస్తోంది.అయితే వాఘ్? నఘ్? ఆయుధంపై విక్టోరియా అండ్ ఆల్బర్ట్? మ్యూజియం వాదన మరో విధంగా ఉంది. ఈ ఆయుధం.. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి జేమ్స్ గ్రాంట్ డుఫ్‌కు చెందిందని చెబుతోంది. మరాఠా పేషాకు చెందిన ప్రధాని నుంచి ఆయన దీనిని గిఫ్ట్?గా పొందారని అంటోంది. కానీ ఆ ఆయుధంపై ఉన్న బ్లేడ్స్? మీద.. 'మొఘల్? జనరల్?ను హతమార్చిన శివాజీ వాఘ ?నఘ్?' అని రాసి ఉంది. అఫ్జల్? ఖాన్? హత్య.. మరాఠా చరిత్రలోనే అతి కీలకమైన ఘట్టం. భారీ మొత్తంలో సైన్యం ఉన్నప్పటికీ.. మరాఠా యోధులు రచించి మాస్టర్? ప్లాన్స్? ముందు ఖాన్? బృందం నిలబడలేకపోయింది. మరీ ముఖ్యంగా.. అఫ్జల్ ఖాన్‌ను ఇదే వాఘ నఘ్‌తో ఛత్రపతి శివాజీ హతమార్చారు. ఇదొక ఐరన్ వెపన్

### ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్‌గా

# తెలంగాణ మహిళ

ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్‌గా తెలంగాణ మహిళ ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లోని సిడ్నీలోని స్ట్రాత్‌ఫీల్డ్ మున్సిపాలిటీకి డిప్యూటీ మేయర్‌గా కర్రి సంధ్యారెడ్డి అనే మహిళ ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి భారత సంతతి మహిళగా సంధ్యారెడ్డి గుర్తింపు పొందారు. సంధ్యారెడ్డి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందినవారు. సంధ్యా రెడ్డి హైదరాబాద్‌లోని స్టాన్లీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఏం పూర్తి చేశారు? 1991లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన కర్రి బుచ్చిరెడ్డితో సంధ్యా రెడ్డి వివాహం జరిగింది. తల్లిదండ్రులు పాథోళ్ల సారారెడ్డి, శంకర్‌రెడ్డి. పెళ్లి తర్వాత భర్తతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లింది. అక్కడే చదువు కొనసాగించాడు. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ నుండి మైగ్రేషన్ లాలో డిగ్రీ. చదువు పూర్తయ్యాక ఇమ్మిగ్రేషన్ లాయర్‌గా పనిచేశారు. ఆస్ట్రేలియాకు చెందిన ఆమె తన భర్తతో కలిసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది.స్ట్రాత్‌ఫీల్డ్‌లోని హోమ్ బుష్ కమ్యూనిటీ సెంటర్‌లో భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో సంధ్యా రెడ్డి గొప్ప చొరవ చూపారు. 2020లో, ఆమె సేవలకు గానూ సిటిజన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో గుర్తింపు పొందింది. సంధ్యా రెడ్డి స్ట్రాత్‌ఫీల్డ్‌లో ఉంటారు. స్ట్రాత్‌ఫీల్డ్‌లో 2021లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.అప్పట్లో సంధ్యారెడ్డి చురుకుదనం, సేవా కార్యక్రమాలను స్థానిక తెలుగు వారు.. ప్రవాస భారతీయులు? ఆస్ట్రేలియన్లు కూడా ఆమెను పోటీ చేయమని కోరారు. దీంతో ఆమె స్థానిక లేబర్ పార్టీ, లిబరల్ పార్టీ అభ్యర్థులపై స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి.. ఎన్నికల్లో విజయం సాధించారు. స్ట్రాత్‌ఫీల్డ్ మునిసిపాలిటీకి ప్రతి ఏడు మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డిప్యూటీ మేయర్‌గా సంధ్యారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ అవకాశం రావడం పట్ల సంధ్యారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సంధ్యా రెడ్డికి నీల్ రెడ్డి, నిఖిల్ రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో నిఖిల్ ఆస్ట్రేలియా జాతీయ చెస్ ఛాంపియన్‌గా ఈ ఏడుగురిని గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియాలో తెలంగాణ మహిళా శక్తిని చాటిచెప్పిన సంధ్యారెడ్డికి బీఆర్ఎస్ ప్రవాస విభాగం కోఆర్డినేటర్ బిగాల మహేశ్, ఇతర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్ట్రాత్‌ఫీల్డ్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనందుకు ఆమెను అభినందించారు. తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమని ఆమె అన్నారు.

### పశ్చిమ డెల్టాలో

# ఎండిపోతున్న పంటలు

గుంటూరు

వాన చుక్క రాలదు. కాలువలో నీరు పారదు. కళ్ల ముందే సాగు చేస్తున్న పైరు ఎండిపోతుంటే ఆకాశం వైపు చూపు నిలవదు. సాగు తప్ప మరోటి తెలియని అన్నదాతల వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగునీటి కోసం నిరీక్షిస్తున్నాడు. వాన దేవుడు కరుణించకపోతాడా? కాలువలో ఒక్క తడికైనా నీరు రాకపోతుందా అన్న ఆశతో జీవనం సాగిస్తున్నాడు. పల్నాడు ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోనూ సాగు నీటి కొరత నెలకొంది. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో తీవ్ర సాగు నీటి ఎద్దడి నెలకొంది. వర్షాలు సకాలంలో రాకపోవడం ఒక వైపు ప్రాజెక్టుల్లో నీరు చేరకపోవడంతో పంటలు సాగు చేసేందుకు అవసరమైన నీరు అందటం లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికి సాగు మొదలు పెట్టిన రైతన్నలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు.గుంటూరు జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టాలో యాభై ఐదు వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ వద్ద నుండి కృష్ణా పశ్చిమ కెనాల్ ద్వారా సాగునీరు గుంటూరు జిల్లాలోని డెల్టా ప్రాంతానికి అందుతుంది. పశ్చిమ కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. అయితే ప్రతి ఏటా ఆరు వేల నుండి ఏడు వేల క్యూసెక్కుల నీటిని ఈ సీజన్ లో వదులుతారు. దీంతో తగినంత నీరు ఉండి రైతులు తమ పంటలు సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది మాత్రం నాలుగు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే పశ్చిమ కాలువకు విడుదల చేస్తున్నారు. దీంతో తెనాలి రూరల్ మండలంలోని బ్రాంచ్ కెనాల్ కింద సాగవుతున్న భూములకు నీరు అందటం లేదుఇప్పటికే ఎకరానికి కౌలు కాకుండా పదివేల రూపాయల పెట్టుబడి పెట్టిన రైతన్నలు పంటను రక్షించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంజన్లు, మోటార్ల ద్వారా నీళ్లను పంటలకు మళ్లిస్తున్నారు. కాలువలపై ఉన్న మోటార్లు నడవటానికి అవసరమైన విద్యుత్ కూడా లేకపోవడంతో ఇంజన్లనే నమ్ముకుంటున్నారు. అయితే వరి అత్యధికంగా సాగు చేస్తుండటంతో సకాలంలో అన్ని ఎకరాలను నీటిని పెట్టుకోలేకపోతున్నారు. మరో పది రోజుల్లో వర్షాలు లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ పంట పోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. మినుము, పెసర వంటి పంటలను జనవరి తర్వాతే సాగు చేసే అవకాశం ఉంటుందంటున్నారు. దీంతో వేసిన పంటను ఎలాగైనా రక్షించుకోవాలన్న తపనతో పొలం గట్లపైనే రైతన్నలు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు లేక పంటలపై ఆధారపడ్డ రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సాగు నీటి కరువుతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

# కొత్త రిజిస్ట్రేషన్స్ పై సర్కార్ క్లారిటీ...

ఏపీలో కొత్తగా ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ విధానంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ప్రజలు సొంతంగా పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రచారంలో ఉన్న అపోహలకు వివరణ ఇచ్చింది.ప్రస్తుతం ఏ రిజిస్ట్రేషన్ పద్ధతిలో దస్తావేజులు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయో, ఆ విధానంలోనే దస్తావేజులు ఈరోజు కూడా జరుగుతున్నాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. దస్తావేజులు కూడా భౌతికంగానే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఎవరైతే దస్తావేజులు ఆన్– లైన్లో చేయాలని కోరుకుంటారో వారికి మాత్రమే కొత్త పద్ధతిలో దస్తావేజులు రిజిస్టర్ చేస్తారు.కొత్త పద్ధతిలో దస్తావేజులు తయారు చేసుకోవడం–అప్–లోడ్ చేయడం మరియు అపాయింట్మెంట్ తీసుకోవడం అనేవి ప్రతిపాదిత విధానంలో సులభతరంగా కానున్నాయి. దస్తావేజులను చిన్నచిన్న కారణములతో సబ్ రిజిస్టర్ తిరస్కరించడానికి అవకాశం ఇకపై ఉండదు. జవాబుదారీతనం, పారదర్శకతకు పెద్దపీట వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కొత్త రిజిస్ట్రేషన్ విధానంపైతలెత్తే పలు సందేహాలకు వివరణలు ఇచ్చింది.

అపోహ –1) నూతన రిజిస్ట్రేషన్ విధానం కార్డ్ 2.0.. మరింత కష్టమైనది. సాధారణ ప్రజల అవగాహనకి అందనిది. సురక్షితం కానిది.

వాస్తవం–1) దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభం, సువిధం మరియు సురక్షితం.

అపోహ–2) నూతన విధానంలో ప్రజలు దస్తావేజులు తయారు చేసుకోవడానికి ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది. వివరాల నమోదుకు అధిక సమయం పడుతుంది.

వాస్తవం–2) ప్రజలు తమ దస్తావేజులు తామే రూపొందించుకోవడానికి సులభంగా తమ పేర్లు మరియు ఆస్తి వివరాలను నమోదు చేయడానికి, ఇతరులు ఎవరూ తమ ఆస్తి వివరాలను నమోదు చేయకుండా అత్యధికముగా ప్రజలు తామే సురక్షితమైన ఆధార్ వివరాల ద్వారా తమ దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపేందుకు వీలుగా ప్రస్తుత సాఫ్ట్ వేర్ రూపొందించబడింది.

అపోహ–3) సాంప్రదాయక దస్తావేజుల ముద్రణ అదృశ్యమైపోయినట్లే. ఇక తెల్ల కాగితాలే దస్తావేజులు అవుతాయి.

వాస్తవం–3) స్టాంప్ పేపర్ పై దస్తావేజు ముద్రణ ఉండదని కొంతమంది పనిగట్టుకుని ప్రచారం చేయడం, ప్రజల సౌకర్యార్థం రూపొందించబడిన ప్రక్రియను అడ్డుకొనడమే అవుతుంది. ప్రజలు సబ్ రిజిస్ట్రార్ ఆన్లైన్ ద్వారా వచ్చిన దస్తావేజును రిజిస్టరు చేసిన తరువాత స్టాంప్ పేపర్ మీద ముద్రించే సౌకర్యం కూడా కల్పించారు.

అపోహ–4) ఆన్లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసి, ఈ –సైన్ చేయబడిన దస్తావేజులను ఋణాల నిమిత్తం తనఖా సంస్థలు బ్యాంకింగ్ వర్గాలు ఆమోదించవు.

వాస్తవం–4) ఆన్లైన్ మరియు వ–బతిణని ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను తనఖా సంస్థలు మరియు బ్యాంకులు అభ్యంతరాలు వ్యక్తం చేయడం అనేది అపోహ మాత్రమే. బ్యాంకింగ్ సంస్థలు, పై పద్ధతి ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను ఔఇూఒ సంస్థ ద్వారా, వ–స్టాంపింగ్ విధానం ద్వారా స్వీకరిస్తున్నారు మరియు స్వాగతిస్తున్నారు.

అపోహ–5) ఆన్లైన్ ద్వారా దస్తావేజుల వివరాలను ప్రజలు నింపేటప్పుడు నా తప్పులు దొర్లితే వాటిని ఇక సవరించుకోవడానికి నేను అవకాశం ఉండదు ఆ తప్పులు సరి చేయబడటానికి వీలు లేదు.

వాస్తవం–5) ఆన్లైన్ ద్వారా నమోదు చేసిన దస్తావేజులలో ఏదైనా తప్పులు దొర్లితే వాటిని ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే ప్రజలు అనుమతితో సవరించవచ్చు. సవరణ ప్రక్రియ ఇంకా సులభతరం అవుతుంది.

అపోహ–6) రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈయబడే ఆన్లైన్ ప్రింటులు ఆరు మాసాల్లో మాయం అయిపోతాయి. ఆపై అవి తెల్ల కాగితాలవుతాయి..

వాస్తవం–6) ఆరు నెలల్లో అక్షరాలు మాయమవుతాయి అనేది తప్పుడు ప్రచారం. ప్రింటర్ ద్వారా ముద్రించబడిన రిజిస్ట్రేషన్ దస్తావేజు ప్రస్తుత దస్తావేజు లేఖరి ముద్రిస్తున్న దస్తావేజులాగానే ఉంటాయి.

# అంతు పట్టని మజ్లిస్ వైఖరి

తెలుగు ట్రాక్,హైదరాబాద్

మజ్లిస్ కలిసే పోటీ చేస్తున్నామని కేసీఆర్ అభ్యర్థుల ప్రకటన సమయంలో ప్రకటించారు. అయితే బీఆర్ఎస్ టిక్కెట్ల కేటాయింపుపై మజ్లిస్ ఇంత వరకూ స్పందించలేదు. కలిసే పోటీ చేస్తున్నామన్న కేసీఆర్ మాటలపైనా సైలెంట్ గా ఉన్నారు. తెలంగాణ రాజకీయాల్లో మజ్లిస్ పాత్ర చాలా కీలకం. ఆ పార్టీకి కనీసం ఏడు స్థానాలు గ్యారంటీగా వస్తాయి. అంతే కాదు ఆ పార్టీ తాను అనుకున్న పార్టీకి ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు వేయించగలదు. ఇప్పటి వరకూ బీఆర్ఎస్‌తో లోపాయికారీ పొత్తులతోనే ఉన్నారు. తమ ఏడు సీట్లు.. హైదరాబాద్ పార్లమెంట్ లో తప్ప ఎక్కడా అభ్యర్థుల్ని నిలబెట్టడం లేదు. కానీ గత ఏడాదిన్నరగా జరిగిన పరిణామాలు చూస్తే మజ్లిస్ మరో ఆలోచనలో ఉన్నట్లుగా అర్థమవుతుంది.మజ్లిస్ – బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయి. మజ్లిస్ పార్టీ పోటీ చేసిన నియోజకవర్గాలు తప్ప మిగతా సెగ్మెంట్లలో మజ్లిస్ ఓట్లతో పాటు ముస్లిం మైనారిటీల ఓట్లు కూడా బీఆర్ఎస్‌కే పడేవి. తెలంగాణ రాజకీయాల్లో అటు బీఆర్ఎస్, ఇటు మజ్లిస్ పొత్తులు పెట్టుకోవు. కానీ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకుంటాయి. గత ఎన్నికల్లో కేసీఆర్ కు మజ్లిస్ పరోక్ష సహకారం ఎంతో లబించింది. ఎనిమిది చోట్ల తప్ప మజ్లిస్ ఇతర చోట్ల పోటీ చేయలేదు. కొంత పాతబస్తీ కాలనీలు ఉండే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మాత్రం మజ్లిస్ పోటీ చేసింది. కానీ ఆ ఒక్క చోట మాత్రమే ఓడిపోయింది. అన్ని చోట్లా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని తమ వర్గానికి సంకేతాలు పంపింది. దీంతో ముస్లిం వర్గం ఎక్కువ ఉన్న చోట్ల బీఆర్ఎస్ విజయం సులువు అయింది. అయితే ఇటీవలి కాలంలో తమ పార్టీని విస్తరించాలనుకుంటున్న మజ్లిస్... మరికొన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటిస్తోంది. రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్,బోధన్, నిజామాబాద్ లాంటి చోట్ల అభ్యర్థుల్ని నిలబెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా ఆ పార్టీ నేతలు ప్రకటించారు. మజ్లిస్ పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించడానికి అసదుద్దీన్ ఓవైసీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఆయన పోటీ చేస్తున్నారు. ఓట్ల శాతాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణలోనూ ఆయన పట్టు పెంచుకోవాలని చూడకుండా ఉండరు. రాజకీయాల్లో ఎవరికైనా అంతిమ లక్ష్యం తాము బలపడటమే. పరస్పర ప్రయోజనాలు ఉన్నప్పుడే.. సహకారం తీసుకుంటారు. ఒక పార్టీకే ప్రయోజనం కల్పించే సహకారాలు రాజకీయాల్లో నిలబడవు. అందుకే పరస్పర ప్రయోజనం ఉంటేనే మజ్లిస్ సహకారానికి ఒప్పుకుంటుంది. బీఆర్ఎస్ సహకారం ఉన్నా లేకున్నా.. మజ్లిస్ సులువుగా ఏడు చోట్ల విజయం సాధించే అవకాశం ఉంది. అంతకు మించిన ప్రయోజనం ఉంటే తప్ప సహకారం ఇవ్వరు. మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఏదీ తొందరపాటుతో చేయరు. ప్రతీ దానికి ఓ లెక్క ఉంటుంది. ఇప్పుడే బీఆర్ఎస్ తో అవగాహన... సీట్ల గురించి మాట్లాడటం ఆయనకు ఇష్టం ఉండదు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత తాను చేయాలనుకున్న పని చేస్తారు.తెలంగాణలో ఎవరు గెలిచినా మజ్లిస్ పార్టీకి మాత్రం ఏడు అసెంబ్లీ స్థానాలు ఖాయం. 119 అసెంబ్లీ స్థానాల్లో ఏడు అంటే ఒక్కో సారి కింగ్ మేకర్ కావొచ్చు. ఈ సారి మాత్రం ఏడు కాదు ఆ సంఖ్యను ఇంకా పెంచుకోవాలని కింగ్ మేకర్ అయ్యే అవకాశాలు పొందాలని అనుకుంటున్నారు ఇటీవల బోదన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే షకీల్ కు.. ఎంఐఎం నేతల మధ్య ఘర్షణ జరిగింది. అప్పుడు ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌తో పొత్తు మాటే ఉండదన్నారు. . కేసీఆర్ చెప్పారని ఆయన కొన్ని సీట్లకే పరిమితం అవ్వరు. తనకు రాజకీయంగా ప్రయోజనం లభిస్తుందని అనుకుంటేనే ఆ పని చేస్తారు. అందుకే మజ్లిస్ నిర్ణయంపై ఉత్కంఠ ఏర్పడుతోంది.

# ఖమ్మంలో కాంగ్రెస్ నేతల బరువు

తెలుగు ట్రాక్,ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కొక్కరిగా కారు దిగుతున్న నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం పెరగడంతో పాటు, కొత్త తలనొప్పులూ వచ్చి పడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మంలో పది స్థానాలు ఉన్నప్పటికీ జనరల్ స్థానాలు మాత్రం కేవలం మూడు మాత్రమే. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం మాత్రమే జనరల్ స్థానాలు. కీలక నేతలంతా ఈ మూడు స్థానాల కోసమే పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తాజాగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేపోమాపో చేరుతారని భావిస్తున్న జలగం వెంకట్రావు, అలాగే పార్టీని విలీనం చేయాలనుకుంటున్న షర్మిల ఇలా అందరూ ఉమ్మడి జిల్లాలో ఉన్న మూడు అన్ రిజర్వుడు అసెంబ్లీ స్థానాల కోసం పోటీ పడుతున్నారు. పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరబోతున్న షర్మిల, తుమ్మల నాగేశ్వరరావు ఆసక్తి చూపుతున్నారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి సైతం పాలేరు సీటుకే దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం లేదా పాలేరు నుంచి పోటీ చేయాలని పొంగులేటి అనుచరుల ప్రధాన డిమాండ్‌గా ఉంది. 'పోయిన చోటే వెతుక్కోవాలనే' కోణంలో తుమ్మల నాగేశ్వరరావు గత ఎన్నికల్లో ఓడిన పాలేరు నుంచే గెలిచి తన సత్తా ఏంటో చూపించుకోవాలని భావిస్తున్నారు. ఇక షర్మిల సైతం 'మట్టి పట్టుకొని పాలేరు నుంచి పోటీ చేస్తానని' ప్రమాణం చేసి ఉన్నారు. కాబట్టి ఆమె కూడా చేరాలన్నా.. పాలేరు సీటునే ప్రధానంగా డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు పోటీకొస్తే పాలేరు నుంచి బరిలో నిలవాలన్న యోచనలో పొంగులేటి ఉన్నారు. పాలేరు , కొత్త గూడెం వంటి చోట్ల పోటీ చేయడానికి కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, మాజీ మంత్రి రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి తమ్ముని కుమారుడు చరణ్ రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాస్, రామసహాయం మాధవీ రెడ్డి వంటి నేతలు పని చేసుకుంటూ వచ్చారు. ఈ పరిణామాలతో వీరందరికీ మొండిచేయి ఎదురయ్యే పరిస్థితి కనబడుతోంది. ఖమ్మం నియోజకవర్గం కాంగ్రెస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అయితేనే మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు దీటైన పోటీ ఇస్తారని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. సామాజిక సమీకరణాల దృష్ట్యా తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుంచి పోటీ చేస్తే మంచిదని భావిస్తున్నారు. పాలేరులో రెడ్డి సామాజికవర్గ సీటుగా భావిస్తూ ఉంటారు. కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశమూ చేశారు.

# బీసీలకు 34 సీట్లు సాధ్యమేనా

## టీ కాంగ్రెస్ లో అంతర్గత చర్చ

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఇది నిజంగా తలనొప్పి వ్యవహారమే. తెలంగాణలో ఉన్న అసెంబ్లీ సీట్లు 119. ఇందులో ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ సీట్లు 31. కనీసం 35 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సీనియర్లకు టికెట్లు ఇవ్వాల్సిందే. వాళ్లంతా అగ్రవర్ణ నేతలే. ఈ 66 సీట్లలో బీసీలకు నో ఛాన్స్. ఇక మొన్న కాంగ్రెస్ టికెట్ కోసం జరిగిన దరఖాస్తుల ప్రక్రియలో 11 నియోజకవర్గాల్లో ఎక్కడా ఒక్క బీసీ నేత కూడా టికెట్ కోసం అప్లై చేయలేదు. అంటే.. ఈ 77 సీట్లలో బీసీలకు టికెట్లు ఇవ్వడం అసాధ్యం. ఇక మిగిలింది 42 సీట్లు. ఈ 42లో 34 సీట్లు బీసీలకే ఇవ్వాల్సి ఉంటుంది. ఏం.. అంత కచ్చితంగా 34 సీట్లు బీసీలకు ఎందుకు ఇవ్వాలి? గతేడాది ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకటించింది కాంగ్రెస్ పార్టీ. దీని ప్రకారం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోని రెండు అసెంబ్లీ స్థానాల్లో కచ్చితంగా బీసీలకు టికెట్లు ఇచ్చి తీరాలి. తెలంగాణలో 17 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఒక్కో ఎంపీ సెగ్మెంట్లో రెండు చొప్పున మొత్తం 34 సీట్లు బీసీలకు ఇవ్వాలి. సాధ్యమేనా? మిగిలిన వారికి అవకాశం ఉన్నదే 42 స్థానాలు. అందులో 34 మంది బీసీలకు టికెట్లు ఇవ్వగలరా? అంత బలమైన నేతలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? ఏ ప్రాతిపదికన లెక్కలు కట్టారో గానీ.. ఈసారి కచ్చితంగా 34 సీట్లు బీసీలకు ఇస్తామని బల్లగుద్ది మరీ చెప్పారు.తెలంగాణలో సగం జనాభా బీసీలే. కాని, పొలిటికల్‌గా రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్. అందుకే, తెలంగాణలో బీసీలకు ఎక్కువ స్థానాలు కేటాయించలేని పరిస్థితి ఉందనేది రాజకీయ విశ్లేషకుల వాదన. నల్లగొండ పార్లమెంట్ సెగ్మెంటే ఒక ఉదాహరణ. ఈ పార్లమెంట్ నియోజకవర్గం కింద ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. దేవరకొండ తప్ప మిగిలినవన్నీ నాన్–రిజర్వ్ సెగ్మెంట్లే. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్ నగర్, కోదాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీలను కూడా నిలబెట్టొచ్చు. కాని, నాగార్జున సాగర్, మిర్యాలగూడ నుంచి జానారెడ్డి కుమారులు, హుజూర్‌నగర్, కోదాడ నుంచి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు, నల్లగొండలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్లై చేసుకున్నారు. సూర్యాపేటలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డిలో ఎవరికో ఒకరికి ఇవ్వాలి. మరి ఇక్కడ బీసీలకు స్థానం ఏది? కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీసీల కోసం తన సీటు వదులుకోడానికి సిద్ధం అన్నారు. అంటే.. మిగిలిన వాళ్లు కూడా త్యాగం చేయాల్సి వస్తుంది. చేస్తారా మరి.. అలా పోటీ నుంచి తప్పుకుంటారా? తప్పుకోకపోతే.. నల్లగొండ పార్లమెంట్ నుంచి ఒక్క బీసీకి కూడా టికెట్ దక్కదు.ఇక ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్ చూద్దాం. ఇక్కడ కొత్తగూడెం, పాలేరు, ఖమ్మం.. ఈ మూడు అసెంబ్లీ స్థానాలు మాత్రమే జనరల్. ఇందులో పాలేరు, ఖమ్మం స్థానాలను పొంగులేటి లేదా తుమ్మలకు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. మిగిలింది కొత్తగూడెం మాత్రమే. అక్కడ సీపీఐకి ఛాన్స్ ఇస్తామంటున్నారు. ఈ లెక్కన ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్‌లోనూ ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టికెట్ ఇచ్చే పరిస్థితి లేదు. ఇక మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క నర్సంపేట అసెంబ్లీ మినహా మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లన్నీ రిజర్వ్‌డ్ కేటగిరి స్థానాలే. ఉన్న ఆ ఒక్క నర్సంపేటలోనూ బీసీకి టికెట్ ఇచ్చే అవకాశాలు లేవంటున్నారు. మామూలుగా చెప్పుకుంటేనే మూడు పార్లమెంట్ సెగ్మెంట్లలో ఒక్క బీసీకి కూడా సీటు ఇచ్చే పరిస్థితి లేదు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో జనగామ, ఆలేరులో బీసీ లీడర్లు టికెట్లు ఆశిస్తున్నారు. కాని, జనగామలో పొన్నాల లక్ష్మయ్యకు పోటీగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి టికెట్ అడుగుతున్నారు. ఇవే ఈక్వేషన్స్ తెలంగాణలోని మిగిలిన పార్లమెంట్ సెగ్మెంట్లలో ఉన్నాయి. అలాంటప్పుడు 34 సీట్లు బీసీలకు ఎలా ఇస్తారు. సరే.. మిగిలిన దగ్గర సర్దుబాటు చేయాలనుకున్నా గానీ ప్రత్యర్థులకు పోటీనిచ్చేంత స్థాయిలో బీసీ లీడర్లు ఉన్నారా అన్నది కూడా చూడాలిగా. బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలనుకున్నా కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేకపోతోంది. ఈ సమస్య ఒక్క కాంగ్రెస్ పార్టీకే కాదు.. అన్ని పార్టీలదీ ఇదే సమస్య. 2014 ఎన్నికల్లో బీసీలకు 32 స్థానాలు ఇచ్చిన కాంగ్రెస్.. 2018లో మాత్రం కేవలం 24 మందికే ఇవ్వగలిగింది. ఇప్పుడు 34 మందికి కచ్చితంగా ఇస్తామని చెబుతున్నా.. అలాంటి పరిస్థితి కనిపించడం లేదు.జిల్లాల వారీగా చూసినా సరే.. బీసీలకు టికెట్ ఇవ్వలేని పొజిషన్‌లో ఉంది కాంగ్రెస్ పార్టీ. ములుగు జిల్లాలో ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. అది కూడా ఎస్టీలకు రిజర్వ్. బీసీలు పోటీ చేసే ఛాన్స్ లేదు. భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి సెగ్మెంట్ జనరల్ అయినా.. ఇక్కడ మూడు ప్రధాన పార్టీలు కూడా అగ్రవర్ణాలకే టికెట్ ఇవ్వడానికి రెడీ అయ్యాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో అలంపూర్ ఎస్సీ రిజర్వ్‌డ్. గద్వాల పరిధిలో బీసీ ఓటర్లే ఎక్కువ మంది ఉన్నా.. ఇక్కడ అగ్రవర్ణాలకే టికెట్‌ను ఇస్తూ వస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇలా ఏ పార్లమెంట్ సెగ్మెంట్ తీసుకున్నా, జిల్లాల వారీగా చూసినా.. బీసీలకు ప్రతిపాదించిన 34 అసెంబ్లీ సీట్లు ఇచ్చే పరిస్థితి అయితే లేదు.కాంగ్రెస్ తరపున బీసీ నేతలు పోటీ చేస్తున్న చోట కూడా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎగ్జాంపుల్? మధుయాష్కి గౌడ్ ఎపిసోడ్. పారాచూట్ నాయకులకు ఎల్బీనగర్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వొద్దంటూ పోస్టర్లు అతికించారు. నిజామాబాద్ జిల్లాలో పోటీ చేయాల్సిన వ్యక్తికి ఎల్బీనగర్‌లో పనేంటంటూ కామెంట్స్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్‌కే ఈ పరిస్థితి ఉంటే.. ఇక మిగిలిన వారి సంగతేంటి? పొన్నం ప్రభాకర్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురైందని చెప్పుకుంటున్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒకవేళ పొత్తు కుదిరితే ఈ సీటు సీపీఐకి ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ చాడా వెంకటరెడ్డి పోటీ చేస్తారని తెలుస్తోంది. ఇలా.. బీసీలకు అవకాశం ఇవ్వాల్సిన చోట కూడా ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొత్తంగా ఎలా చూసినా సరే.. కాంగ్రెస్ పార్టీ ఈసారి 34 సీట్లు బీసీలకు ఇవ్వడం అసాధ్యంగా కనిపిస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. పైగా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు ఇస్తామని ప్రకటించుకుంది కాంగ్రెస్. 115 మంది అభ్యర్థుల్లో 23 మంది బీసీలకు టికెట్లు ఇచ్చారు సీఎం కేసీఆర్. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం అంతకంటే ఎక్కువ మందికి ఇవ్వాలి. కాని, అలా టికెట్లు ఇచ్చే పరిస్థితి లేదంటున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ బీసీలకు ఎక్కువ సీట్లే ఇచ్చినా.. ఎక్కువ మందిని గెలిపించుకోలేకపోయింది కాంగ్రెస్. అందుకే, ఆ అనుభవంతో బలమైన అభ్యర్థులకే సీట్లు ఇస్తుంది తప్ప.. ప్రత్యేకంగా బీసీలకే టికెట్లు ఇవ్వకపోవచ్చు. అదే జరిగితే.. ఇచ్చిన మాట తప్పినట్టే లెక్క.పైగా గెలిచే సీట్లలోనే బీసీలకు టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం డిమాండ్ చేస్తోంది. ఏదో ఇచ్చామంటే ఇచ్చామని కాదు.. కచ్చితంగా గెలిచే సీట్లే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. గతంలో లాగా ఓడిపోయే స్థానాల్లో ఇవ్వకుండా అన్నీ పరిశీలించి ఇవ్వాలని కొంతమంది బీసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.పొన్నాల కూడా మొన్నామధ్య ఇవే కామెంట్స్ చేశారు. ఇతర పార్టీల్లో బీసీలు గెలుస్తున్నప్పుడు కాంగ్రెస్‌లో మాత్రం బీసీ నేతలే ఎందుకు ఓడిపోతున్నారో హైకమాండ్ గుర్తించాలన్నారు పొన్నాల. కాంగ్రెస్‌లో బలమైన బీసీ లీడర్లు ఉన్న 45 నియోజకవర్గాల లిస్ట్ తయారు చేసిన బీసీ నేతలు.. వచ్చే ఎన్నికల్లో వారికి టిక్కెట్‌లు వచ్చేలా హైకమాండ్‌పై ఒత్తిడి తేవాలని డిసైడ్ అయ్యారు. మరి.. సర్వేలకు తగ్గట్టుగా అన్ని సీట్లు ఇస్తారా అంటే.. అనుమానమే. ఫైనల్‌గా కాంగ్రెస్ ప్రయోగించాలనుకున్న బీసీ అస్త్రం ఆ పార్టీకే బూమరాంగ్ అయ్యేలా కనిపిస్తోంది. ముమ్ముందు ఏమవుతుందో చూడాలంటే.. వెయిట్ చేయాల్సిందే.

# 28నే నిమజ్జనం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ఈసారి గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకే రోజు రానున్నాయి. సెప్టెంబర్ 19న వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండగా, 28న నిమజ్జనం నిర్వహించనున్నారు. అయితే అదే రోజు మిలాద్ ఉన్ నబీ పండుగ కూడా వచ్చింది. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా హైదరాబాద్‌లో ముస్లింలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అదే రోజు నిమజ్జనం జరగడంతో హిందువులు కూడా వినాయక శోభాయాత్రలు నిర్వహిస్తారు. అయితే రెండు మతాల పండుగలు ఒకే రోజున శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే ఇరు మతాలకు చెందిన 300 మంది నేతలతో శాంతి కమిటీ (పీస్ కమిటీ)ని ఏర్పాటు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్ రావు నేతృత్వంలో పీస్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సభ్యులు చర్చించారు. రెండు పండుగలు ఒకే రోజు కావడంతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీని వాయిదా వేసేందుకు శాంతి కమిటీ సభ్యులు అంగీకరించారు. విగ్రహాలను ప్రతిష్ఠించిన 3వ, 6వ మరియు 9వ రోజులలో ఎప్పుడైనా గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని హిందూ భక్తులు సూచించారు. రెండు పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రెండు పండుగలు ఒకే రోజు రావడంపై ఆల్ ఇండియా మజ్లిస్-ఏ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలకు సూచించారు. ఒకే రోజు రెండు పండుగలు రావడంతో శాంతి భద్రతలకు



విఘాతం కలిగించేలా కొందరు ప్రయత్నిస్తున్నారని.. అలాంటి వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. హైదరాబాద్ శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని మిలాద్ ఉన్ నబీ ర్యాలీని రద్దు చేస్తూ ఎస్‌యూఎఫ్ఐ నిర్ణయం తీసుకుందని అసద్ వెల్లడించారు. ప్రజలు రెండు పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

# రెండో విడత ఇండ్ల పంపిణీకి సిద్ధం

తెలుగు ట్రాక్,హైదరాబాద్



అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయాలు చకచకా తీసుకుంటోంది. ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. తొలి విడత డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ చేసిన ప్రభుత్వం రెండో విడతకు రెడీ అయింది. హైదరాబాద్?లో డబుల్? బెడ్?రూం ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఫిక్సయింది. ఈ నెల 21న అర్హులైన పేదలకు 13,300 ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. రెండో దశలో దాదాపు 13,300 ఇళ్లను పేదలకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. డబుల్? బెడ్?రూం ఇళ్ల పంపిణీపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో? సమీక్ష సమావేశం నిర్వహించారు కేటీఆర్. అత్యంత పారదర్శకంగా అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూంలు అందిస్తున్నామని ఇళ్ల ఎంపిక ప్రక్రియలో ఎవరి ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. తొలివిడతలో కొల్లూరులో 3, 500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేసింది ప్రభుత్వం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగితే పూర్తిస్థాయి బాధ్యత అధికారులదేనని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండదన్నారు మంత్రి కేటీఆర్. అర్హుల ఎంపిక పూర్తిస్థాయి బాధ్యతను ప్రభుత్వం అధికారులకే అప్పగించినట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి వివరాలతో కంప్యూటర్ ఆధారిత డ్రా తీస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని కబ్జాలను తొలగించి, వారికి డబుల్ బెడ్?రూమ్ ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు మంత్రి కేటీఆర్. హైదరాబాద్?లో నిర్మిస్తున్న లక్ష డబుల్ బెడ్?రూమ్ ఇళ్లకు ప్రభుత్వానికి 9వేల 100 కోట్ల ఖర్చయిందని.. వాటి మార్కెట్ విలువ 50 వేల కోట్లుగా ఉందన్నారు. గృహలక్ష్మి పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు మంత్రి కేటీఆర్. హైదరాబాద్ లో నోటరీ ప్రాపర్టీల అంశంలోనూ త్వరలో పూర్తి మార్గదర్శకాలు వస్తాయన్నారు మంత్రి కేటీఆర్. 58, 59 జీవోల ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు ఉపశమనం లభించిందని గుర్తు చేశారు.

# 47పార్టీలకు ఎమ్మెల్సీ కవిత లేఖ

తెలుగు ట్రాక్,హైదరాబాద్

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లుపై గట్టిగా పట్టుబడుతున్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అయినా... మహిళా బిల్లును ఆమోదించాలి డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం ప్రయత్నాలు కూడా మొదలుపెట్టేశారు. ఇందులో భాగంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు లేఖ రాశారు ఎమ్మెల్సీ కవిత. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అయినా మహిళా బిల్లును ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలని రాజకీయ పార్టీలను కోరారామె. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి... రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోపాటు 47 రాజకీయ పార్టీల అధ్యక్షులకు లేఖ రాశారు కవిత. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం మద్దతు పలకాలని కోరారు. మహిళా బిల్లు చారిత్రక అవసరమని, చట్టసభల్లో సరిపడా మహిళల ప్రాతినిధ్యం ఉంటేనే.. దేశం పురోగమిస్తుందని లేఖలో ఆమె అభిప్రాయపడ్డారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాలని కోరారు. లింగ సమానత్వం, సమ్మిళిత పాలనకు మహిళా బిల్లు చాలా కీలకమని.. అయినా, ఆ బిల్లు చాలా కాలం పాటు పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచడం చాలా ముఖ్యమన్నారు. దేశ జనాభాలో 50 శాతం వరకు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్న కవిత.. చట్ట సభల్లో మాత్రం మహిళలకు ఓటు లభించడం లేదని అన్నారు. అందుకే అందరం కలిసి మహిళా బిల్లు కోసం పట్టుబట్టాలన్నారు. అన్ని పార్టీలు కలిసి వస్తేనే.. కేంద్రం దిగివస్తుందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాలలో మహిళా బిల్లుపై అందరు కలసి కట్టుగా ఒత్తిడి పెంచాలని కోరారు కవిత. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, ఔఅఖ చీఫ్ శరద్ పవార్, ం‌ఎఅఆ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏపీ సీఎం, జూఅఖ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు దేశంలోని పలు రాజకీయ పార్టీల అధ్యక్షులకు తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. మహిళా బిల్లు



ఆవశ్యకతను గుర్తించి.. తన పోరాటానికి మద్దతు ఇవ్వాలని లేఖ ద్వారా కోరారు. ఈనెల 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల అజెండా ఏంటో ఇప్పటికీ క్లారిటీ రాలేదు. అయితే... ఇప్పటికే రాజ్యసభలో ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ బిల్లు... లోక్‌సభలో పెండింగ్‌లో ఉంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు చేపడుతున్న కేంద్రం... ఇప్పుడైనా లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు కవిత.రాజ్యాంగ సవరణలతో త్వరలోనే పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉంటుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ చెప్పారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదని చెప్పారాయన. 2047 నాటికి ప్రపంచ శక్తిగా ఎదుగుతామన్నారు. మహిళా రిజర్వేషన్ ముందుగా జరిగితే... 2047 కంటే ముందే నెంబర్-1 స్థానంలో ఉంటామన్నారు. జైపూర్‌లో విశ్వవిద్యాలయ మహారాణి మహావిద్యాలయ బాలికలతో జరిగిన ఇంటరాక్టివ్ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్.

# మార్పు మీనుంచే రావాలి సుమా

## ఎమ్మెల్సీ కవితకు వైఎస్ షర్మిల రెడ్డి లేఖ



తెలుగు ట్రాక్, హైదరాబాద్

మహాత్మా గాంధీ చెప్పినట్లు మీరు చూడాలి అనుకుంటున్న మార్పు, మీ నుంచే మొదలు పెట్టండని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి ఎమ్మెల్సీ కవితకు సూచించారు. ఈ మేరకు ఆమె కవితకు లేఖ రాసారు. మీ పార్టీ పుట్టిన దగ్గర నుంచి 5శాతం కూడా మహిళలకు సీట్లు ఇవ్వలేదు. నా అభిప్రాయంతో పాటు,ఇటీవల బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా సైతం పంపుతున్నా. జాబితా తో పాటు ఒక కాలిక్యులేటర్ లింక్ సైతం పంపిస్తున్న. బీఆర్ఎస్ జాబితా చూసి 33శాతం ఇచ్చారా? లేదా? లెక్కించండి. మద్దతు కూడగట్టే ముందు మీ తండ్రితో ఈ విషయం చర్చ చేయాలని మనవని అన్నారు. మహిళా బిల్లుకు మద్దతు కోరుతూ మీరు రాసిన లేఖ అందింది. తెలంగాణలో మహిళలకు న్యాయం చేయకుండా ఈ పోరాటాన్ని జాతీయ వేదికపై ఎలా తీసుకువెళ్తారు ? మీ పార్టీ పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి దాకా 5 శాతం కంటే ఎక్కువ సీట్లు కేటాయించలేదు. మంత్రి వర్గంలోనూ మహిళలకు ప్రాధాన్యత లేదు. సీఎం కూతురిగా మీ తండ్రిని ఏనాడూ ఈ అంశంపై ప్రశ్నించలేదు. మీ పార్టీలో,ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇవ్వకుండా ఢిల్లీ వేదికగా ఉద్యమం చేయడం హాస్యాస్పదమని అన్నారు.

మహిళా రిజర్వేషన్ పై ముందు మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. తెలంగాణ అసెంబ్లీలో ఎక్కువ మందికి ఈ ఎన్నికల్లో సీట్లు ఇవ్వండి. ఇదే మీ ఉద్యమానికి మొదటి అడుగు అవ్వాలి. ఇక్కడ తేల్చకుండా ఢిల్లీ వేదికగా ఉద్యమం చేయడం ఃఖీా ద్వంద వైఖరికి నిదర్శనం. మహిళా బిల్లుపై దేశ వ్యాప్త మద్దతు కూడగట్టే ముందు కవిత కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. 2004 నుంచి ఇప్పటి వరకు మహిళలకు మీరిచ్చిన సీట్లు ఎన్ని ? 2014లో మహిళలకు మీరిచ్చిన సీట్లు 6 అని గుర్తుకు లేదా ? 2018 లో మీరిచ్చిన సీట్లు 4 అని మీకు కనపడటం లేదా ? సీట్ల కేటాయింపు లో ఒక మహిళగా మీరు నోరు ఎందుకు ఎత్తలేదు ? 2014 లో మీకు ఒక ఎంపీ స్థానం,2019లో ఇద్దరికీ అవకాశం ఇదేనా మహిళలకు పెద్దపీట ? మీ మొదటి దఫా ప్రభుత్వంలో మహిళా మంత్రి ఎందుకు లేరు ? సుదీర్ఘకాలం పాటు ఎందుకు మహిళా కమిషన్ ను పెండింగ్ లో పెట్టారు ? మహిళా బిల్లుపై మీరు దీక్ష చేసిన తర్వాత ఇప్పుడు 7 సీట్లు కేటాయించడం ఏంటి? మహిళలకు ప్రాధాన్యత ఇవ్వని మీరు ఇతర పార్టీల చిత్తశుద్ధిని ఎలా ప్రశ్నిస్తారు? మీకు ఆ హక్కు ఎక్కడిది ? తెలంగాణలో మహిళలను దొక్కింది మీ ప్రభుత్వం కాదా ? - మహిళలపై దాడులు చేసి కించపరిచింది మీ పార్టీ కాదా ? ఉన్నట్లుండి మహిళా రిజర్వేషన్లు అంటూ ముందటేసుకున్న మీ ఆంతర్యం ఏంటి? రాబోయే ఎన్నికల్లో మహిళల నుంచి వచ్చే వ్యతిరేకత దృష్ట్యా నష్ట నివారణ చర్యల్లో ఇది ఒక ఎత్తుగడనా ? కవితకు ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఒక మహిళగా తెలంగాణ అసెంబ్లీలో,పార్లమెంట్ లో హక్కుల కోసం జరిపే పోరాటంలో నా మద్దతు ఎప్పుడు ఉంటుంది. కానీ మహిళా రిజర్వేషన్ విషయంలో మీ రాజకీయ క్రీడలో నేను బాగం కాలేనని అన్నారు.

# జమిలిపై ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చిందా?

## రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఉత్త నాటకమేనా?

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ


జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందా? మూడు నాలుగు నెలల ముందే ఈ అంశంపై పని ప్రారంభించిందా? రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఉత్త నాటకమేనా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. కొన్ని నెలలుగా బీజేపీ సీనియర్లతోపాటు కమిటీ అధ్యక్షుడు, మాజీ రాష్ట్రపతి కదలికలను గమనిస్తే దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని మోదీ సర్కారు ఎప్పుడో నిర్ణయించుకొన్నదని అర్థమవుతుంది. ఏదో చట్టబద్ధంగా, పద్ధతి ప్రకారం వ్యవహరిస్తున్నామని ప్రజలకు చెప్పేందుకే కమిటీ పేరుతో నాటకం మొదలుపెట్టిందని తెలుస్తున్నది.

మూడు నెలల ముందు నుంచే

జమిలి ఎన్నికలపై వారం క్రితం కేంద్రం చర్చకు తెరలేపింది. కానీ, దీనిపై అన్నిరకాల వ్యూహాలు సిద్ధం చేసుకొన్న తర్వాతే లీకులు ఇచ్చిందని పలు మీడియా రిపోర్టులు, పలువురు రాజకీయ విశ్లేషకుల మాటలనుబట్టి అర్థమవుతున్నది. జమిలి ఎన్నికలపై కమిటీ వేయబోతున్నట్టు, ఆ కమిటీకి రామ్‌నాథ్ కోవింద్‌ను చైర్మన్‌గా నియమించబోతున్నట్టు ఆయనకు మూడు నెలల ముందే కేంద్రం సమాచారం ఇచ్చినట్టు తెలుస్తున్నది. అప్పటి నుంచి ఆయన పలు రాష్ట్రాల గవర్నర్లను కలువటం, ఆయనను పలువురు బీజేపీ, ఆరెస్సెస్ నేతలు కలిసిన విషయాన్ని జాతీయ మీడియా బయటపెట్టింది. అంటే కేంద్రం పక్కా ప్రణాళిక ప్రకారం అన్నీ సిద్ధం చేసుకొన్న తర్వాతే కమిటీ వేసిందని స్పష్టమవుతున్నది.

పూర్వరంగం సిద్ధం చేసిన కోవింద్

జమిలి ఎన్నికలపై వేసిన కమిటీ అధ్యక్షుడు రామ్‌నాథ్ కోవింద్.. ఈ అంశంపై ఇప్పటికే పూర్వరంగం సిద్ధం చేసినట్టు గత జూన్ నుంచి ఆయన కార్యకలాపాలను బట్టి తెలుస్తున్నది. జూన్ 9 నుంచి ఆయన పలు రాష్ట్రాల గవర్నర్లతో వరుసగా సమావేశమవుతూ వస్తున్నారు. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల గవర్నర్లూ మోదీ సర్కారు నియమించినవారే. చాలా రాష్ట్రాల గవర్నర్లు కేంద్రానికి సామంతుల్లా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఎదుర్కొంటున్నారు. వీరిలో చాలామందిని కోవింద్ గత మూడు నెలల్లో కలువటం ఆసక్తి కలిగిస్తున్నది. ఆగస్టు 31న చివరగా బీజేపీ మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్‌తో కోవింద్ సమావేశమయ్యారు. దీంతో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ జమిలి ఎన్నికలకు ఎప్పుడో ముహూర్తం ఖరారు చేశాయని, పరిస్థితులను పూర్తిగా బీజేపీకి అనుకూలంగా మార్చే పనిని రామ్‌నాథ్ కోవింద్‌కు అప్పగించాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పూర్వరంగం మొత్తం సిద్ధమైన తర్వాతే కేంద్రం కమిటీ వేసిందని అనుమానిస్తున్నారు.



### బీజేపీ రాష్ట్రాల్లో ప్రభుత్వాల రద్దు?

జమిలి ఎన్నికలపై వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి కేంద్ర ప్రభుత్వం సూచించింది. అంటే.. మరో 15 రోజుల్లో నిర్వహించే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలోపే ఈ కమిటీ నివేదిక ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. అదే జరిగితే జమిలి ఎన్నికలకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పెట్టే అవకాశం ఉన్నది. ఆ వెంటనే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అసెంబ్లీలను రద్దుచేయవచ్చని భావిస్తున్నారు. అలా ప్రతిపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఇతర రాష్ట్రాల్లో కూడా అసెంబ్లీను రద్దు చేయించే ఎత్తుగడ బీజేపీ వేస్తున్నదని విశ్లేషిస్తున్నారు. అందుకే రాష్ట్రాల గవర్నర్లతో రామ్‌నాథ్ కోవింద్ మూడు నెలలనుంచి వరుస భేటీలు నిర్వహించారని చెప్తున్నారు.

## ప్రత్యేక సమావేశాలపై
# ప్రధానికి సోనియా లేఖ

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా ఏంటో స్పష్టంగా చెప్పాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ లీడర్ సోనియా గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ నెల 18-22 వరకూ కొత్త పార్లమెంట్ భవనంలో ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఏ చర్చలు జరుగుతాయో చెప్పాలని ప్రధానికి రాసిన లేఖలో అడిగారు సోనియా. ఇతర పార్టీలతో ఏ మాత్రం చర్చించకుండానే ప్రత్యేక సమావేశాలు నిర్వహించడమేంటని ప్రశ్నించారు. అసలు ఎందుకు ఈ సమావేశాలు పెడుతున్నారో స్పష్టత లేదని అన్నారు. "సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చారు. కానీ మిగతా పార్టీలకు ఓ మాట కూడా చెప్పకుండానే వీటిని ఏర్పాటు చేశారు. మాలో ఎవరికి కూడా ఈ సమావేశాల అజెండా ఏంటో స్పష్టత లేదు. కీలక అంశాలపై చర్చించేందుకు మాకు సమయం కేటాయిస్తారనే ఆశిస్తున్నాం"ఇదే లేఖలో మొత్తం 9 అంశాలను ప్రస్తావించారు సోనియా. దేశ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం,నిరుద్యోగం సమస్యలపై మాట్లాడేందుకు సమయం కేటాయించాలని అడిగారు. వీటితో పాటు మరో 8 అంశాలను పేర్కొన్నారు. 1. దేశంలో ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడాలి. నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగతం, చిన్న మధ్య తరహా పరిశ్రమలపై ఒత్తిడి పెరగడం లాంటి అంశాలపై చర్చించేందుకు అవకాశమివ్వాలి. 2. రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలు, కనీస మద్దతు ధర విషయంలో రైతు సంఘాలకు ఇచ్చిన హామీలపై చర్చ జరగాలి. 3. అదానీ వ్యవహారంపై విచారణ జరిపేందుకు జేపీసీ కమిటీని నియమించాలి. 4. మణిపూర్ అల్లర్లపై చర్చించడంతో పాటు, ఆ సమస్యకు పరిష్కారం చూపించడం, శాంతియుత వాతావరణం నెలకొల్పడంపై చర్చ జరగాలి. 5. హరియాణా సహా పలు రాష్ట్రాల్లో అశాంతిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమాధానం చెప్పాలి. 6. లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలు ఇంకా కొనసాగుతున్నాయి. దీనిపైనా ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. 7. కులగణన చేపట్టాల్సిన అవసరంపై చర్చ జరగాలి. 8. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండేలా చూడాలి. 9.ఈ మధ్య కాలంలో భారీ విపత్తులతో అల్లకల్లలోమైన రాష్ట్రాల పరిస్థితిపైనా చర్చ జరగాలి. ప్రజా సమస్యలకే ప్రాధాన్యతనిస్తూ సమావేశాల్లో తాము చర్చకు సిద్ధమవుతామని సోనియా గాంధీ స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం తమకు సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు వెల్లడించారు. ఈ పైన పేర్కొన్న అంశాలన్నింటినీ చర్చించేందుకు సమయం కేటాయించాలని అన్నారు.

# మారిన 40 నగరాల పేర్లు

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక పలు ప్రాంతాలు, వివిధ స్మారక నిర్మాణాలు, నగరాల పేర్లు మార్చడం మొదలుపెట్టింది. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పట్టణాల పేర్లు మారిపోయాయి. యూపీలో ఇప్పటి వరకు 40 ఊళ్ల పేర్లు, కొన్ని యూనివర్శిటీల పేర్లు మార్పు రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే దేశంలో ఇప్పటి వరకు ఏ నగరలా పేర్లు మారాయో చూద్దాం.ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత 2014 నుంచి ఇప్పటి వరకు అనేక నగరాలు, చారిత్రక ప్రదేశాలు, ప్రాంతాల పేర్లను మార్చారు. అలహాబాద్ నగరం పేరును ప్రయాగ్‌రాజ్‌గా, గుర్గావ్ పట్టణాన్ని గురుగ్రామ్‌గా, ఫైజాబాద్ జిల్లా పేరును అయోధ్య జిల్లాగా మార్చారు. అలాగే, మొఘల్ గార్డెన్‌ను- అమృత్ ఉద్యాన్‌గా, రాజ్‌పథ్- కర్తవ్యపథ్‌గా, అలహాబాద్ ? ప్రయాగ్‌రాజ్‌గా, ఫిరోజ్ షా కోట్ల స్టేడియా ? ఆరుణ్ జైట్లీ స్టేడియంగా, మొఘల్ సరాయ్ జంక్షన్- దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జంక్షన్‌గా పేరు మారింది. త్వరలోనే లక్నో పేరును కూడా లక్ష్మణ నగరిగా మార్చనున్నట్లు తెలుస్తోంది. ఓవైపు ఈ నగరాల పేర్ల మార్పు వ్యవహారం నడుస్తుండగానే.. మరోవైపు ఏకంగా దేశం పేరు మార్చేందుకు కేంద్రం సిద్ధమైనట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటి నుంచో చెబుతున్నట్లుగా ఈ వలసవాద చిహ్నాలను తొలగించే ప్రక్రియలో భాగంగా ఇండియా పేరుకు కూడా చరమగీతం పాడాలనే కేంద్రం భావిస్తోంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఈ విషయంలో ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తూ వస్తున్నాయి.

పేర్లు.. మార్పులు..

అలహాబాద్‌ను ప్రయాగ్‌రాజ్‌గా,
గుర్గావ్‌ను గురుగ్రామ్‌గా
ఫైజాబాద్ జిల్లాను అయోధ్య జిల్లాగా,
మొఘల్ గార్డెన్‌ను- అమృత్ ఉద్యాన్‌గా,
రాజ్‌పథ్- కర్తవ్యపథ్‌గా,
ఫిరోజ్ షా కోట్ల స్టేడియం ? ఆరుణ్ జైట్లీ స్టేడియంగా,
మొఘల్ సరాయ్ జంక్షన్- దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జంక్షన్,
నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ పేరును ప్రధానమంత్రుల మ్యూజియంగా మారుస్తూ కేంద్రం నిర్ణయం,

దేశంలో పలు నగరాల పేర్లు మారుస్తూ బీజేపీ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు ఎలా ఉన్నా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం ఇటీవల బీజేపీ- కాంగ్రెస్ మధ్య పెద్ద అగాధాన్ని సృష్టిస్తోంది. ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ పేరును.. మోదీ ప్రభుత్వం మార్చడం వల్ల కాంగ్రెస్ కేంద్రంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ అధికారిక నివాసంగా ఉన్న తీన్‌మూర్తి భవన్ చుట్టూ గతంలో రగడ రాజుకుంది. ఈ భవనంలో ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ పేరును.. ప్రధానమంత్రుల మ్యూజియంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది.

### దేశం పేరు మార్చే హక్కు ఎవరికీ లేదు: శరద్ పవార్

కేంద్ర ప్రభుత్వం త్వరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సిద్ధమైన వేళ.. ఇండియా పేరును భారత్‌గా మారుస్తారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. పేరు మార్పుపై ఇప్పటికే పలువురు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ అంశంపై రాజకీయ కురువృద్ధుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ తాజాగా స్పందించారు. దేశం పేరు మార్చే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో మీడియా సమావేశంలో పాల్గొన్న పవార్‌ను 'రాజ్యాంగంలో భారతదేశం పేరు మార్చబడుతుందా..?' అని విలేకరులు ప్రశ్నించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. 'దానిపై నాకు ఎలాంటి సమాచారం లేదు' అంటూ బదులిచ్చారు. 'దేశానికి సంబంధించిన పేరుపై అధికార పార్టీ ఎందుకు అంత కలవరపడుతోందో నాకు అర్థం కావడం లేదు. దేశం పేరు మార్చే హక్కు ఎవరికీ లేదు. ఎవరూ పేరు మార్చలేరు' అని అన్నారు.

# ఈసారి విజయం మాదే


తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ దేశ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది మోదీ సర్కార్. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడోసారి కూడా ప్రజలు తననే ఎన్నుకుంటారని, ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని తేల్చి చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. సమయం, అనుభవం...ఇవే ప్రతి మనిషికి గురువులు అని, అవే పాఠాలు నేర్పుతాయని అన్నారు. 2014లోనే మోదీ అంటే ఎవరికీ తెలియదని, అయినా ప్రజలు తనను నమ్మి ఓటు వేసి గెలిపించారని వెల్లడించారు. "2014లో నరేంద్ర మోదీ అంటే ఎవరో ప్రజలకు తెలియదు. అయినా అంత మెజార్టీ ఇచ్చి గెలిపించారు. పదేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు ప్రతి చోటా మోదీనే వాళ్లు చూస్తున్నారు. చంద్రయాన్ మిషన్, అమెరికా పర్యటనతో నా గురించి వాళ్లు తెలుసుకున్నారు. ఇప్పుడు పూర్తిగా వాళ్లకు నేనేంటో అర్థమైంది. వచ్చే ఎన్నికల్లోనూ వాళ్లు సరిగ్గా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం నాకుంది"ఇదే ఇంటర్వ్యూలో ఉచిత హామీల గురించి ప్రస్తావించారు మోదీ. ఆర్థిక వ్యవస్థ విషయంలో బాధ్యత లేకుండా వ్యవహరించే పార్టీలు, ప్రభుత్వాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని తేల్చి చెప్పారు. ఇలాంటి విధానాల వల్ల భవిష్యత్‌లో చాలా సమస్యలు ఎదురవుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలోనే ఇది మూడో స్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో నమ్ముతున్నారు కాబట్టే ఇది సాధ్యమవుతుందని అన్నారు. "ప్రజలకు మా మీదున్న నమ్మకం చిన్నదేమీ కాదు. ఒక్కసారి కాదు. రెండు సార్లు మాకు భారీ మెజార్టీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే మా తొలి ప్రాధాన్యత. అంతకన్నా ముఖ్యమైంది ఏంటంటే...భవిష్యత్ గురించి ఆలోచించి సరైన ప్రణాళికలతో ముందుకెళ్లడం. స్థిరత్వాన్ని సాధిస్తే ప్రతి రంగంలోనూ అద్భుతాలు జరుగుతాయి. మన దేశంలో ప్రస్తుతం బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఉంది. 2014లో నేను అధికారంలోకి వచ్చినప్పుడు ఏ దేశం కూడా నమ్మలేదు. మన బ్యాంకింగ్ వ్యవస్థపై వాళ్లకు విశ్వాసం లేదు. కానీ...ఇప్పుడా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి"లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా తలపడనున్నాయి. విపక్ష కూటమిలో 26 పార్టీలున్నాయి. మోదీ సర్కార్‌ని ఎలాగైనా గద్దె దించాలన్న లక్ష్యంతో వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే...ఈ మధ్య కాలంలో వచ్చిన సర్వేలన్నీ మోదీకి అనుకూలంగానే ఉన్నాయి. ఖవలి ఖీవబవజీతీఇష్ట్ర అవనిబివతీ సర్వేలో 79% మంది భారతీయులు ప్రధాని మోదీకి మద్దతునిచ్చారు.

# నీచ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ

తెలుగు ట్రాక్,న్యూ ఢిల్లీ

భారత్ అధ్యక్షతన దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం రాత్రి డిన్నర్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ విందుకు దేశంలోని అన్ని పార్టీల నేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు వెళ్లాయి. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవగౌడలకు కూడా ఆహ్వానం అందించింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కు మాత్రం ఇప్పటి వరకూ ఆహ్వానం అందలేదు. దీనిపై కాంగ్రెస్ సహా విపక్షాలు మండిపడుతున్నాయి.తాజాగా ఈ అంశంపై ఖర్గే మౌనం వీడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయకూడదంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రత్యక్ష దాడికి దిగారు. ఢిల్లీలో నేడు జరిగే జీ20 విందుకు ఆహ్వానం అందకపోవడంపై ఖర్గే మాట్లాడుతూ.. 'నేను ఇప్పటికే దీనిపై స్పందించాను. మా పార్టీ స్పందించింది. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు. వారు (బీజేపీ) ఇలాంటి నీచ రాజకీయాలు చేయకూడదు' అని వ్యాఖ్యానించారు.కాగా, ఈ విందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు కూడా ఆహ్వానం వెళ్లింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు కూడా ఆహ్వానం వెళ్లినట్లు తెలుస్తోంది. బీహార్ సీఎం నితీశ్ కుమార్‌తో పాటు ఇండియా కూటమిలో ఉన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, జార్ఖండ్ సీఎం



హేమంత్ సోరెన్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌లకు ఆహ్వానం అందించింది. వీరిలో కొందరు నేతలు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. కాగా, దేవగౌడకు ఆహ్వానం అందినప్పటికీ ఆయన విందుకు దూరంగా ఉండనున్నారు. అనారోగ్య కారణాల వల్ల విందుకు హాజరుకావడం లేదని ఆయనే ట్విట్టర్ ద్వారా స్వయంగా వెల్లడించారు.

# గ్రీన్ కార్డు అందకుండానే అసువులు బాయనున్న 4 లక్షల మంది భారతీయులు

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

అమెరికా జారీ చేసే గ్రీన్ కార్డు కోసం ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో వలసదారులు వేచి చూస్తుంటారు. అయితే ఆ కార్డు జారీలో జరుగుతున్న ఆలస్యం వల్ల .. సుమారు నాలుగు లక్షల మంది భారతీయులు ఆ కార్డును అందుకోకుండానే ప్రాణాలు విడిచే అవకాశాలు ఉన్నట్లు ఓ రిపోర్టులో తేలింది. అమెరికాకు చెందిన క్యాటో ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. అమెరికా ఎంప్లాయిమెంట్ ఆఫీసు వద్ద గ్రీన్ కార్డు కోసం సుమారు 11 లక్షల మంది భారతీయుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే వారందరికీ ఇప్పట్లో కార్డు అందడం అసాధ్యంగా కనిపిస్తోంది. అమెరికా ఎంప్లామెంట్ శాఖ వద్ద మొత్తం 18 లక్షల గ్రీన్ కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, దాంట్లో 63 శాతం దారఖాస్తులు భారతీయులవే అని తెలుస్తోంది. వీటికి తోడు ఫ్యామిలీ సిస్టమ్‌తో లింకు ఉన్న గ్రీన్ కార్డులు సుమారు 83 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.క్యాటో ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం.. కొత్తగా గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులకు.. వెయిటింగ్ అనేది ఓ జీవితకాల శిక్షగా మారనున్నట్లు చెప్పింది. ప్రస్తుతం ఆ శాఖ వద్ద ఉన్న దరఖాస్తుల్ని క్లియర్ చేయాలంటే దాదాపు 134 ఏళ్లు పడుతుందట.


# హైదరాబాద్‌కు అమెరికా దిగ్గజ మీడియా వార్నర్

హైదరాబాద్ కు మరో అమెరికా సంస్థ వచ్చింది. అగ్ర దేశానికి చెందిన ప్రతిష్టాత్మక సంస్థ నగరంలో తమ నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దిగ్గజ మీడియా, వినోద రంగ సంస్థగా పేరున్న వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ కంపెనీ.. ఐటీ కారిడార్ లోని కాపిటల్యాండ్ టవర్ లో కొత్తగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఒకేసారి 1200 మందికి పైగా ఉద్యోగులు పని చేసేలా సువిశాలమైన ఆఫీస్ స్పేస్ ను తీసుకుంది. ఈ ఏడాది మే నెలలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్.. న్యూయార్క్ పర్యటనలో భాగంగా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో తమ ఆఫీస్ ను ఏర్పాటు చేస్తాని ఆ సమయంలోనే వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఈ దిగ్గజ సంస్థ ఐటీ కారిడార్ రాయదుర్గంలోని కాపిటల్యాండ్ ఇంటర్నేషనల్ టెక్ పార్క్ లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ లో ఐటీ రంగానికే కాకుండా మీడియా, వినోద రంగానికీ అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని కలిగి ఉండటంతో కంపెనీ వృద్ధికి ఈ పరిస్థితులు దోహదం చేయనున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. నగరంలో ఆఫీస్ ను ఏర్పాటు చేయడం ద్వారా వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థ భారతీయ మార్కెట్ లోని అపారమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.ఇటీవల దుబాయ్ లో పర్యటించిన కేటీఆర్ పలు వ్యాపార, వాణిజ్య సంస్థ ప్రతినిధి బృందాలతో భేటీ అయి రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార, వాణిజ్య అనుకూలతలను వారికి కేటీఆర్ వివరించారు. ఇక్కడి పెట్టుబడుల స్నేహపూర్వక వాతావరణాన్ని గురించి తెలియజెప్పారు. టీఎస్ బీపాస్ లాంటి ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ముందుకు వచ్చాయి. మంగళవారం(సెప్టెంబర్ 5) నాడు రూ.1,040 కోట్ల పెట్టుబడులు రావడం విశేషం. అగ్నిమాపక పరికరాల తయారీలో దిగ్గజ సంస్థగా పేరున్న యూఏఈ సంస్థ నాఫ్కో తెలంగాణలో రూ. 700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపించింది. ఈ మేరకు నాఫ్కో కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతిబ్.. మంత్రి కేటీఆర్ తో భేటీ అయ్యారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తో కలిసి అంతర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమిని ఏర్పాటు చేయాలని కేటీఆర్ చేసిన ప్రతిపాదనకు సైతం నాఫ్కో సీఈవో అంగీకరించారు. దాదాపు 100కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ సంస్థ నైపుణ్యాన్ని, అగ్నిమాపక శిక్షణను తెలంగాణ కేంద్రంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.తెలంగాణ రాష్ట్రంలో రూ. 215 కోట్ల పెట్టుబడితో తమ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రముఖ పోర్టు ఆపరేటర్ డీపీ వరల్డ్ తెలిపింది. డీపీ వరల్డ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ మెహతా, సంస్థ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాలుష్ శాస్త్రి, ఇతర ఉన్నతాధికాకరులు మంగళవారం మంత్రి కేటీఆర్ తో దుబాయి లో భేటీ అయ్యారు. పోర్టు ఆపరేటర్ గా ప్రపంచంలోనే అగ్రభాగాన ఉన్న డీపీ వరల్డ్ హైదరాబాద్ లో తమ ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో ఆపరేషన్ కోసం రూ. 165 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయరంగ ప్రగతికి చేదోడుగా నిలిచే కోల్డ్ స్టోరేజ్ వేర్ హౌసింగ్ రంగంలో కూడా డీపీ వరల్డ్ పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. మేడ్చల్ ప్రాంతంలో రూ. 50 కోట్లతో 5000 ప్యాలెట్ కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజ్ వేర్ హౌజ్ ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేస్తామన్నారు.

# బీఎస్పీ, వామపక్షాలతో కాంగ్రెస్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ఎన్నికలకు మరో మూడు నెలల సమయం ఉండడంతో తెలంగాణ రాజకీయం వేడెక్కుతోంది. పదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీఆర్ఎస్‌లో సీట్లు ఆశించి భంగపడిన నేతలను కలిసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీఎఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్తి నేతలకు కాంగ్రెస్ తలుపులు తెరిచే ఉంచింది. ఎవరైనా పార్టీలో చేరవచ్చని, వారికి తగిన గుర్తింపు ఇస్తామని చెబుతోంది.తాజాగా రాష్ట్రంలో వామపక్షాల పార్టీలో చర్చలు జరిపిన కాంగ్రెస్ అధిష్టానం పొత్తు దిశగా అడుగులు వేస్తోంది. అంతటితో ఆగకుంగా తమ బలాన్ని పెంచుకునేందుకు ఇతర పార్టీలతో పొత్తులకు యత్నిస్తోంది. తాజాగా బీఎస్పీతో పొత్తు పెట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అంగీకారం తెలిపిందని సమాచారం. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమి ఎ.ఔ.ఆ.ఎ.ంలో ఇప్పటికే కాంగ్రెస్, బీఎస్పీ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోను ఆ రెండు పార్టీలు పొత్తు పెట్టుకునే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఇప్పటికే వామపక్షాలు, బీఎస్పీ ఓటు శాతంపై రాష్ట్ర వ్యాప్తంగా సునీల్ కనుగోలు సర్వే నిర్వహించారు. ఇందులో వామపక్షాలకు 1.5 శాతం ఓటర్లు ఉన్నట్లు గుర్తించారని, ప్రవీణ్ కుమార్ సారధ్యంలోని బీఎస్పీ పార్టీ ఓటు శాతం 1 నుంచి 3 శాతానికి ఓట్లు పెంచుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే కాంగ్రెస్ ఈ రెండు పార్టీలతో స్నేహపూర్వకం, సానుకూలంగానే ఉంటూ వస్తోంది. దీంతో బీఎస్పీ,



వామపక్షాలతో పొత్తులకు ఇబ్బంది ఉండదని, సీట్లు సర్దుబాటు చేసుకుంటే మూడు పార్టీల ఓట్లు బదలాయించుకునేలా ముందుకు సాగాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఫలితంగా అన్ని పార్టీలు ప్రయోజనం పొందవచ్చని కాంగ్రెస్ నేతలు చెప్పినట్లు సమాచారం.

అయితే రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉన్న పది స్థానాల్లో సీట్లు కేటాయించాలని బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కోరగా సీపీఐ, సీఎం సైతం తమకు పది స్థానాలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఇప్పటికే కాంగ్రెస్‌లో సీట్ల కోసం ఒత్తిడి అధికంగా ఉంది. దీంతో సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా సీట్లను సర్దుబాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో బీఎస్పీ 10కి రెండు సీట్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పినట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ సమాధానం కోసం కాంగ్రెస్ ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సిర్పూర్ కాగజ్ నగర్‌లో నిర్వహించిన సర్వేలో ప్రవీణ్ కుమార్‌కు అనుకూలంగా ఉండడంతో ఆ స్థానాన్ని ఆయనకు ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. అదనంగా మరో సీటు ఆదిలాబాద్‌లో ఇచ్చి బీఎస్పీకి నచ్చజెప్పాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మునుగోడు, వైరా, కొత్తగూడెం, బెల్లంపల్లి, హుస్నాబాద్ కేటాయించాలని సీపీఐ కోరగా, ఇబ్రహీంపట్నం, భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడ, పినపాక టికెట్లు కావాలని సీపీఎం కోరుతన్నట్లు తెలుస్తోంది. అయితే ఆయా పార్టీలకు చెరో రెండు స్థానాలు ఇచ్చి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇవ్వాలని పార్టీ అధిష్టానం సూచించినట్లు సమాచారం. అధికార బీఆర్?ఎస్?లో అసంతృప్తిగా ఉన్న పలువురు కీలక నేతలు హస్తం గూటికి చేరేందుకు ముహూర్తం దాదాపుగా ఖరారైంది. ఈ నెల 17న బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో పార్టీలో పెద్ద ఎత్తున నేతల చేరికలు ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మైనం పల్లి హనుంతరావు మెదక్ సీటుతో పాటు మరో స్థానం ఇవ్వాలని కోరుతుండడంతో మెదక్‌కు కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. మరో సీటు కావాలంటే కూకట్ పల్లి నుంచి పోటీ చేయాలని సూచించినట్లు సమాచారం. అలాగే వేముల వీరేశం, యెన్నం శ్రీనివాసులు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా సోనియా, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. అలాగే తుమ్మల నాగేశ్వర రావు పార్టీలో చేరితే ఖమ్మం లేదా పాలారు సీటు కేటాయించే అవకాశం ఉంది. మరోవైపు పార్టీలో అసంతృప్తితో ఉన్న ఎంపీ కోమటిరెడ్డికి త్వరలోనే సముచిత స్థానం కల్పిస్తామని కేసీ వేణుగోపాల్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# 1000 కోట్లకు చేరిన శ్రీ వాణి ట్రస్ట్ విరాళాలు

తెలుగు ట్రాక్,తిరుమల

హిందూ దేవాలయాలను పరిరక్షించేందుకు టిటిడి చేపట్టిన శ్రీవారి ట్రస్టుకి శ్రీవారి భక్తుల నుండి విశేష స్పందన వస్తుంది.. శ్రీవాణి ట్రస్టును ప్రారంభించిన నాలుగేళ్ళ కాలంలోనే వందల కోట్ల రూపాయల నిధులు ట్రస్ట్ కి చేకూరింది.. అసలు ఇప్పటి వరకూ శ్రీవాణి ట్రస్టుకి ఎన్ని కోట్ల రూపాయలు ఆదాయం వచ్చింది..? శ్రీవాణి ట్రస్టుకి భక్తులు విరాళాలు అందించే నిధులతో టీటీడీ ఏం చేస్తుందంటే..?అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం ప్రతినిత్యం దేశ విదేశాల నుండి భక్తులు వివిధ రూపాల్లో తిరుమలకు చేరుకుంటూ ఉంటారు.. ఇలా చేరుకున్న భక్తులు వారి వారి స్తోమతకు తగ్గట్టు స్వామి వారికి కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.. క్షణకాలం పాటు జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శన భాగ్యం కోసం కోట్లాది మంది భక్తులు రోజులు, గంటల తరబడి నిరీక్షించి స్వామి వారి దర్శన భాగ్యం పొందుతుంటారు.. ఒక్కో సమయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో చాలా మందికి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం లభించడం చాలా కష్టం కావడంతో శ్రీనివాసుడి దర్శనభాగ్యం చేసుకోకుండానే వెనుతిరుగుతూ ఉంటారు.. ఇందుకోసం భక్తులు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, బడా పారిశ్రామిక వేత్తల నుండి సిఫార్సు లేఖలు పొంది విఐపి బ్రేక్ దర్శనం ద్వారా స్వామి వారిని దగ్గర నుండి చూసి ఎంత గానో పరవశించి పోతారు.. మరికొందరికి సిఫార్సు లేఖలు లభించక పోవడంతో చాలా మంది ఎంతగానో నిరాశకు గురి అవుతుంటారు.. తమ జీవిత కాలంలో ఒక్కసారి అయినా స్వామి వారిని కనులారా దగ్గర నుండి చూసే భాగ్యం దక్కితే చాలు తమ జన్మ ధన్యమైందని భావిస్తుంటారు.. అయితే ఇలాంటి వారి కోసమే టీటీడీ శ్రీవాణి ట్రస్టుని అందుబాటులోకి తీసుకొచ్చింది.. అయితే టిటిడి తీసుకొచ్చిన శ్రీవాణి ట్రస్టుకు భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తుంది..అయితే ట్రస్ట్ ప్రారంభించిన నాలుగు ఏళ్ళు గడుస్తుంది.. ఈ నాలుగేళ్ళల్లో ఇప్పటి వరకూ 1000 కోట్ల రూపాయలు విరాళంగా అందాయి.. 2019లో వైసీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిటిడి ఛైర్మన్ గా వైవీ.సుబ్బారెడ్డి భాధ్యతలు స్వీకరించారు.. ఈ క్రమంలోనే ఏడుకొండల్లో దళారీ వ్యవస్థను రద్దూ చేసేందుకు తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఒ1, ఒ,2, ఒ3 పద్దతిని పూర్తిగా రద్దు చేశారు.. అయితే ఈ విధానం రద్దు చేసిన తర్వాత విఐపి బ్రేక్ దర్శనానికి మరింత డిమాండ్ పెరిగింది.. దీంతో దళారులు తాము చెప్పిందే రేటుగా అమాయకులైన భక్తుల నుండి అధిక మొత్తంలో నగదును ఆర్జిస్తూ దళారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది.. ఈ క్రమంలోనే 2018లో ప్రారంభించిన శ్రీవాణి ట్రస్టు ద్వారా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు నిర్మాణం, దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలకు తోడ్పాటు అందించడలనే లక్ష్యంగా శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్ట్ పేరుతో ఉన్న ట్రస్టుని టీటీడీలో అదనపు ఈవోగా ధర్మారెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీవాణి ట్రస్టులో కొన్ని మార్పులు తీసుకొచ్చారు..సనాతన ధర్మంను సంరక్షణలో భాగంగా 2019 అక్టోబర్ 21వ తేదీ నుండి శ్రీవాణికి రూ.10,000 విరాళం ఇచ్చిన దాతలకు ప్రివిలేజ్ క్రింద 500 రూపాయల విలువ గల ఒక సారి విఐపి బ్రేక్ దర్శనాన్ని టిటిడి కల్పించింది.. టిటిడి చేపట్టిన బృహత్తర కార్యక్రమంకు నిధులు వెల్లువెత్తాయి.. 2019లో రూ.26.25 కోట్లు విరాళంగా అందించి 19,737 మంది దర్శించుకున్నారు.. 2020లో రూ. 70.21 కోట్లు విరాళం రాగా, 49,282 మంది భక్తులు దర్శించుకున్నారు.. 2021లో రూ. 176 కోట్లు విరాళంగా రాగా, 1,31,000 మంది భక్తులు దర్శించుకున్నారు.. 2022లో రూ. 282.64 కోట్లు విరాళంగా రాగా 2.70 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.. 2023లో ఇప్పటీ వరకు రూ. 268.35 కోట్లు విరాళాలు రాగా,1.58 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.. ఈ విధంగా గత నాలుగేళ్ల కాలంలోనే రూ.1000 కోట్లు విరాళం అందాయి.. దీంతో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 176 పురాతన ఆలయాల పునఃరుద్ధరణ పనులను టిటిడి ప్రారంభించింది..బీసీ,ఎస్సీ, ఎస్టీ కాలనీలో 2273 నూతన ఆలయాల నిర్మాణాలు ప్రారంభించడంతో పాటుగా, 501 ఆలయాలకు ధూపదీప నైవేధ్యం కింద ప్రతి నెల రూ.5 వేల చొప్పున టిటిడి చెల్లిస్తుంది.. ఇటీవల నిధులు పక్కదారి పడుతున్నాయనే వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శ్రీవాణి ట్రస్ట్ నిధుల వినియోగంపై గత పాలకమండలి అధ్యక్షుడు వైవీ.సుబ్బారెడ్డి 2023 జూన్ 23 తేదీన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.

# నేర చరితులపై నివేదిక ఇవ్వండి

తెలుగు ట్రాక్,విజయవాడ

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొత్త పాలక మండలిని ఈ మధ్యే నియమించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. అయితే, కొందరు సభ్యులపై ఆరోపణలు వస్తున్నాయి.. ఈ నేపథ్యంలో దాఖలైన పిల్‌పై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. టీటీడీలో నేర చరిత్ర ఉన్న వారు సభ్యులుగా ఉండటంపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది..అయితే, ఎండోమెంట్ చట్టాలకు వ్యతిరేకంగా నేరచరిత్ర ఉన్న వ్యక్తులు శరత్ చంద్రారెడ్డి, డాక్టర్ కేతన్, సామినేని ఉదయభాను నియామకం చెల్లదంటూ విజయవాడకి చెందిన మాజీ రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు హైకోర్టులో పిల్ వేశారు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి మరియు ఎమ్మెల్యే ఉదయభాను, డాక్టర్ కేతన్ పై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని.. పరమ పవిత్రమైన తిరుపతి దేవస్థానంలో ఇలాంటి నేరచరిత్ర వున్నవారు ఉండటం భక్తుల మనోభావాలకి తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తాత్కాలిక బెయిల్ పై కొనసాగుతున్న నిందితుడిని తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ ప్రయోజనాలతో ఎన్నిక చేయటం చట్ట విరుద్ధమంటూ తన పిల్‌లో పేర్కొన్నారు. అయితే, దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఆకుల శేష సాయి, జస్టిస్ రఘునందన్ రావు ధర్మాసనం.. ప్రతివాదులుగా ఉన్న కమిషనర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ని వివరణ కోరింది.. తమకు వివరణ ఇవ్వాలంటూ దేవాదాయ శాఖ కమిషనర్, టీటీడీ ఈవోకు ఆదేశాలు జారీ చేసింది

# జీ 20 సదస్సులో కరీంనగర్ కళకారులు




తెలుగు ట్రాక్,కరీంనగర్

దేశాధినేతలు ఒక చోట సమావేశమయ్యే ఢిల్లీ జి -20 సమ్మిట్ లో తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన కళాకారులకు అరుదైన గౌరవం దక్కింది. ఈ సదస్సులో 20 దేశాలకు చెందిన ప్రతినిధుల చొక్కాలకు బ్యాడ్జీలను కరీంనగర్ కు చెందిన కళాకారులే తయారు చేశారు. ఈ వర్క్‌ను ఫిలిగ్రీ వర్క్ అని పిలుస్తారు. కోణార్క్ సూర్యదేవాలయాన్ని పోలి ఉండేలా రథ చక్రం తరహాలో ఈ బ్యాడ్జీలను తయారు చేశారు. జి - 20 సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి రెండు వందల బ్యాడ్జీలను ఆర్డర్ ఇచ్చి చేయించింది. జి - 20 సమ్మిట్‌లో స్టాల్ ఎగ్జిబిషన్ నిర్వహించడానికి తెలంగాణకు చెందిన కళాకారులకు కూడా అనుమతి దక్కింది. సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ హ్యాండీ క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ అశోక్ ఆధ్వర్యంలో ఈ స్టాల్ నిర్వహిస్తారు. జి - 20లో మొత్తానికి కరీంనగర్ కళాకారులకు చెందిన స్టాల్ కొనసాగనుంది.కరీంనగర్ ఫిలిగ్రీ వర్క్ కు ఇంతటి అరుదైన గౌరవం దక్కడం ఇదే మొదటి సారి కాదు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఉన్న సమయంలో ఆయన కుమార్తె ఇవాంకా ట్రంప్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు కూడా వీరికి గుర్తింపు లభించింది. అంతేకాక, దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా కరీంనగర్ ఫిలిగ్రీ కళాకారులు కొంత మందికి నేషనల్ అవార్డ్ కూడా దక్కింది.జీ20 సదస్సుకు వచ్చే అతిథులకు అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు ప్రత్యేక కార్యదర్శి ముక్తేశ్ పరదేశి తెలిపారు. స్థానిక వంటకాలతో పసందుగా విందు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు చిరు ధాన్యాలతో కూడిన భారతీయ వంటకాల రుచి చూపిస్తామని చెప్పారు. అలాగే చిరు ధాన్యాల పౌడర్ తో ఫ్రూట్ సలాడ్లు, బెల్లం రాగి ఖీర్, స్పెషల్ మిల్లెట్ థాలి, మిల్లెట్ పలావ్, మిల్లెట్ ఇండ్లీ వంటి వంటకాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రాజస్థానీ దాల్ బాటీ ఖుర్మా, పశ్చిమ బెంగాల్ రసగుల్లా, దక్షిణాది మసాలా దోశ బిహార్ లిట్టీ చోకాలనూ అతిథిలకు వండి వడ్డించబోతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే చాందినీ చౌక్ వంటకాలను కూడా తినిపిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీకి బీ-టీమ్ జేడీఎస్ సిద్ధరామయ్య ఎద్దేవా



తెలుగు ట్రాక్,బెంగళూరు

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని బీజేపీ–జేడీ(ఎస్) మధ్య అవగాహన కుదరడాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. జేడీఎస్ సెక్యులర్ భావజాలాన్ని నిలదీశారు. సెక్యులర్ అనే పదాన్ని కేవలం పేరులోని ఇముడ్చుకుందని, ఆ పార్టీకి ఎలాంటి సిద్ధాంతాలు లేవని, అధికారం కోసం ఏదైనా చేయడానికి సిద్ధమేనని అన్నారు. జేడీఎస్ పార్టీ బీజేపీ ‘బీ–టీమ్’ అని పేర్కొన్నారు.”బీజేపీకి బీ–టీమ్ జేడీఎస్ అంటూ నేను చెబుతూనే ఉన్నాను. ఈరోజు అది రుజువైంది. నేను ఆ మాట అన్నప్పుడల్లా జేడీఎస్ నాపై విరుచుకుపడేది. జేడీఎస్ పేరులో సెక్యులర్ అని తగిలించుకుంది. కానీ మతతత్వ (కమ్యూనల్) పార్టీతో చేతులు కలిపింది” అని హుబ్బళ్లిలో జరిగిన మీడియా సమావేశంలో సిద్ధరామయ్య అన్నారు. జేడీఎస్ చీఫ్ దేవెగౌడ పదేపదే ఏ పార్టీతోనూ కలిసేసి లేదని చెబుతుంటారని, పార్టీ మనుగడ కోసం బీజేపీతో చేతులు కలుపుతున్నట్టు జేడీఎస్ సమన్వయ కమిటీ చీఫ్ జీడీ దేవెగౌడనే స్వయంగా ప్రకటించారని తెలిపారు.

# వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో ఏపీ టాప్

తెలుగు ట్రాక్,తిరుపతి

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 2022? 23 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనన్ని అత్యధిక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది. 20 సూత్రాల అమలు కార్యక్రమం 2022? 23 ఆర్థిక సంవత్సరం ఫలితాల నివేదికను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను పరిశీలిస్తే, 2022? 23 ఆర్థిక సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 24,852 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 1,24,311 కనెక్షన్లను రైతులకు మంజూరు చేసింది. ఒక్క దరఖాస్తు కూడా పెండింగులో లేకుండా దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సృష్టించింది. లక్ష పైగా వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం విశేషం. రైతు ప్రయోజనాల పరిరక్షణ పట్ల జగన్ సర్కారుకు ఉన్న ఎనలేని శ్రద్ధకు ఇది నిదర్శనమని విద్యుత్, వ్యవసాయ రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. దేశవ్యాప్తంగా 4,54,081 వ్యవసాయ పంపుసెట్లను విద్యుదీకరించాలని లక్ష్యం కాగా వివిధ రాష్ట్ర



ప్రభుత్వాలు, కేంద్రాపాలిత ప్రాంతాలు 7,35,338 కనెక్షన్లు జారీ చేశాయి. ఇందులో 1,24,311 కనెక్షన్లు ఆంధ్రప్రదేశ్‌లోనే మంజూరు కావడం గమనార్హం.44,770 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం కాగా 99,137 కనెక్షన్లు విడుదల చేసి రాజస్థాన్ రాష్ట్రం దేశంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 25148కు గాను 89,183 వ్యవసాయ పంపుసెట్లకు కనెక్షన్లు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్రం దేశంలో తృతీయ స్థానంలో నిలిచింది. 1,50,000 కనెక్షన్లు మంజూరు చేయాలని పంజాబ్ రాష్ట్రం లక్ష్యం కాగా ఆ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 524 కనెక్షన్లు మాత్రమే మంజూరు చేసి ‘జీరో’ శాతం లక్ష్య సాధనలో ఉన్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. కేవలం 45 కనెక్షన్లు మాత్రమే మంజూరు చేసి సంఖ్యాపరంగా పాండిచ్చేరి చిట్ట చివరి స్థానంలో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఇంధన, అటవీ, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దరఖాస్తుదారులందరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని మార్గదర్శకం చేశారని, ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయనంద్ తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగులో పెడితే రైతులు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో ప్రభుత్వం పెండింగు దరఖాస్తులన్నింటినీ క్లియర్ చేయాలని ఆదేశించిందని ఆయన అన్నారు. దీంతో మౌలిక వసతులు కల్పించి మొత్తం 1,24,311 వ్యవసాయ పంపుసెట్లకు గత ఆర్థిక సంవత్సరం విద్యుత్ కనెక్షన్లు జారీ చేసినట్లు తెలిపారు.. పెండింగు క్లియర్ చేసినందున ప్రస్తుతం దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం అమలు చేస్తున్నామని వెల్లడించారు.

2022? 23 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీ వివరాలు

| రాష్ట్రం ... | లక్ష్యం .. | మంజూరు |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 24852 | 1,24,311 |
| రాజస్థాన్ | 44770 | 99,137 |
| తెలంగాణ | 25148 | 89183 |
| కర్ణాటక | 38602 | 75117 |
| ఉత్తరప్రదేశ్ | 22058 | 69201 |

# ఆ 3 నగరాల్లో.. ఐటీ అవకాశాలు

తెలుగు ట్రాక్,విజయవాడ

భారత్ ఆర్థికాభివృద్ధి చెందుతున్న దేశం. ప్రపంచంలోని అగ్రదేశాల తో పోటీ పడుతూ వివిధ రంగాల్లో రాణిస్తోంది. సాంకేతికంగానూ కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని మిగతా రాష్ట్రాలతో తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇక తాజాగా స్టార్టప్ లను ఏర్పాటు చేయడంలో ఏపీలోని మూడు నగరాలు దూసుకెళ్తున్నట్లు తాజాగా నాస్కామ్ అందించిన నివేదికలో పేర్కొంది. ఏపీలోని విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలు ఐటీ పరిశ్రమలో దూసుకెళ్తున్నట్లు పేర్కొంది. దేశంలోని 26 టెక్ హబ్ జాబితాలో ఈ మూడు నగరాలు ఉన్నాయని, ఇక్కడ టెక్ సంస్థలు ఏర్పాటు చేయడానికి అనువైన వాతావరణం ఉందని తెలిపింది.డెలాయిట్, నాస్కామ్ నివేదిక ప్రకారం.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో టెక్ హబ్ లు ఏర్పాటు చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. కొత్త కార్యాలయాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేసుకోవాలంటే 50 శాతం పెట్టుబడి పోతుంది. ఇక మానవ వనరులు సమీకరించుకోవడానికి 60 శాతం వెచ్చించాల్సి వస్తుంది. కానీ ఏపీలోని విశాఖ పట్నంలో టెక్ హబ్ లు ఏర్పాటు చేయడానికి అనువైన పరిస్థితులు ఉన్నట్లు నాస్కామ్ తెలిపింది. ఇక్కడ ఐటీ హబ్ ఏర్పాటుకు ఇన్ఫోసిస్ ముందుకు వచ్చింది. రహేజా ఐటీ టవర్ ను ప్రారంభించే ఆలోచనలో ఉంది. ఇవే కాకుండా కొత్త తరం టవర్లను చాలా మంది ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. రిషి కొండలోని 5 ఎకరాల స్థలంలో ఐటీ స్టార్టఫ్ ఎన్ క్లేవ్ ను అభివృద్ధి చేయాలని రాష్ట్రం భావిస్తోంది.కేంద్ర ప్రభుత్వం టైర్ 2, టైర్ 3 నగరాల్లో స్టార్టప్ లను అభివృద్ధి చేయాలని చూస్తోంది. ఇందులో భాగంగా ఏపీలోని వైజాక్, విజయవాడ, కాకినాడ, తిరుపతి నగరాలు ఇందుకు అనుగుణంగా ఉన్నాయని నాస్కామ్ తెలపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు శ్రీధర్ లంక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో సమీప భవిష్యత్ లో టైర్ 2, టైర్ 3 గనరాల్లో గణనీయమన అభివృద్ధి జరగనుందని, ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. డీప్ టెక్ నైపుణ్య పౌండేషన్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ మెగా నగరాలు తరుచూ అదిక వ్యయాన్ని ఆశిస్తాయి. కానీ ఏపీలోని ఈ ప్రాంతాల్లో స్వల్ప వ్యయంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు.

ఇండియాలో కరోనా తరువాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అప్పటి నుంచి చాలా మంది పేపర్ లెస్ వర్క్ కే ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. ఈ క్రమంలో సాంకేతిక పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రతీ పనిని డిజిటైలేషన్ చేయడంతో స్టార్టప్ ల అవసరం ఏర్పడుతోంది. ఇదే సమయంలో కొన్ని ఐటీ కంపెనీలు కొత్త వారిని చేర్చుకునేందుకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వడంతో ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారంతా బహుళ జాతి కంపెనీల్లో చేరిపోయారు. వీరి నైపుణ్యంతో టెక్నాలజీని అభివృద్ధి చేస్తూ టైర్ 2 నగరాలను టైర్ 1 కు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

# 1600 కోట్లతో తబ్రీడ్ పెట్టుబడులు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ప్రపంచ ప్రఖ్యాత శీతలీకరణ కార్యకలాపాల సంస్థ తబ్రీడ్ తెలంగాణ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ప్రణాళికను ప్రకటించింది. తంబీద్ సంస్థ వాణిజ్య, ఇతర రంగాల శీతలీకరణ కార్యక్రమాలకు పేరుగాంచింది. ఈ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగంగా చేపట్టే కూలింగ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం కోసం దాదాపు 1600 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెట్టి ఆయా పారిశ్రామిక పార్కులకు శీతలీకరణ వసతులను అందించనున్నది. సంస్థ హైదరాబాద్ ఫార్మసిటీ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక పార్కుల అవసరాల మేరకు ఈ కూలింగ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ను అభివృద్ధి చేయనున్నది. ఈ మౌలిక వసతుల కల్పన వలన పారిశ్రామిక పార్కులకు అవసరమైన కూలింగ్, స్టోరేజ్ అవసరాలను తీర్చేందుకు అవకాశం కలుగుతుంది. ఈ మేరకు సంస్థ లక్ష 25 వేల రిఫ్రిజిరేషన్ టన్నుల కూలింగ్ మౌలిక వసతులను తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేస్తుంది. దీని వలన 24 మిలియన్ టన్నుల కార్బన్ డై యాక్సైడ్ ఉద్గారాలను తగ్గించేందుకు వీలు కలుగుతుంది. ఈ లక్ష్యం పూర్తయితే ఆసియా ఖండంలోనే జీవించేందుకు, పని చేసేందుకు అత్యుత్తమ నగరంగా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవబోతున్నది.ఈ సంస్థతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఈ కూలింగ్ సొల్యూషన్స్ మౌలిక వసతుల వలన బహుముఖ ప్రయోజనాలు కలగనున్నాయి. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణ లక్ష్యాల మేరకు దాదాపు 6800 గిగా వాట్ల కరెంటుతో పాటు 41,600 మెగా లీటర్ల నీటిని పారిశ్రామిక రంగంలో పొదుపు చేసేందుకు అవకాశం కలుగుతుంది. దీంతోపాటు ఆరు పాయింట్ రెండు మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను అరికట్టేందుకు వీలు కలుగుతుంది. ప్రభుత్వం ఈ సంస్థతో కలిసి చేపడుతున్న ఈ మౌలిక వసతుల కల్పన వలన ముఖ్యంగా ఫార్మా రంగంలో ఉన్న బల్క్ డ్రగ్ తయారీ కేంద్రాలకు స్వచ్ఛమైన హరితమైన పరిష్కారాలు లభించే అవకాశం ఏర్పడుతుంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైబరాబాద్ వంటి కమర్షియల్ డిస్ట్రిక్ట్ (నిర్దేశిత వాణిజ్య ప్రాంతాలు) తో పాటు రానున్న ప్రాంతాలలోనూ 2 మెగావాట్ల మేర విద్యుత్ డిమాండ్ ను తగ్గించేలా కార్బన్ డయాక్సైడ్ య ఉద్గారాలను తగ్గించేలా సుదీర్ఘకాలం పాటు ఈ కూలింగ్ పరిష్కారాలను అందించేలా అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో సుదీర్ఘకాలంలో హైదరాబాద్ నగరంలో కాలుష్యము మరియు ఉష్ణోగ్రతలు తగ్గి అత్యుత్తమ నగరాలకు కావలసిన అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావాన్ని ఈ సందర్భంగా సంస్థ వ్యక్తం చేసింది.తెలంగాణ రాష్ట్రంలో భారీగా కొనసాగుతున్న పారిశ్రామికీకరణ, వేగంగా విస్తరిస్తున్న వ్యాపార వాణిజ్య ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని సస్టైనబుల్ భవిష్యత్తు కోసం ఈరోజు జరిగిన అవగాహన ఒప్పందం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తూ, ప్రస్తుత మరియు భవిష్యత్తు పరిస్థితులకు అనుగుణంగా స్థానిక పరిస్థితులకు అనుకూలంగా అమలు చేసేందుకు వీలైన డిస్టిక్ కూలింగ్ఇన్ఫ్రాస్ట్రక్చర్, తక్కువ విద్యుత్ శక్తిని ఉపయోగించుకునే కూలింగ్ పరిష్కారాలను, కూల్ రూఫ్ పాలసీ వంటి విధానాల ద్వారా తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని అందుకునే దిశగా ముందుకు పోతున్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఈ అవగాహన ఒప్పందం తెలంగాణ రాష్ట్ర మాత్రమే కాకుండా భారత దేశ సస్టైనబుల్ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని సంస్థ చైర్మన్ ఖాలిద్ అబ్దుల్లా అల్ ఖుబాసి తెలిపారు. తమ సంస్థకు డిస్ట్రిక్ట్ కూలింగ్ రంగంలో ఉన్న అపారమైన అనుభవము సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అవసరాల కోసం ఉపయోగిస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కాలుష్య రహిత ఫార్మసిటికల్ క్లస్టర్ హైదరాబాద్ ఫార్మాసిటీ తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఇతర పారిశ్రామిక పార్కులు, వాణిజ్య ప్రాంతాలకు అవసరం అయినా అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన తమ కూలింగ్ టెక్నాలజీలను అందిస్తామన్నారు. పారిశ్రామిక మరియు వాణిజ్య రంగాలు కలిగించే కాలుష్యానికి ప్రధాన కారణం అవి వాడే కూలింగ్ టెక్నాలజీలు అని వాటి ద్వారానే భారీ ఎత్తున కార్బన్ ఉద్గారాలు వెలువడతాయని అయితే ఈరోజు జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయి కూలింగ్ పరిష్కారాలను తెలంగాణకు తీసుకురావడం ద్వారా నెట్ జీరో ఉదారాల విషయంలో తెలంగాణ తన లక్ష్యాన్ని అందుకుంటున్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈరోజు తమ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం ఇండియా హెడ్ అతుల్ బగాయి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పైన ప్రశంసలు కురిపించారు. ఊఖ28 ద్వారా అంతర్జాతీయ కూలింగ్ ప్లెడ్జ్ కార్యక్రమాన్ని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం చేపట్టిందని ఇందులో భాగంగా ప్రపంచ దేశాలని అత్యుత్తమ కూలింగ్ విధానాల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించాలని లక్ష్యం మేరకు పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు.

# పరిపాలన చేత కాకపోవడం వల్లే సమస్యలు

తెలుగు ట్రాక్,విజయవాడ

ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ కోతల పై భారతీయ జనతా పార్టీ చీఫ్ దగ్గుబాటి పురంధరేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో బీజేపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆమె పరిశ్రమలకు విద్యుత్ సరఫరా లో ఆటంకాలు పై ఆమె మండిపడ్డారు.. పరిశ్రమల విద్యుత్ వాడకం పై ప్రభుత్వం 30శాతం కుదించడాన్ని ఖండిస్తున్నామని భారతీయ జనతా పార్టీ చీఫ్ దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు విద్యుత్ వాడకం పై ఆంక్షలు విధించడం సరైన పద్దతి కాదని తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థ లు పరస్పరం విరుద్ధ ప్రకటనలు చేయటం ఏంటని ప్రశ్నించారు.మొదట కోతలు విధిస్తామని తరువాత , రెండు రోజుల్లో మళ్ళీ కోతలు ఉండవు అని చెప్పటం ఎంటని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా విద్యుత్ కోతలు విధిస్తున్నారని భారతీయ జనతా పార్టీ చీఫ్ దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు అప్రకటిత విద్యుత్ కోతలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని అన్నారు. సోలార్ పవర్,విండ్ పవర్ అందుబాటులోకి తీసుకు వచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని తప్పుబట్టారు. విద్యుత్ పంపిణీలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనపడడం లేదని పురందేశ్వరి పేర్కొన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లలో బొగ్గు నిల్వలు ఎందుకు ఉంచడం లేదని దగ్గుబాటి పురంధరేశ్వరి ప్రభుత్వాన్ని నిలదీశారు. 17 రోజులకు సరిపడ బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అర్టీపీపీ 81000 టన్నుల బొగ్గు అవసరం అయితే 31500 టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని, 260 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం రాష్ట్రంలో ఉందన్నారు రాష్ట్రంలో 8శాతం అదనంగా విద్యుత్ వాడకం పెరిగిందని ప్రభుత్వమే చెప్తుందని, అలాంటప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై లేదా అని నిలదీశారు. భాద్యత లేనట్లు గా ప్రభుత్వ తీరు కనపడుతోందని వ్యాఖ్యానించారు. విద్యుత్ కోతల పేరుతో రోజుకో మాట చెప్పి ప్రజలను, పారిశ్రామిక వేత్తలను ప్రజలను ప్రభుత్వం కన్ఫ్యూజ్ చేస్తుందని పురందేశ్వరి విమర్శించారు. విద్యుత్ డిమాండ్, సప్లై ఆంధ్రప్రదేశ్ లో ఉన్న బోగ్గు నిల్వల పై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల మీద సమీక్ష నిర్వహించ వలసినటువంటి ముఖ్యమంత్రి రాష్ట్రంలో లేకపోవడం బాధాకరంగా అభివర్ణించారు.

# హిందువుగా గర్విస్తున్నా : రిషి సునాక్

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

ఢిల్లీలో జరగబోతున్న జీ-20 సదస్సు కోసం బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తన భార్య అక్షతా మూర్తితో కలిసి ఇండియా చేరుకున్న సంగతి తెలిసిందేన్నారు. ఉ-20 భారతదేశానికి బాగా కలిసొచ్చే విషయం అని.. సరైన సమయంలో ఈ మెగా ఈవెంట్ను నిర్వహిస్తోందని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు."హిందువుగా నేను గర్విస్తున్నా. నేను హిందువుగానే పెరిగాను. అలాగే ఉన్నాను. ఆలయాలకు వెళ్తాను. ఇటీవలే రాఖీ పండుగ చేసుకున్నాం. భారత్కు రావడం పర్సనల్ గా నాకెంతో ప్రత్యేకమైన విషయం. నా పూర్వీకులకు చెందిన భారత్ అంటే నాకు ఎంతో ఇష్టం" అని రిషి సునాక్ అన్నారు. దేశంలో సనాతన ధర్మం నిర్మూలించాలని తమిళనాడు మంత్రి చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగుతున్న వేళ రిషి సునాక్ ఇలా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.బ్రిటన్లోని ఖలిస్తాన్కు సంబంధించిన ఓ ప్రశ్నపై ప్రశ్నపై మాట్లాడుతూ.. హింసను, మతోన్మాదాన్ని తాను సహించబోనని అన్నారు. "ఇది చాలా ముఖ్యమైన సమస్య. బ్రిటన్లో మతోన్మాదం లేదా హింస ఏ రూపంలో ఉన్నా సహించబోమని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. మేం ఈ సమస్యపై భారత ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నాం. ముఖ్యంగా ప్రో ఖలిస్తాన్ తీవ్రవాదం సమస్యను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం" అని అన్నారు'ఇటీవల మా భద్రతా మంత్రి భారతదేశాన్ని సందర్శించారు. ఆయన దాని గురించి నాతో మాట్లాడారు. మేం కొన్ని వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేసాం. వారు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని షేర్ చేసుకుంటున్నారు. ఇలా చేయడం ద్వారా, మనం ఈ రకమైన హింసాత్మక మతోన్మాదాన్ని అధిగమించగలం. బ్రిటన్లో ఇలాంటి హింసను, మతోన్మాద చర్యలను సహించబోమన్నది ఖాయం" అని అన్నారు.రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ ఇప్పటి వరకు తటస్థ వైఖరిని కొనసాగిస్తోంది కదా అని అడిగిన ప్రశ్నకు ప్రధాని సునాక్ ఇలా అన్నారు. "అంతర్జాతీయ వ్యవహారాలపై భారతదేశ వైఖరి ఏంటో నేను చెప్పలేను. అయితే, భారతదేశం అంతర్జాతీయ చట్టాన్ని గౌరవిస్తుందని కూడా నాకు తెలుసు" అని అన్నారు. వాణిజ్య ఒప్పందంపై అడిగిన ప్రశ్నలకు తప్పించుకునే సమాధానం ఇచ్చారు.భారత్, బ్రిటన్ల మధ్య చాలా కాలంగా వాణిజ్య ఒప్పందం సమస్య నలుగుతోంది. దాదాపు రెండేళ్లుగా సాగుతున్న చర్చలు ఇప్పటి వరకు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీని గురించి అడిగిన ప్రశ్నకు, సునాక్ మాట్లాడుతూ.. ముఖ్యమైన వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేయడంలో నేను, మోదీ ఇద్దరం పర్టిక్యులర్ గా ఉన్నాం. ఈ విషయంలో అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఇలాంటి ట్రేడ్ డీల్స్కు సమయం పడుతుందేమో చూడాలి. దీని వల్ల ఇరు దేశాలకు ప్రయోజనం కలుగుతుంది. అయితే, మేం ఈ విషయంలో చాలా పురోగతి సాధించాం. రెండు దేశాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయి" అని అన్నారు. ప్రధాని మోదీపై సునాక్ మాట్లాడుతూ.. "మోదీ జీ అంటే నాకు చాలా గౌరవం, ఆయన కూడా నాకు వ్యక్తిగతంగా సహాయం చేస్తున్నారు. ఇద్దరం చాలా కష్టపడుతున్నాం. నేను ఈ ఫోరమ్ వంటి వేదికలపై మోదీ జీకి మద్దతు ఇస్తున్నాను ఎందుకంటే ఇది భారతదేశానికి పెద్ద విజయం" అని రిషి సునాక్ అన్నారు.

# 19 న రానున్న అతిథి



టాలెంటెడ్ యాక్టర్ వేణు తొట్టెంపూడి డిజిటల్ ఎంట్రీ ఇస్తున్న వెబ్ సిరీస్ "అతిథి". ప్రముఖ ఓటీటీ కంపెనీ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ స్పెషల్స్ గా ఈ వెబ్ సిరీస్ రాబోతోంది. "అతిథి" వెబ్ సిరీస్ ను రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు.

ఇవాళ "అతిథి" వెబ్ సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తే...ఒంటరిగా పెద్ద భవంతిలో ఉంటున్న వేణుకు దెయ్యాలంటే నమ్మకం ఉండదు. ఎక్కడో ఒక ఆడది దెయ్యంగా మారిందని, అమ్మాయిలందరూ దెయ్యలంటే ఎలా అని అడుగుతాడు. మీ ఇంట్లో ఉన్నది మనిషి కాదు దెయ్యం అని తన మిత్రుడు చెప్పినా నమ్మడు. కానీ ఆ అమ్మాయి వింతగా ప్రవర్తిస్తుంటుంది. ఇంతకీ ఆమె ఎవరు?, మనిషా, దెయ్యామా? అనేది సిరీస్ లో చూడాలి. మేకింగ్ క్వాలిటీ, యాక్టర్స్ పర్ ఫార్మెన్స్, ట్రైలర్ లో ట్విస్ట్ లు ఆకట్టుకునేలా ఉన్నాయి. కొన్ని కథలు మొదలుపెట్టడం సులువు, ముగించడం కష్టం, కథలకు ముగింపు ఇద్దామా అనే డైలాగ్స్ "అతిథి" పై ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.. ఈ నెల 19 నుంచి "అతిథి" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

# 'ఛాంగురే బంగారురాజా' 15న



మాస్ మహారాజా రవితేజ ప్రొడక్షన్ బ్యానర్ ఆర్‌టి టీమ్‌వర్క్స్ మరో కాన్సెప్ట్ బేస్డ్ చిత్రం 'ఛాంగురే బంగారురాజా' తో రాబోతోంది. సతీష్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మిస్తున్నారు. శ్వేత కాకర్లపూడి, షాలిని నంబు ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రోడ్యూసర్స్. ఈరోజు సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ 15న వినాయక చవితి సందర్భంగా 'ఛాంగురే బంగారురాజా' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండగ సెలవు సినిమాకి బాక్సాఫీస్ దగ్గర ఫేవర్ కానుంది. ప్రధాన తారాగణంతో కూడిన రిలీజ్ డేట్ పోస్టర్ హ్యూమరస్ గా ఆసక్తిని రేకెత్తిస్తుంది.

' కంచరపాలెం', 'నారప్ప' ఫేమ్ కార్తీక్ రత్నం హీరోగా నటిస్తుండగా, గోల్డీ నిస్సీ హీరోయిన్. రవిబాబు, సత్య ఈ చిత్రంలో ఇతర ప్రధాన తారాగణం. మేకర్స్ ఇదివరకే ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసారు. ఇది ప్రధాన పాత్రలు, కథాంశాన్ని పరిచయం చేసింది. టీజర్‌కి చాలా మంచి స్పందన వచ్చింది. కృష్ణ సౌరభ్ సంగీతం సమకూరుస్తుండగా, సుందర్ ఎన్‌సి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జనార్ధన్ పసుమర్తి డైలాగ్స్ రాసిన ఈ చిత్రానికి కార్తీక్ వున్నవా ఎడిటర్. త్వరలో 'ఛాంగురే బంగారురాజా' ట్రైలర్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

నటీనటులు: కార్తీక్ రత్నం, సత్య, రవిబాబు, గోల్డీ నిస్సీ, నిత్య శ్రీ, ఎస్తర్ నోరోన్హా, అజయ్ తదితరులు

# ట్రెండింగ్ లో 'సౌండ్ పార్టీ' ఫస్ట్ లిరికల్ వీడియో సాంగ్!!




ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందుతోన్న చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటిస్తున్నారు. రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. జయ శంకర్ సమర్పణ. సంజయ్ శేరి దర్శకుడు. ఈ చిత్రం టీజర్ ఇప్పటికే విడుదలై టాలీవుడ్ లో గట్టిగానే సౌండ్ చేసింది. ఇక ఇటీవల ఈ చిత్రం నుండి 'మని మని మని మనీ దీని ముఖములు సోమెనీ' అనే లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ప్రజంట్ ఈ సాంగ్ యూట్యూబ్ లో వైరల్ అవుతోంది. డబ్బు ప్రాధాన్యత గురించి యువ రచయిత పూర్ణచారి ప్రజంట్ ట్రెండ్ కి కనెక్టయ్యే విధంగా పాట రాయగా మోహిత్ రెహమానిక్ దానికి తగ్గట్టుగా మాంచి బీట్ తో కంపోజ్ చేశారు. యూట్యూబ్ లో వైరల్ అవుతోన్న ఈ సాంగ్ మంచి వ్యూస్ తో రీల్స్ తో హల్ చల్ చేస్తోంది. ఫస్ట్ లిరికల్ తోనే మంచి బజ్ క్రియేట్ చేసిన 'సౌండ్ పార్టీ ' చిత్రం ఇటు ఇండస్ట్రీలో అటు ఆడియన్స్ లో రీ -సౌండ్ సృష్టించడం ఖాయం అనడంలో సందేహం లేదు. శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంటోన్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ అధినేత రవి పోలిశెట్టి మాట్లాడుతూ..."ఎప్పుడైతే మా 'సౌండ్ పార్టీ' చిత్రం టీజర్ విడుదలైందో అప్పటి నుంచి మా 'సౌండ్ పార్టీ' చిత్రానికి మంచి మంచి బజ్ వచ్చింది. ముఖ్యంగా టీజర్ లో వీజే సన్నీ, శివన్నారాయణ చెప్పిన డైలాగ్స్ తో సినిమాలో ఎలాంటి హ్యూమర్ ఉండబోతుందో అర్థమవుతోంది. ఇక ఇటీవల రిలీజ్ అయిన 'సౌండ్ పార్టీ' టైటిల్ ట్రాక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం పాటలు సినిమాకు ఎంత ప్లస్ అవుతున్నాయో, సినిమాను పబ్లిక్ లోకి ఏ విధంగా తీసుకెళ్తున్నాయో చూస్తున్నాం. ఈ తరుణంలో మా సినిమా నుండి రిలీజైన ఫస్ట్ లిరికల్ సాంగ్ కి మంచి రెస్పాన్స్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. త్వరలో మిగతా పాటలు రిలీజ్ చేయనున్నాం. మా సంగీత దర్శకుడు మోహిత్ రెహమానిక్ అద్భుతమైన పాటలతో పాటు సినిమాను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లే విధంగా బ్యాక్ గ్రౌండ్ స్కోరు చేశారు. అలాగే సమర్పకుడు జయ శంకర్ , దర్శకుడు సంజయ్ శేరి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తున్నారు

# నన్ను బాగా నవ్వించిన చిత్రమిదే

## 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కి స్టార్ హీరోయిన్ సమంత ప్రశంసలు



యంగ్ టాలెంటెడ్ హీరో నవీన్ పొలిశెట్టి, స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి జంటగా నటించి రీసెంట్ గా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకొచ్చింది క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ సినిమాకు ఆడియెన్స్ తో పాటు సెలబ్రిటీల అప్రిషియేషన్స్ దక్కుతున్నాయి. ఈ సినిమా ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, స్టార్ డైరెక్టర్ మారుతి మెప్పు పొందగా..తాజాగా స్టార్ హీరోయిన్ సమంత 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమాపై ప్రశంసలు కురిపించింది.

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా చూశాక స్టార్ హీరోయిన్ సమంత ఇన్ స్టాగ్రామ్ ద్వారా స్పందిస్తూ. ఇటీవల కాలంలో ఏ సినిమా నన్ను ఇంతగా నవ్వించలేదు. అనుష్క ఛార్మింగ్ గా కనిపించింది, నవీన్ పోలిశెట్టి సూపర్బ్ పర్ ఫార్మెన్స్ చేశాడు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' టీమ్ అందరికీ కంగ్రాట్స్. అని పోస్ట్ చేసింది.

రీసెంట్ గా రిలీజైన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుని సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ పాజిటివ్ టాక్ కు తగినట్లే మంచి వసూళ్లు దక్కించుకుంటోంది. యూఎస్ లో 550 కె డాలర్స్ మార్క్ చేరుకున్న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' వన్ మిలియన్ మైల్ స్టోన్ వైపు దూసుకెళ్తోంది. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మాణంలో దర్శకుడు మహేష్ బాబు.పి తెరకెక్కించారు.

**Printed, Published and Owned by** KIRAN KUMAR UDARA and **Printed** at Arunodaya Notebook Manufacturers Private Limited. D. No. 33-5-9, Papaiah Street, Seethramapuram, Vijayawada-520002 (Andhrapradesh) and **Published at:** D.No. 54-17-15, ITI road, Vijayawada - 520008, A.P.,Ph:**8340909999**
**Editor** : KIRAN KUMAR